www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
26-09-2024

సంపుటి : 01 । సంచిక : 144 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

### 44 ఏళ్లలో తొలిసారి!

- అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే చేశాం
- ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదన్న చైనా రక్షణ శాఖ

10





## రాష్ట్రాన్ని దోచుకుంటున్న సీఎం రేవంత్ సోదరులు

**ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్న మంత్రులు**

**వారికి రక్షణకవచంగా నిలుస్తున్న బీజేపీ ఎంపీలు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**

**కాంగ్రెస్ హామీల వారీగా కమిటీలు వేస్తామని వెల్లడి**

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ఇచ్చిన హామీల వారీగా కమిటీలు వేస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. వాటి అమలు కోసం ఆ బృందం షాడో గవర్నమెంట్ తరహాలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ భవన్‌లో జరిగిన హన్మకొండ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్‌తో పాటు మండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ, ఈ దఫాలో ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి కూడా అనుకోలేదని ఆయన దోస్తులే తనకు చెప్పారని అన్నారు. 2028లో సీఎం అవుదామనుకొని నోటికొచ్చినట్లు అడ్డగోలు అబద్ధాలు చెప్పారని ఎద్దేవా చేశారు. కొత్త పథకాలు కాదు ఉన్నవి ఇస్తేనే ఈ ముఖ్యమంత్రి గొప్ప అని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తానని మోసం చేశారని ధ్వజమెత్తారు. చిట్టి నాయుడు వాళ్ల అన్నదమ్ములు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. మిగతా2లో...



## త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం



**ఉపాధి లేక యువత చెడు వ్యసనాల బాట**

విద్యార్థుల నైపుణ్య శిక్షణ ప్రభుత్వం బాధ్యత

వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ లో ఇంటర్న్ షిప్

38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రొగ్రాం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చటంతో పాటు... నైపుణ్యాల అభివృద్ధి చిరునామాగా తీర్చిదిద్దుతామని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడే సాంకేతిక నైపుణ్యాలు నేర్పించే గమ్యస్థానంగా హైదరాబాద్ ను విశ్వ వేదికపై నిలబెట్టేందుకు అందరి సహకారం కావాలని మిగతా2లో...

## దసరాకు ఇందిరమ్మ కమిటీలు

**విధివిధానాలు రూపొందించండి...**

**పీఎంఏవై నుంచి గరిష్ఠంగా ఇళ్లు సాధించాలి...**

**రాజీవ్ స్వగృహ ఇళ్లకు వేలం...**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



2

## బీసీల కుల గణన ఛాంపియన్ రాహుల్

**కులాలు ఉన్నంత వరకు రిజర్వేషన్లు ఉంటాయన్న ఖర్గే**

**కామారెడ్డి డిక్లరేషన్ కార్యాచరణపై సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**



3

## ఈనెల 28న తిరుమలకు కాలినడకన వైఎస్ జగన్

- అదే రోజు అన్ని ఆలయాల్లో వైసీపీ పూజలు
- తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు మంట గలిపారని ఆరోపణ

2



## నిజాయితీ లేకుండా అధికారం మీకు అంగీకారమేనా?

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ**

**ఐదు ప్రశ్నలు సంధించిన ఆప్ కన్వీనర్..!**



10

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 125 | ₹ 147 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 213 | ₹ 243 |

## పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

**12 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మంత్రి జూపల్లితో కలిసి ఉదండాపూర్, గట్టు ఎత్తిపోతల పథకాల సందర్శన**



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటిని ఈ శాసనసభ కాలంలోనే పూర్తిచేసి 12లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. మరో మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఆర్థిక, నీటిపారుదలశాఖ అధికారులు, ప్రజాపతినిధులతో కలిసి ఆయన బుధవారం జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్, గట్టు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. నిర్వాసితులకు అన్ని రకా లుగా న్యాయం చేస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు - రంగారెడ్డికి 27వేల 500 కోట్లు ఖర్చు చేసి ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మిగతా2లో...

## చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు

**అదే నా జీవిత లక్ష్యం ○ బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య**

**ఎంపీ మల్లు రవితో భేటీ**



**విశ్వంభర, హైదరాబాద్:** చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే తన జీవిత లక్ష్యమని బీసీ ఉద్యమ నేత , రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్. కృష్ణయ్య తెలిపారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవితో బుధవారం భేటీ అనంతరం ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాధికారం మిగతా2లో...

## వైఫల్యాలకు బాధ్యత ఎవరిది?

- అకౌంట్స్ అధికారులపై జస్టిస్ ఘోష్ ప్రశ్నల వర్షం
- కాళేశ్వరానికి నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపుల అంశాలపై ఆరా

2



## మూసీ...జాగ్రత్తగా చూసి!

- మూడు జిల్లాల పరిధిలో తిరిగి సర్వే
- నిర్వాసితులకు అండగా నిలిచేలా ప్రభుత్వం సన్నాహాలు
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- అపోహలకు లోను కావొద్దని వినతి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళలో కీలక అడుగు పడింది. నది అభివృద్ధిలో భాగంగా నివాసాలు కోల్పోయే వారికి పునరావాసం కల్పించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ మిగతా2లో...



2

# రాష్ట్రాన్ని దోచుకుంటున్న సీఎం రేవంత్ సోదరులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు రాష్ట్రం మీద స్వైర విహారం చేస్తూ దోచుకుంటున్నారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్రం మీద, ప్రజల మీద ప్రేమ లేదని పైసలు సంపాదించుకోవడం మీదే ఉందని అన్నారు. కాంగ్రెస్ మీద తాము పోరాటం చేస్తుంటే బీజేపీ ఎంపీలు వాళ్లకు రక్షణ కవచంగా వస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రకటించిన అన్ని డిక్లరేషన్‌ల మీద పోరాడుతున్నామని నిత్యం కాంగ్రెస్ పార్టీ అవినీతిని ఎండగట్టాలని నేతలకు పిలుపునిచ్చారు. కుంభకోణాలు చేసే నేతల బుద్ధి మారదని వరంగల్‌లో భూకబ్జాలు జరుగుతున్నాయని తెలియజేశారు. డీఎంకే పార్టీ 76 ఏళ్లుగా తమిళనాడులో రాజకీయాలను శాసిస్తోందని గుర్తు చేశారు. పార్టీ నుంచి పోయిన చెత్త అంతా పోనివ్వండని, గతంలో జరిగిన తప్పులు జరగకుండా చూసుకొని పార్టీని మంచిగా నిర్మాణం చేసుకుందామని అన్నారు. పెద్దపెద్ద నాయకులు మంచి పదవులు అనుభవించి రేవంత్‌రెడ్డి చుట్టూ తిరుగుతున్నారని పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పుతో వారికి భయం మొదలైందని కేటీఆర్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఉపఎన్నికకు రాజయ్య అభ్యర్థి అని ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఓటమి కూడా మంచిదేనని వ్యాఖ్యానించారు. గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుందని, చిట్టి నాయుడు ఉంటేనే కదా కేసీఆర్ విలువ తెలిసేది అని వ్యంగ్యంగా విమర్శించారు. ప్రభుత్వం తీరు చూసి కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్రంలో ప్రజలంతా ఇప్పుడు గులాబీ కండువా వైపే చూస్తున్నారని ఆయన తెలిపారు.

# ఈనెల 28న తిరుమలకు కాలినడకన వైఎస్ జగన్

**అమరావతి :** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు ఆరోపణలు చేసి తిరుమల ఆలయ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను మంటగలిపారని పేర్కొంటూ వైసీపీ ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేపట్టాలని వైఎస్ జగన్ ఎక్స్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి వద్దకు మెట్ల మార్గాన వెళ్లనున్నారు. వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను దెబ్బతీయడమే కాకుండా రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడుతున్నాని దుయ్యబట్టారు. జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా, అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

# దసరాకు ఇందిరమ్మ కమిటీలు

**హైదరాబాద్:** దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ/ వార్డు, మండల/ పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా... అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వి.పి.గౌతమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

కోసం పోరాటం చేయాలని ప్రతి ఒక్క బీసీ బిడ్డను కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు. "రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా చేయబోతున్నాం. బీసీ ఉద్యమం బలోపేతం కోసం రాజ్యసభ పదవికి రాజీనామా చేశాను. ఈ ఉద్యమం ద్వారా దేశ వ్యాప్తంగా బీసీలకు న్యాయం జరిగేలా పోరాడుతాను. వివిధ పద్ధతుల్లో ఉద్యమాలు చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ వర్గాలకు న్యాయం చేయడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడుస్తున్నప్పటికీ బీసీలకు న్యాయం జరగడం లేదని బీసీ బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు" అని ఆర్ కృష్ణయ్య తెలిపారు. " వైసీపీ అధినేత జగన్ నన్ను రాజ్యసభకు పంపించారు. బీసీల తరపున చట్ట సభల్లో ప్రశ్నించినా సమాధానం రాలేదు. ఇంకా నా పదవీకాలం నాలుగేండ్లు ఉంది. కానీ బీసీ ఉద్యమం కోసం రాజీనామా చేశాను. రాజ్యాధికారంలో వాటా.. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. అసెంబ్లీ ఎన్నికల్లో 21 సీట్లు బీసీలకు ఇచ్చారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి. బీసీల కోసం చాలా త్యాగాలు చేయాల్సి వస్తుంది. గ్రామ, మండల,జిల్లా కమిటీలు వేయాలని బీసీలను కోరుతున్నా " నని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్‌లోకి ఆహ్వానం?**

రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన బీసీ నేత ఆర్.కృష్ణయ్యతో బుధవారం ఉదయం నాగర్‌కర్నూలు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి భేటీ అయ్యారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆర్ కృష్ణయ్య నివాసానికి ఆయన వెళ్లారు. దాదాపు అర గంటకు పైగా మల్లు రవి చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కృష్ణయ్యను మల్లు రవి ఆహ్వానించినట్లు సమాచారం.

# త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం మాసబ్‌ట్యాంక్ జేఎన్‌టీయూ ఆడిటోరియంలో రాష్ట్రంలోని 38 కాలేజీల్లో బీఎఫ్‌ఎస్‌ఐ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, బీఎఫ్‌ఎస్‌ఐ కన్సార్టియం ప్రతినిధులు మమతా మాదిరెడ్డి, రమేష్ ఖాజా, ఎక్విప్ సంస్థ ప్రతినిధులు హేమంత్ గుప్తా, జి.సాయికిరణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎక్విప్ సంస్థ రూ. 2.5 కోట్ల చెక్కును ముఖ్య మంత్రికి అందించింది. విద్యార్థుల డేటాతో రూపొందించిన ఎక్విప్ స్కిల్ పోర్టల్ ను ముఖ్యమంత్రి ఈ వేదికపై ఆవిష్కరించారు.

**పదేళ్లలో పెరిగిన నిరుద్యోగం**

తెలంగాణలో గత పదేండ్లలో నిరుద్యోగం పెరిగిందని, గత పదేండ్లలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీఎస్పీఎస్సీ వెబ్ సైట్లోనే 30 లక్షల మంది నమోదు చేసుకున్నారని, రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు వీధిన పడే పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామన్నారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, తదితర ఉద్యోగాలన్నీ కలిపి మరో 35 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే రెండు మూడు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గత పదేండ్లలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనందుకు రాష్ట్రంలో కొంత మంది యువత గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసయ్యారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పట్టుబడిన డ్రగ్ పెడలర్స్ లో ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ఉండటం ఆందోళన కలిగించిందని అన్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. వ్యసనాల నుంచి యువతను బయటపడేయాలంటే ఉపాధి కల్పించాల్సిన అవశ్యముందన్నారు.

**యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాం**

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న యువతను తయారు చేసి.. ఉపాధికి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే బీఎఫ్‌ఎస్‌ఐ ప్రతినిధులతో చర్చలు జరిపామని, వారు ఇచ్చిన ప్రతిపాదనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు డిగ్రీలో చేరిన పది వేల మంది డిగ్రీ విద్యార్థులు తమ పట్టా పొందే నాటికి నైపుణ్యాన్ని నేర్చుకునేలా ఈ ప్రోగ్రాం రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగంలో ఉద్యోగాలకు ఢోకా ఉండదని అన్నారు. అవసరమైన నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎక్విప్ సంస్థను, ఈ కోర్సు సిలబస్సు రూపొందించిన బీఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



## నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు దక్కవు

ప్రతిభ ఉన్నా, నైపుణ్యం లేకపోతే యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కవని సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఏటా మూడు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొంది కాలేజీల నుంచి బయటకు వస్తున్నారని, కానీ ఇండస్ట్రీ అవసరాలకు సంబంధించిన నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అన్నారు. అటు పరిశ్రమలకు తమ సాంకేతిక నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కుంటున్నాయని అన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని అన్నారు. అందులో భాగంగానే యువతకు నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. డిగ్రీలు, ఇంజనీరింగ్ విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఇంటర్న్ షిప్ కూడా ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జీ కూడా సమకూరుతుందని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు, కనీస ప్రమాణాలు ఉండటం లేదని సీఎం అన్నారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు.

**ఉద్యోగాలే లక్ష్యంగా వినూత్న కోర్సు**

డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయని, చదివిన డిగ్రీకి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు గ్యాప్ ఉంటోందని సీఎం అన్నారు. బీఎఫ్‌ఎస్‌ఐకు అవసరమైన స్కిల్స్ నేర్పేందుకు ఈ కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు అందించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ఐటీఐ,పాలిటెక్నిక్ కాలేజీలను అప్‌గ్రేడ్ చేస్తాం**

టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, ఇప్పటికే మల్లేపల్లి ఐటీఐలో పైలెట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు చెప్పారు. దీంతో ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం లభిస్తుందని అన్నారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్నిఐటీఐలను ఏటీసీలుగా మారుస్తామని అన్నారు. ఇటీవలే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం నెలకొల్పిందని, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను బోర్డు ఛైర్మన్ గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఏటా వేలాది మంది యువతకు వివిధ రంగాల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే పాలిటెక్నిక్ కాలేజీలను అప్ గ్రేడ్ చేస్తామని అన్నారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ , స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసి, తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని వివరించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదివిన వారు ప్రపంచంలోనే పెద్ద సంస్థలకు సీఈవోలుగా ఉన్నారని, అలాంటి వారి సహకారం తీసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని సీఎం చెప్పారు.

# పాలమూరు జిల్లా ప్రాజెక్టుల పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కనీసం ప్రాజెక్టుకు నీటివాటా సాధించలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్‌ఎండ్‌ఆర్‌కు రూ.45 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. పాలమూరు -రంగారెడ్డి పూర్తైతే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని ఆ చిత్తశుద్ధితోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఉదండాపూర్‌తో పాటు, ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామని వెల్లడించారు. గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈఎన్‌సీని మంత్రులు ఆదేశించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు లిఫ్ట్‌ఇరిగేషన్లతో పాటు అన్ని ప్రాజెక్టులను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని ఉత్తమ్ వెల్లడించారు.

**నిరసన వ్యక్తం చేసిన ఉదండాపూర్ భూ నిర్వాసితులు**

ఎన్నికలకు ముందు ఉదండాపూర్ భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రాజెక్టులు పనులు ఎలా మొదలు పెడతారని మంత్రుల పర్యటన సందర్భంగా బాధితులు నిరసనకు దిగారు. ఉదండాపూర్ జలాశయాన్ని మంత్రులు ఉత్తమ్, జూపల్లి సందర్శించినప్పుడు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ మల్లురవితో నిర్వాసితులు వాగ్వాదానికి దిగారు. ఇచ్చిన మాట ప్రకారం ప్యాకేజీ, వ్యవసాయ భూముల పరిహారాన్ని పెంచాలని కోరారు. పునరావాసం పూర్తయ్యే వరకు ప్రాజెక్టు పనులు జరగనివ్వబోమని భూనిర్వాసితులు హెచ్చరించారు. పరిహారం పెంపుపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వివరించారు. ప్రస్తుతం మూడు తండాలకి ప్యాకేజీ డబ్బులు చెల్లించామని, వల్లూరు, ఉదండపూర్ గ్రామాలకు సైతం త్వరలోనే నగదు జమచేస్తామని చెప్పారు.

**శంకర సముద్రం జలాశయం పనుల పరిశీలన**

భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా కొత్తకోట మండలం కానాయపల్లి వద్ద నిర్మించిన శంకర సముద్రం జలాశయం పనులను మంత్రి ఉత్తమ్, జూపల్లి పరిశీలించారు. ఆ జలాశయం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చిన్నచిన్న సమస్యలతో పూర్తిస్థాయిలో అందించలేక పోతున్నట్లు జూపల్లి ఉత్తమ్ దృష్టికి తెచ్చారు. జలాశయాన్ని పూర్తి చేయాలంటే పునరావాసం ప్రధాన సమస్యగా మారిందని, 300 కుటుంబాలకు అన్ని వసతులతో పునరావాసం కల్పించాల్సి ఉందని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఉత్తమ్ దృష్టికి తెచ్చారు. పునరావాసానికి రూ.75కోట్లు, ఆనకట్టకి మరో రూ.10 కోట్లు కేటాయిస్తే శంకర సముద్రం పూర్తి చేసి సాగునీరు ఇవ్వవచ్చని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంత్రికి వివరించారు. పునరావాసానికి ఏర్పాటు, కాలువల నిర్మాణానికి ఎంత ఖర్చుచేస్తే అదనంగా ఎంత ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చో వారంలో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఉత్తమ్ ఆదేశించారు. అక్కన్నుంచి నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ఉత్తమ్ పరిశీలించారు.



## త్వరలోనే కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తాం

అంజనగిరి జలాశయం హెడ్‌రెగ్యులటర్, సర్జ్ పూల్, ప్రధాన కాలువ, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల డెలివరీ సిస్టంలను పరిశీలించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్వాసితులైన బోడబండ తండా, హేమనాయక్ తండా, లచ్చునాయక్ తండా, అంజనగిరి నిర్వాసితులతో భేటీఅయ్యారు. న్యాయం చేయాలని నిర్వాసితులు కోరగా మానవతా దృక్పథంతో పరిశీలిస్తామని త్వరలో కమిటీ వేసి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని ఉత్తమ్ భరోసా ఇచ్చారు. కె.ఎల్.ఐ, పాలమూరు రంగారెడ్డి ప్రధాన కాలువల లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# మూసీ...జాగ్రత్తగా చూసి!

(మొదటి పేజీ తరువాయి)

డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. హైదరాబాద్ మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదీ గర్భంలో నిర్మాణాలను తొలగించడానికి అధికారులు రంగంలోకి దిగారు. అర్హులైన నిర్వాసితులకు రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించేందుకు మరోసారి క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలు, నివాసాల యజమానుల నుంచి ఇంటి పత్రాలు, ఆధార్ సహా ఇతర ముఖ్య వివరాలను సేకరిస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా మూసీ నది నిర్వాసితులకు జీహెచ్‌ఎంసీ పరిధిలో రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించనున్నారు. అంతేకాకుండా నివాసాలు కోల్పేయే పేదలకు పరిహారం చెల్లించాకే భూసేకరణ చేస్తామని, ఆ తర్వాతే నిర్మాణాలను కూల్చివేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే తమ పరిధిలోని మూసీ నది గర్భంలోని నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు మూడు జిల్లాల పరిధిలో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మొత్తం 2,166 నిర్మాణాలుంటున్నట్లు గుర్తించారు.

**మూడు జిల్లాల్లో రీసర్వే :** హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595 మంది, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 మంది నిర్వాసితులు ఉన్నట్లు తేల్చారు. వారందరు నష్టపోకుండా ఉండేందుకు అధికారులు మరోసారి పూర్తి స్థాయిలో సర్వే చేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నాలుగు బృందాలుగా ఏర్పడి గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలోని మూసీలో సర్వే నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టర్ ఆదేశాలతో 16 బృందాలు రంగంలోకి దిగాయి. ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు, దస్తావేజులు, కరెంట్ బిల్స్, అనుమతులకు సంబందించిన ఇతర పత్రాలను పరిశీలిస్తున్నారు.

**నిర్వాసితుల వివరాల సేకరణ :** అధికారుల గతంలో ప్రాథమికంగా యాప్‌లో నమోదు చేసిన వివరాలతో సరిపోలుస్తూ అదనపు వివరాలను తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఇళ్లకు వరద ముంపు ఉంటుందని, నివాసానికి అనువుగా ఉండదని అధికారులు యజమానులకు వివరిస్తున్నారు. మూసీ నదిలో నిర్మించుకున్న వాటికంటే పక్కాగా రెండు పడకల గదుల ఇళ్లను ఇవ్వడం జరుగుతుందని, ఖాళీ చేయించే సమయంలో రవాణా ఖర్చు కూడా ప్రభుత్వం భరిస్తుందని నిర్వాసితులకు చెబుతున్నారు. అలాగే వాణిజ్య పరంగా కూడా ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయి? వాటికి సంబంధించిన ఆధారాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు.

**అపోహలకు లోనుకావద్దు:** ఈ సర్వే పూర్తయిన అనంతరం అర్హులను గుర్తించి జీహెచ్‌ఎంసీ పరిధిలో రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించనున్నారు. ఆ తర్వాతే నది గర్భంలో ఉన్న నిర్మాణాల తొలగింపు చేపడతామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ స్పష్టం చేశారు. బఫర్ జోన్‌కు సంబంధించి పునరావాస చట్టం ప్రకారం పరిహారం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, ప్రభుత్వ అనుమతితో పరిహారం చెల్లించాకే భూసేకరణ చేస్తామని దాన కిషోర్ వెల్లడించారు. మూసీ పరిధిలో ఉన్న నిర్వాసితులు అనవసరమైన అపోహలకు లోను కావద్దని, అర్హులందరికీ పునరావాసం కల్పిస్తామని పేర్కొన్నారు.



# వైఫల్యాలకు బాధ్యత ఎవరిది?

**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఆర్థిక స్థోమత, క్రమశిక్షణా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ అధికారులను ప్రశ్నించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్ చీఫ్ ఫణిభూషణ్ శర్మ హాజరయ్యారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా వారిని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపులు, సంబంధిత అంశాలపై ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, సిబ్బంది, ఉద్యోగుల జీతాలు, చెల్లింపుల గురించి ఆరా తీశారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొని బిల్లులు వెంటనే చెల్లించకుండా బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు చెప్పిన వెంకట అప్పారావు, వాటి ద్వారా వచ్చిన మొత్తాన్ని కార్పొరేషన్ నిర్వహణ కోసం వాడినట్లు తెలిపారు. కార్పొరేషన్ ట్రేడింగ్ బ్యాలెన్స్ అకౌంట్స్ ప్రతి సంవత్సరం చెక్ చేస్తారా, రుణాలు ఎవరి ఆదేశాల మేరకు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, కార్పొరేషన్ బోర్డు ఆమోదం తర్వాత రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు రుణాలు తీసుకున్న తర్వాత ఏమైనా ఆస్తులు వచ్చాయా అని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రస్తుతం కార్పొరేషన్‌కు ఎలాంటి ఆదాయం లేదని, ఆస్తులు రాలేదన్న అధికారులు, బిల్లుల చెల్లింపులు నిబంధనల ప్రకారమే జరిగాయని తెలిపారు. కాగ్ నివేదిక గురించి అకౌంట్స్ అధికారులను జస్టిస్ పీసీ ఘోష్ అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లుల చెల్లింపు విషయంలో కాగ్ నివేదికతో అంగీకరిస్తారా అని ప్రశ్నించారు. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా కాగ్ నివేదిక ఇచ్చిందన్న అధికారులు, ఆర్థిక స్థోమత, క్రమశిక్షణా వైఫల్యం విషయంలో తాము స్పందించలేమని తెలిపారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. పలు ప్రశ్నలకు తనకు సంబంధం లేదు, తెలియదని, చెప్పలేనని పద్మావతి సమాధానం ఇచ్చారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉండి తెలియదంటే ఎలా అన్న కమిషన్, ఖజానాపై అంత భారం పడుతుంటే పట్టింపు లేదా అని ప్రశ్నించారు.

# కొడుకు అత్యాచారం...తల్లి కాపలా!

- చున్నీతో ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరణ
- పెళ్లి చేసుకొమ్మన్నందుకు దారుణం
- యువతి మృతి కేసును ఛేదించిన వాడపల్లి పోలీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** పెళ్లి చేసుకోవాలని అడిగిన పాపానికి ప్రియుడే బావతో కలసి యువతిపై అత్యాచారం చేశాడు. అనంతరం మెడకు చున్నీ బిగించి చంపేశాడు. కొడుకు అత్యాచారం చేస్తున్న సమయంలో అతడి తల్లే కాపలా ఉండటం గమనార్హం. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం పుట్టలగడ్డ తండాలో ఓ యువతి(19) అనుమానాస్పద మృతి కేసు విచారణలో వెల్లడైన ఈ నిజాలు సమాజాన్ని నివ్వెరపరుస్తున్నాయి. ఈనెల 14న అనుమానాస్పద మృతి కేసు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూపావత్ నాగు అనే వ్యక్తి ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసి మొహం చాటేశాడు. ఆ బాధిత యువతి, నాగులు ఇద్దరు గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కొద్ది రోజులుగా యువతి పెళ్లి విషయం మాట్లాడేసరికి నాగు తప్పించుకుంటుండేవాడు. యువతి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండేది. ప్రియురాలు ఈ మధ్య ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. పైగా యువతి ఫోన్ నంబరును బ్లాక్ చేసేశాడు. ఇది గమనించిన ఆ అమ్మాయి నేరుగా నాగు ఇంటికి పుట్టలగడ్డకు రాత్రి 7 నుంచి 8 గంటల సమయంలో వెళ్లింది. నాగు ప్రేమించిన విషయం, పెళ్లి సంబంధిత అంశాలను నాగు తల్లి బుజ్జికి చెప్పింది. వెంటనే బుజ్జి ఆ యువతిని మందలించి పంపించేసింది.

అనంతరం ఆ యువతిని వదిలించుకోవడానికి నాగు అతని బావ క్రాంతి కుమార్‌తో కలిసి ప్లాన్ వేశాడు. ఊరు నుంచి వెళ్తున్న ఆ అమ్మాయిని నమ్మించి బావ క్రాంతి, తల్లి బుజ్జి సహాయంతో పుట్టలగడ్డ తండా వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. బలవంతంగా యువతిపై నాగు, క్రాంతి కుమార్ అత్యాచారం చేశారు. అత్యాచారం చేస్తున్న సమయంలో ప్రియుడు నాగు తల్లి బుజ్జి కాపలా ఉంది. అత్యాచారం అనంతరం యువతి మెడకు చున్నీని గట్టిగా బిగించి చంపేశారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు నమ్మించేలా అక్కడే ఉన్న చెట్టుకు వేలాడదీసి ఏమీ తెలియనట్టు వెళ్లిపోయారు.తెల్లారేసరికి యువతి మృతి చుట్టు

# విద్యార్థి బంగారు భవిష్యత్తుకై అవగాహన సదస్సు




**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యార్థులు జీవితంలో గొప్పగా స్థిరపడాలంటే ఉన్నతమైన లక్ష్యం అవసరం. దానికోసం మన ప్రతి అడుగు ముఖ్యమైనది ప్రతి విద్యార్థి ఏ దిశగా ప్రయాణించి ఎలా చదివితే గమ్యాన్ని చేరుకుంటాడో తెలియక సందిగ్ధముతో సతమతమవుతూ ఉంటారు. వారికి అవగాహన కల్పించుట కొరకే ఈ అవగాహన సదస్సు. మంచి సమాజా నిర్మాణానికి యువత ఎంతైనా అవసరం నవ సమాజ నిర్మాణం కోసం విలువలతో కూడిన విద్య ఎంతైనా అవసరం అంటున్న నారాయణ విద్యాసంస్థలు. ఈ కార్యక్రమంలో విజయ్ టేక్కి గారు హెచ్ ఓ డి సీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా భవిష్యత్తులో ప్రణాళిక చేసుకోవాలి ఎలాంటి విద్యను అభ్యసిస్తే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి అనే విషయంలో విద్యార్థులకు విచ్చేసిన తల్లిదండ్రులకు పూర్తి వివరాలు తెలిపి సందేహాలు తీర్చడంతో పాటు సలహాలు సూచనలు అందిస్తూ విద్యా ఉద్యోగం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గోపాల్ రెడ్డి జి . ఎం. ఏమాంబార్ (ఏ జి ఎం ) ముఖ్య అతిథిగా రాధాకృష్ణ , విజయ్ టెక్కి , ఆర్ ఐ రవి ప్రసాద్ , ప్రిన్సిపాల్ నీరజ గారు ఏవో రమేష్, ఏడి స్వామి ఆధ్వర్యంలో విద్యార్థి ఓరియంటేషన్ సదస్సు దిగ్విజయంగా జరిగింది.

# జోగులాంబ దసరా మహోత్సవాలకు రండి

### మంత్రి సురేఖకు ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే జోగులాంబ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు అటవీ, పర్యావరణ, దేవాదయ ధర్మాదాయ శాఖమంత్రి కొండా సురేఖ కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ మంత్రి సురేఖ హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సంద ర్భంగా మంత్రి సురేఖకు అమ్మవారి శేష వస్త్రాలు, చీరె సమర్పించి తీర్థప్రసాదాలను అందించి, వేదాశీర్వచనం చేశారు.ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలోనే ఏకైక శక్తిపీఠమైన ఆలంపూర్ జోగులాంబ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ ఆలయ ఈవోను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ప్రసాద్ స్కీం నిధు లతో నిర్మించిన నూతన భవనంలో భక్తులకు అన్నదానం, వసతీ కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దే శించారు. జోగులాంబ దేవాలయం లో అక్టోబర్ 3 నుండి 12 వరకు జరిగే దసరా శరన్నవరాత్రి మహో త్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున మంత్రి సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## గాంధీభవన్‌లో
# వినతుల స్వీకరణకు మంచి స్పందన

- మొదటిరోజు సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహా
- పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజలకు ఈ కార్యక్రమంతో మేలు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మంత్రుల గాంధీభవన్ పర్యటన కార్యక్రమానికి మొదటిరోజు మంచి స్పందన వచ్చింది. బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహా ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కొంత మంది కీలక నేతలతో ముఖాముఖి నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం3.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. మొదటి రోజు 208 దరఖాస్తులు వచ్చాయి. వీటి లో ఆరోగ్య సమస్యలు, భూ వివాదాలు, అక్రమ కేసులు, తదితరాలు ఉన్నాయి. 30 మంది ఫిర్యాదులు, సమస్యలను మంత్రి దామోదర అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్ కు సంబంధించిన సమస్యలతో పాటు పలు పోలీస్ స్టేషన్లకు చెందిన వినతులను సంబంధిత అధికారులతో మాట్లాడి మంత్రి పరిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ.. పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అనే తేడా లేకుండా అందరి అర్జీలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అయితే ఒక్కరోజులో అన్నీ పరిష్కారం అవుతాయని అనుకోవడం సరికాదన్నారు. ఒక్కొక్కటి క్రమంగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. గతంలో అసలు సమస్యలు వినేవారే లేరని, కానీ ఇప్పుడు ప్రజల దగ్గరికే ప్రభుత్వం వెళ్తోంన్నారు. ఈ కార్యక్రమంలో తనకు మొదటి రోజే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. బాధితుల నుంచి తీసుకున్న దరఖాస్తులను, సంబంధిత శాఖలకు పంపించామని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

# బీసీల కుల గణన ఛాంపియన్ రాహుల్

**విశ్వంభర, హైదరాబాద్:** బీసీల కులగణన గురించి ధైర్యంగా మాట్లాడుతున్నఛాంపియన్ రాహుల్ గాంధీ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో కులాలు ఉన్నంత వరకు రిజర్వేషన్స్ ఉంటాయని ఖర్గే చెప్పారని అని ఆయన పేర్కొన్నారు. ఎవరికి ద క్కాల్సిన వాటా వారికి దక్కాలనే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపుపై బుధవారం హోటల్ హరిత ప్లాజాలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఇంకా మాజీ ఎంపీ వీహెచ్, బీసీ సంఘాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ డిక్లరేషన్ ను ప్రవేశ పెట్టే బాధ్యతను కూడా రేవంత్ రెడ్డి తనకే ఇచ్చారన్నారు. డిక్లరేషన్ కు ముందు కొన్ని మార్పుల కోసం కూర్చుంటే మీరు చేయండి నేను ఉన్నాను అని రేవంత్ చెప్పారన్నారు. కాళేశ్వరం ఒక పనికిరాని ప్రాజెక్ట్ అని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం కమిట్మెంట్ తో పని చేస్తుందన్నారు. 'కులగణన జరగనది రాష్ట్రంలో ఎన్నికలు అసలు జరగవు.. అసెంబ్లీలో బిల్లు కూడా పెట్టాం.. మరో నాలుగైదు రోజుల్లో కులగణనకు సంబంధించిన విధివిధానాలు రావొచ్చు.. కులగణనపై ఎటువంటి అపోహలు వద్దు.. పీసీసీ అధ్యక్షుడిగా చెప్తున్నా.. కులగణన చేయకపోతే నేను ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రేవంత్ కు చెప్పాను.. కులగణనపై రేవంత్ ఒప్పుకున్నారు.. ముందుకు వెళ్దాం అని సీఎం అన్నారు.. కులగణన మాట తీయగానే బీ ఆర్ ఎస్ వాళ్లు విమర్శలు చేస్తున్నారు.. ఇంపోర్టెడ్ కార్ లలో ఎవరు తిరుగుతున్నారో చూస్తున్నాం.. అందుకే వాళ్లని ఇంటికి పంపించారు. రాహుల్ గాంధీని చూసి బీజేపీ భయపడుతోంది.. అందుకే రిజర్వేషన్లపై మాట మార్చారు. బీజేపీ కులగణన వ్యతిరేకిస్తోంది.. బీసీ ప్రధానిగా ఉన్నాడు అని బిజెపి చెప్తున్నా ఏ బీసీకి న్యాయం జరిగింది? అంబానీ.. అదానీ ఆస్తులు ఎలా పెరిగాయి.! వీరు ఏ వర్గం వాళ్లు.! ఎవరి అండతో వీళ్లు సంపాదిస్తున్నారు.! బీఆర్ ఎస్ తమ పార్టీ అధ్యక్షుడ్ని మార్చగలదా.! బీసీని అధ్యక్షుడిని చేయగలదా.. నాలుగు యూనివర్సిటీల వీసీలు బీసీలకు ఇవ్వాలని కోరాను.. సీఎం ఒప్పుకున్నారు.. సీఎం రేవంత్ కు నాకు ఉన్న సఖ్యత వల్ల పార్టీ, పాలన రెండూ సాఫీగా సాగుతాయి.. బీసీల కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ రైట్.. రాహుల్ గాంధీ మది నుంచి వచ్చిన ఆలోచన.. నేను.. సీఎం ఎవరైనా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే నడుచుకుంటాం.. కులాభిమానం ఉండాలి కానీ కుల పిచ్చి ఉండొద్దు.. అన్ని కులాలు ఒకటిగా ఉండాలి.. రాష్ట్ర ముఖ్యమంత్రికి నిర్దిష్టమైన ఆలోచన ఉంది.. దానికి అనుగుణంగా అడుగులు పడుతున్నాయి..' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.









# జాగ్రత్తగా వినండి... చెవుడు రాకుండా చూసుకోండి

## సెప్టెంబర్ 26...ప్రపంచ చెవిటి వారి దినోత్సవం

ప్రతి సంవత్సరం సెప్టెంబరు చివరి ఆదివారాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డెఫ్ డే (చెవిటివారి దినం)గా జరుపుకుంటారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ ఏర్పాటుకు సంబంధించి 1951 లో ఆమోదం పొందింది. చెవిటి వ్యక్తుల మానవ హక్కుల కోసం సంకేత భాష ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఈ రోజును యూఎన్ జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. బధిరుల ఎదుగుదలకు, అభివృద్ధికి సంకేత భాషలో నాణ్యమైన విద్యతోపాటు ఈ భాషకు సేవల కోసం ఈ రోజు ప్రధాన లక్ష్యంగా ఈరోజును నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ డెఫ్ డేని మొదటిసారి 1958 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. ఇటలీలోని రోమ్ లో వరల్డ్ డెఫ్ డే కి 1951 లో రూపకల్పన చేశారు. ఇది అంతర్జాతీయ ప్రభుత్వేతర సెంట్రల్ ఆర్గనైజేషన్. వినికిడి లేనివారి జాతీయ అసోసియేషన్ లతో కూడి ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 130 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. జాతి , దేశము , మతము, లింగ వివక్ష , ఇతర ప్రాధాన్యాలు , భేదాలు లేకుండా ప్రజలందరికీ సమానత్వం , మానవ హక్కులు , గౌరవ మర్యాదలు ఒకేమాదిరి ఉండాలన్నది ఈ వరల్డ్ డెఫ్ డే సిద్ధాంతం. గణాంకాల ప్రకారం, భూమిపై తొమ్మిది మందిలో ఒకరికి వినడానికి ఇబ్బంది ఉంది. ఈ వ్యాధి కారణాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. వ్యాధి పరిణామాలు, ప్రమాదాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు. ప్రపంచ వ్యాప్తంగా, సుమారు 30 మిలియన్ల చెవిటి మరియు మూగ ప్రజలు ఉన్నారు. 2001 జనాభా లెక్కలు ప్రకారం, ఇండియాలో 2.19 కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. వారు మొత్తం జనాభాలో 2.13% ఉన్నారు. వీరిలో కంటికి, వినికిడికి, మాట, లోకో మోటారు, మానసిక సంబంధమైన వైకలాల్ని కలిగి ఉన్నారు. ఇండియాలో సుమారు 60 మిలియన్లు చెవిటివారు ఉన్నారు. పురుషులకు స్త్రీలకు వేర్వేలు ఆర్గనైజేషన్లు ఉన్నాయి. Delhi foundation of Deaf women , Madras foundation of Deaf Women. సెప్టెంబర్ 26 న " డే ఆఫ్ ది డెఫ్ " భారత దేశంలో జరుపు కుంటారు.చెవిటి వారికి ఆటలకు ఎన్నో స్పోర్ట్స్ అసోషియేషన్లు ఉన్నాయి. " All India sports council of the Deaf " , All India Cricket association of the Deaf" , "Delhi sports council for the Deaf". మున్నగునవి. ఎన్నో చెవిటి , మూగ స్కూల్స్ ఉన్నాయి. మూగవారికి ప్రత్యేక సైన్ లాంగ్వేజ్ ఉన్నది.

చెవిటి పిల్లల కోసం సంస్థలు, సాధారణ విద్యా సంస్థలలో ప్రత్యేక సమూహాలు తెరవ బడతాయి. పిల్లలు వారి



సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలను చదవడం, వ్రాయడం, వేలిముద్రల వర్ణమాలను ఉపయోగించి కమ్యూనికేట్ చేయడం మాత్రమే కాకుండా, సరైన అవగాహనతో, వారి స్వంత అభివృద్ధితో కూడా పని చేస్తారు.

**అనేక కారణాలు**

అపరిశుభ్రమైన నీళ్లలో ఈత కొట్టడం, చెవిలో పిన్నులు, పుల్లలు, ఇయర్‌బడ్స్ పెట్టి తిప్పడం, దుమ్ము ధూళి చేరడం, అకస్మాత్తుగా వినిపించే భారీ శబ్దాల వల్ల చెవి లోపలి పొర దెబ్బతినడం వంటివన్నీ వినికిడి సమస్యకు దారితీయవచ్చు. ఎక్కువ శబ్దంతో టీవీలు చూడడం, మొబైల్ ఫోన్ లో గంటల తరబడి మ్యూజిక్ వినడం, సెల్ ఫోన్ రేడియేషన్.. వీటి వల్ల కూడా సమస్య దరిచేరవచ్చు. ఫోన్ కాల్స్ మాట్లాడేటప్పుడు ఒకే చెవివైపు మొబైల్ పెట్టి ఎక్కువసేపు మాట్లాడ కూడదు. ఇయర్‌ఫోన్స్ వాడినా గంటకు మించి మాట్లాడడం పనికిరాదు. వాల్యూమ్ మితంగానే ఉండాలి. చెవిపోటు వచ్చినప్పుడు చాలా మంది సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మరిన్ని సమస్యలకు దారి తీయవచ్చు. అందుకే వెంటనే ఈఎన్‌టీ డాక్టర్‌ని తప్పనిసరిగా సంప్రదించాలి. సాధారణంగా జలుబు తర్వాత ఎక్కువగా కనిపించే సమస్య చెవి ఇన్ఫెక్షన్. ఇది ముదిరే కొద్దీ చెవిపోటు, జ్వరం, చెవి నుంచి చీము కారే సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే కర్ణభేరి దెబ్బతిని చెవిటి వారిగా మారే ముప్పు ఉంది. స్నానం చేసే సమయంలో నీళ్లుచెవిలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడడం, సైనస్ ఉంటే వెంటనే చికిత్స తీసుకోవటం ఉత్తమం. గులిమి (వాక్స్) ని తీయక పోవడమే మంచిది. ఆకు పసర్లు, నూనెలు వంటివి చెవిలో పోయకూడదు .

# ఎల్లలు దాటిన తెలుగు సాహితీ సౌరభం

Poetry is simply the most beautiful, impressive, and widely effective mode of saying things.
-Matthew Arnold

మనసులో కలిగిన ఒక భావనను మిక్కిలి అందంగా, మిక్కిలి ప్రభావాత్మకంగా, విశాల దృక్పథంతో వ్యక్త పరిచే సాధనం కవిత్వం. అతి తక్కువ పదాలతో విస్తృతమైన భావాలను వెదజల్లే కవిత్వం మరింతగా పాఠకుని మదిలో నాటుకుంటుంది. ఆ విధంగా గొప్ప భావ సాంద్రత తో వచ్చిన ప్రక్రియ నానీలు. వృత్తిరీత్యా దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డ నల్లగొండ జిల్లా నేరడకు చెందిన కవి రాపోలు సీతారామరాజు రాసిన దక్షిణాఫ్రికా నానీలు ఈ కోవలోకి చెందినవే. చక్కని అభివ్యక్తి, గొప్ప భావ స్ఫురణ అవసరమైన చోట అందమైన అంత్యప్రాసలు దక్షిణాఫ్రికా నానీల ప్రత్యేకతలు.

ఖండాలు దాటాను
సంద్రాలు ఈదాను
కవిత్వం రుచి
ఎక్కడైనా ఒక్కటే

కవిత్వం సార్వజనీనమైనదని, దానికి ప్రాంత, భాష భేదాలు లేవని కవిత్వం పట్ల విశాల దృక్పథాన్ని ప్రకటిస్తారు ఈ కవి. విదేశాల్లో జీవిస్తున్నా తన జన్మ భూమి అయిన ఈ నేలపై మమకారం తగ్గని కవి

నాటి తెలంగాణ
కోటి రత్నాల వీణ
నేడు నాలుగుకోట్ల
రాగాల నెరజాణ




అంటూ తెలంగాణ ఉన్నతిని కీర్తిస్తారు. మనం చేసే ప్రతి పని మన పిల్లలు అనుకరిస్తారు. పిల్లల యొక్క ప్రవర్తనకు తల్లిదండ్రులే ప్రత్యక్ష లేదా పరోక్షంగా కారకులవుతారు. ఈ విషయాన్ని నాని లో అందంగా ఆవిష్కరించారు ఈ కవి.

తప్పు ఎందుకు చేశావు?
తండ్రి ప్రశ్న
మీ బాటలోనే నడిచా
కొడుకు జవాబు

సందర్భానుసారంగా ఉటంకించ దగిన కవితా పంక్తులు ఈ నానీలలో ఎన్నో కనిపిస్తాయి. అంత్యప్రాసలు ఈ పంక్తులకు మరింత అందాన్ని చేకూర్చాయి.

ఎన్నాళ్లు బతికావన్నది
నీ వయస్సు
ఎలా బతికావన్నదే
నీ యశస్సు

మనసు ఒక
కల్లోల సింధువు
మరి కన్నీరు
ఉపశమన బిందువు

ఈ విధంగా నానీలంటే గాఢమైన అనుభూతికి చిహ్నమని, సాంద్రతర అభివ్యక్తికి చిరునామా అని కవి పేర్కొన్నాడు. కవిత్వాన్ని నిర్వచిస్తూ కవిత్వమంటే కమ్మని వాక్యాలు మాత్రమే కాదని, కరుణ ఉంటే రసాత్మక కావ్యం అని అభివర్ణించాడు. వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిది అందుకే

అమ్మ నీ కడుపు
తడుముతుంది
మరి నాన్న
నీ వెన్ను తడుతాడు

అంటూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యతను గుర్తు చేస్తాడు. కవిత్వం అంటే కేవలం పదాల పొందిక కాదు. వర్డ్స్ వర్త్ మహాశయుడు అన్నట్లు మనసు నుంచి ఉప్పొంగే భావాల పరంపరే కవిత్వం.

భావాల దుప్పటి
కప్పుకున్నాను
కమ్మని పద్యాన్ని
కలగన్నాను

అంటూ లోతైన భావం ఉన్న పద్యం నిలుస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఏ వ్యక్తి అంతరంగాన్ని పూర్తిగా అధ్యయనం చేయడం మనో విజ్ఞానవేత్తలు కైనా సాధ్యం కాదేమో. మనిషి యొక్క అసలు రూపం తన అంతరాత్మ కే తెలుస్తుందని ఒక నాని లో చక్కగా చెప్పారు.

అద్దం చూపేది
ప్రతిరూపం
అంతరంగం చూపేది
అసలు రూపం

సీతారామరాజు ఒక నానీలో చెప్పుకున్నట్లుగా అతడు అక్షర తపస్వి. అందుకే ప్రవాసంలో ఉన్నా కవిత్వం అతనికి వరమైంది. తాను పుట్టి పెరిగింది పల్లెటూర్లో కనుక తన నానీలలో రైతు జీవనాన్ని కూడా చిత్రించాడు.

రైతన్నా! పంట
బాగా పండించావు
నీ బతుకు పంట
మాత్రం ఎండిందా

అమ్మ చాటలో
బియ్యం చెరుగుతుంది
రైతు పాదాల
చప్పుడు విన్నట్టు ఉంది.

మాతృభాషపై ఎనలేని మమకారం ఉన్న ఈ కవి కేవలం బతుకు తెరువు కోసమే అవసరం మేరకే ఆంగ్ల భాష తో సావాసం చేస్తున్నానని ప్రకటిస్తున్నాడు.

ఆంగ్లమతనికి
బతుకు తెరువు
తెలుగు భాష
జీవన లిపి.

పల్లెలు ప్రకృతికి నిలయాలని, పచ్చదనానికి అలవాల మని ఒకప్పటి మాట. ప్రపంచీకరణ పుణ్యమా అని నేడు పల్లెలు కలుషితమవుతున్నాయి. ప్లాస్టిక్ భూతం పల్లెలను అలుముకున్నది. ఈ విషయమై కవి ఆవేదన వ్యక్తం చేస్తూ

ఊహల్లో మాఊరు పచ్చగానే
వాస్తవంలో
అదిప్పుడు ప్లాస్టిక్ పల్లె

అని ఆవేదన వ్యక్తం చేస్తూ సస్యాన్ని అందించే భూమిని నిర్లక్ష్యం చేయడం అంటే స్తన్యమిచ్చే తల్లి రొమ్మును గుద్దినట్లు అని ఉపదేశిస్తాడు. తాను ప్రస్తుతం నివాసముంటున్న దక్షిణాఫ్రికాపై కూడా తన మమకారాన్ని కురిపిస్తూ

ఆఫ్రికా
చీకటి ఖండం కాదు
ఆదిమానవుడు
అగ్గి వెలిగించిందిక్కడే

వజ్రాలు దొరికే
నేల ఇది
ఓ నల్ల వజ్రము పుట్టింది
పేరు 'మండేలా'

ఈ విధంగా సమాజానికి సందేశాత్మకమైన, భావస్ఫోరకమైన, నానీలను అందించారు సీతారామరాజు. పాల్కురికి సోమనాథుడు చెప్పినట్లు అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని రచన వీరి కవిత్వానికి మరింత వన్నె తెచ్చింది. నా లీల నాన్న గోపి గారి ఆశీస్సులు పుస్తకానికి అదనపు ఆకర్షణ. కవి సంక్షిప్త పరిచయం కూడా మలి ముద్రణలో చేరిస్తే పుస్తకం మరింత పరిపూర్ణం అవుతుంది. ఆధునిక కవిత్వాన్ని ప్రేమించే సాహితీప్రియులు అందరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.


- సాగర్ల సత్తయ్య
7989117415



# అమ్మకు నివాళి

కాలం డేగ రెక్కల కింద
రెప్పవాల్చని కాపలా అమ్మ
పంచడం తప్ప ఎంచడం చేతగాని
ఫలవృక్షం అమ్మ
పిడికెడు గింజలు వొడుపుగా
వండి కడుపునిండా
నింపగల పేర్మికుండ అమ్మ.
నీళ్లూ పాలనూ కలిపి పాలగాను
మార్చి ఏమార్చగల శక్తి
మనిషిగా
మీకు నాకూ ఉండవచ్చుకానీ
పొట్టగిన్నెలో
మమతానురాగాలను రంగరించి
నెత్తురును పాలగా పట్టివ్వగల
మహత్తరశక్తి
అమ్మొక్కతే.
నిలువునా కూలినప్పుడు
నిటారుగా నిలబెట్టగల
ఊపిరికర్ర అమ్మ
సుడిగుండాలతో
శిలాసదృశమైనప్పుడల్లా
వెన్ను నిమిరే వెన్నెల వాన అమ్మ
ప్రపంచప్రస్థానంలో
ప్రత్యామ్నాయం లేని స్థానం అమ్మదే.
మనకు ఊపిరూదిన
అమ్మ ఊపిరితిత్తి ఒత్తిగిలి
మనల్ని హత్తుకున్న
అమ్మ గుండె ఆగిపోయి
పార్థివదేహమైనప్పుడు
తనువంతా అణువణువూ నిండిన అమ్మను
మరువడం మనిషన్నవాడెవడికీ
తనువున్న వాడెవడికీ తరం కాదు
అమ్మ ఆయువును మింగినకాలాన్ని వెక్కిరించి
"స్తైతస్కోపుల చేతిలో పెట్టి
అమ్మనుచిరాయువునుచేయడం
కన్నా ఏంకావాలి!
మనసునిండా అమ్మున్నప్పుడు
మన్నులో ఉన్నా
మిన్నులో ఉన్నా
అమ్మదెప్పుడూ ఆశీర్వాద కరమే
అమ్మదెప్పుడూ అభయ హస్తమే.
అమ్మకు నివాళి
అమ్మకు నివాళి
అమ్మకు అశ్రు నివాళి

- జీ.వి.
9398951271

# సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి



నేడు వర్ధంతి

బంకుపల్లె మల్లయ్యశాస్త్రి ప్రముఖ పండితుడు. రచయిత. ప్రధానంగా సంఘసంస్కర్త. సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన మల్లయ్యశాస్త్రి హైందవ సాంప్రదాయంలో ఉన్న మూఢాచారాలను పూర్తిగా వ్యతిరేకించాడు. స్త్రీ పునర్వివాహం శాస్త్రీయమని అనేక సభలలో వాదించి నిరూపించాడు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి పలు ఉపన్యాసాలు చేశాడు. తన ద్వితీయభార్యకు విద్య నేర్పించి మూడు ప్రబంధాలు, భారత భాగవత పురాణాలను నేర్పించాడు. ఆయన నేర్పిన విద్య, అందించిన ప్రోత్సాహం కారణంగా ఆమె సంగ్రహ రామాయణం, మరికొన్ని గ్రంథాలను రచించ గలిగింది. రజస్వలానంతర పురుష సంయోగార్హ కాలమే స్త్రీలకు వివాహకాలం అన్న సిద్ధాంతాన్ని ప్రకటించాడు. స్త్రీ పునర్వివాహం పూర్వాచారం కాకపోయినప్పటికి శాస్త్రీయంకాబట్టి ఆచరణీయమని వాదించాడు. సతీ శాసనం వచ్చిన తర్వాత పునర్వివాహం అవశ్యకత కలిగినదని వాదించి పత్రికలలో చర్చ కొనసాగించాడు. శారదా చట్టం ప్రతిపాదించిన కాలంలో ఆ చట్టానికి అనుకూలంగా మద్రాసు మొదలైన పలు ప్రాంతాలలో పలు సభలలో చర్చలు చేసి పండితులతో రజస్వలానంతర వివాహమే శాస్త్రీయమని అంగీకరింపజేశాడు. మల్లయ్య శాస్త్రి కుమార్తె కృష్ణవేణమ్మను శతావధాని వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇచ్చి పునర్వివాహం చేశాడు. తన రెండవ భార్యవలన కలిగిన ప్రథమ కుమారుని జనన సమయంలో వారి ఆచారం ప్రకారం నల్లమేకను శక్తికి బలి ఇవ్వవలసి ఉండగా, ఆ ఆచారాన్ని విసర్జించాడు. శాఖాంతర వివాహం చేసి ఆకాలంలో ఆదర్శంగా నిలిచాడు. అస్పృశ్యత వ్యతిరేకంగా ఆంధ్రపత్రిక, త్రిలింగ పత్రికలలో వ్యాసాలు రాశాడు. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, గోదావరి, కృష్ణ, విశాఖపట్నం, గంజాం మండలాలలో తిరిగి అస్పృశ్యతా ప్రచారం చేశాడు. శూద్రులను తన ఇంటికి పిలిచి వారితో పాటు భోజనము చేసేవాడు. అప్పారావు అనే ఒక బ్రాహ్మణేతరుడిని తన ఇంటిలోనే ఉంచుకుని తన కుమారులతో పాటుగా చదువు సంధ్యలు చెప్పాడు.ఆయన ఆంధ్రపత్రిక, భారతి పత్రికలద్వారా ధర్మశాస్త్రములను పరిశీలించి అందలి విషయాలను సప్రమాణకంగా ప్రకటించేవాడు.

**బాల్యం నుంచే అధ్యయనం**

మల్లయ్యశాస్త్రి 1876వ సంవత్సరం ఏప్రిల్ 29వ తేదీ ధాత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నాడు గంజాం జిల్లా సింగుపురం గ్రామంలో తన మాతామహుని ఇంటిలో జన్మించాడు. స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, గంగన్న. మల్లయ్యశాస్త్రి తన ఐదవ యేట తన తండ్రివద్ద వేదాధ్యయనం ప్రారంభించాడు. తరువాత ఉర్లాం జమీందారు కందుకూరి బసవరాజు ఆస్థాన పండితుడైన భళ్లమూడి లక్ష్మణ శాస్త్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నాడు. తన పదహారవ యేడు వచ్చే సమయానికి పంచ కావ్యాలు పూర్తిగా చదివాడు. తరువాత పర్లాకిమిడి రాజా వారి సంస్కృత కళాశాలలో చేరి అక్కడ భళ్లమూడి వెంకటశాస్త్రి వద్ద శృంగార నైషధము, అభిజ్ఞాన శాకుంతలం చదివాడు. తరువాత పరవస్తు రంగాచార్యుల వద్ద సిద్ధాంత కౌముది పూర్తి చేశాడు. కూరెళ్ల సూర్యనారాయణశాస్త్రి వద్ద తర్కశాస్త్రం చదువు కున్నాడు. పోకల సింహాచలం వద్ద సంగీతం నేర్చుకున్నాడు. బంకుపల్లి కామశాస్త్రి వద్ద మంత్ర శాస్త్రాన్ని అభ్యసించాడు. భళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద పంచదశ ప్రకరణాలు, గీతాభాష్యం చదువు కున్నాడు. శ్రీకూర్మం సంస్కృత పాఠశాల పండితుడైన నౌదూరి వెంకటశాస్త్రి వద్ద మనోరమ, శబ్దరత్నములు, పారిభాషేందు శేఖరం చదివాడు. గిడుగు రామమూర్తి పంతులు వద్ద ఇంగ్లీషు చదివాడు. మంత్రశాస్త్ర విద్యలో తన సహాధ్యాయి అయిన గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద వేదాంత, మీమాంస శాస్త్రాలను నేర్చుకున్నాడు. నీలమణి పాణిగ్రాహి వద్ద సూర్యసిద్ధాంత దర్పణాలను చదివి దృక్సిద్ధ పంచాంగాలను ఐదారు సంవత్సరాలు వెలువరించాడు.

**ఎన్నెన్నో బిరుదులు**

మల్లయ్యశాస్త్రి తన 21వ యేట శ్రీకాకుళం హైస్కూలులో తెలుగు పండిత పదవికి 18మంది పండితులతో పోటీపడి ప్రథముడిగా నెగ్గి ఆ ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత కొంతకాలం లుకలాం గ్రామంలో కన్నేపల్లి రామావధాని కుమారులకు సంస్కృతం బోధించాడు. ఆ తర్వాత పర్లాకిమిడి రాజా వారి ఇంగ్లీషు కళాశాలలో తెలుగు పండిత పదవిని చేపట్టాడు. బరంపురం సిటీ కాలేజీలో కూడా సంస్కృతాంధ్ర పండితుడిగా కొంతకాలం పనిచేశాడు.1912లో కలకత్తా సంస్కృత విద్యా పీఠంలో పరీక్ష ఉత్తీర్ణుడై కావ్యతీర్థ బిరుదాన్ని పొందాడు. సంస్కృతంలో సీతా కళ్యాణం, జానకీ వహ్ని ప్రవేశం అనే పురాణ హరికథలుగా రాసినందుకు సంస్థానం రాజు "పురాణ వాచస్పతి" అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆంధ్ర విద్యారణ్య, విద్యారత్న బిరుదులు పొందాడు. ఆయన కాశీయాత్రను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ వద్ద 1947, సెప్టెంబరు 26న తనువు చాలించాడు.


-రామ కిష్టయ్య
సంగన భట్ల...
9440595494

# గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులపై స్పందించండి

## పారిశుధ్య కార్మికులను, మాజీ సర్పంచులను ఆదుకోవాలి: ఎంపీ ఈటల రాజేందర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ గ్రామ పంచాయతీలలో పెండింగ్ లో ఉన్న బిల్లుల విషయమై భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ను హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సర్వీ యాదయ్య గౌడ్, సంఘం నేతల ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2019 – 2024 కాలవ్యవధిలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్రవ్యాప్తంగా సొంత గ్రామ పంచాయతీ పరిధిలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు, ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, గ్రామపంచాయతీలలో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, మనఊరు – మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంలో మా వంతు కృషి చేయడం జరిగిందని అదేవిధంగా పారిశుధ్య నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పును ప్రవేశపెట్టి ప్రజలతో, గ్రామపంచాయతీ సిబ్బందితో మమేకమై గ్రామాలను ఆరోగ్యవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడం జరిగిందని ఎమ్మెల్యేకు తెలియజేసినట్లు సంఘం అధ్యక్షుడు తెలియజేశారు. అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నుంచి సరైన సమయంలో నిధులు అందకపోయినా సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయాలి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే క్రమంలో సొంత డబ్బులు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈ క్రమంలో ప్రభుత్వం నుండి మేము అధికారంలో ఉన్నప్పుడు గాని, మా పాలకమండలి గడువు ముగిసి ఏడు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ మా యొక్క పెండింగ్ బిల్లులు అందక 12,769 గ్రామపంచాయతీ సర్పంచుల యొక్క బాధలు వెలకట్టలేనివని, అదేవిధంగా పారిశుధ్య కార్మికులకు జీతాలు అందక సిబ్బంది పడుతున్న బాధలు మరియు గ్రామాలలో అస్తవ్యస్తమౌతున్న పారిశుధ్య నిర్వహణ వ్యవస్థను చూసి మా మనసులు చలించిపోతున్నాయని ప్రతిపక్ష నేతకు వివరించినట్లు తెలిపారు. గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేసి ఖర్చుపెట్టిన సర్పంచులు బిల్లులు అందక ఆత్మహత్యలు చేసుకున్నారని ఇట్టి విషయమై అధికారులకు, ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యంగా ఉందని, ఇట్టి విషయాన్ని గవర్నర్ కి వివరించినట్లు సంఘం నేతలు తెలిపారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలను అభివృద్ధి పరచడంలో భాగస్వామ్యులమైన మా సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు, పారిశుధ్య కార్మికుల వేతనాలు మొత్తం వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సర్పంచులకు న్యాయం జరిగే వరకు మద్దతిస్తామని ఈటల హామీ ఇచ్చినట్లు సంఘం నేతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ముధోల్ రాజేందర్, మాట్ల మధు, తోటకురి బీరప్ప, పంబ కరుణాకర్, సముద్రాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### రాములోరిని దర్శించుకున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం శ్రీ సీత రామచంద్ర స్వామి వారిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త స్వామి వారిని దర్శించుకున్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ స్టేట్‌సెక్రెటరీ కొదుమూరి దయాకర్ రావు, భద్రాచలం ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, కోడుమూరుమల్లికార్జునరావు,నవీన్‌లు పాల్గొన్నారు.

# గాంధీజీలో 'స్వచ్ఛ సర్వేక్షన్- 2024'

### స్వచ్ఛ తెలంగాణ- స్వచ్ఛ చందూరు కార్యక్రమం

### పర్యావరణం పరిశుభ్రత పై అవగాహన సదస్సు



**విశ్వంభర, చందూర్:** చందూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం ఉదయం చందూరు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో రాబోయే గాంధీ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు17 నుండి అక్టోబర్ 2 వరకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న "స్వచ్ఛ సర్వేక్షన్ –2024" లో భాగంగా నిర్వహించిన "స్వచ్ఛ తెలంగాణ–స్వచ్ఛ చందూరు" కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణం పరిశుభ్రత' పై అవగాహన సదస్సు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు విద్యార్థుల చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఎస్ "స్వచ్ఛతా హి సేవా" అక్షర ఆకారంలో విద్యార్థుల ప్రదర్శించిన మానవహారం చూడ ముచ్చటగా ఉన్నది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి అందరూ మంచి అలవాట్లు నేర్చుకోవాలనీ, పర్యావరణాన్ని పరిరక్షించాలనీ, మన చుట్టుప్రక్కల వారికి కూడా స్వచ్ఛత పైన అవగాహన కల్పించాలని తెలియజేశారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, వివిధ రోగాలకు దూరంగా ఉండవచ్చని అయన సూచించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ యం.అరవింద్ రెడ్డి, వార్డు అధికారులు పూర్ణ చంద్రరావు, బిక్షం, బిల్ కలెక్టర్ మహేష్, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, కందుల కృష్ణయ్య, పులిపాటి రాధిక, విజయకుమారి, చంద్రశేఖర్, గణేష్, యాదయ్య, యాదగిరి ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సమంజసం కాదు



**విశ్వంభర, సూర్యాపేట:** భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మ బలిదానం గావించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మాశెట్టి అనంత రాములు తెలిపారు. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదు. దేశం గర్వించదగ్గ నాయకుడు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడని, స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొని మహాత్మా గాంధీ ప్రశంసలు అందుకున్నారని తెలియజేసారు. హరిజనోద్ధరణే తన లక్ష్యంగా స్వీకరించి హరిజనులకు దేవాలయాల ప్రవేశానికై నిరాహార దీక్ష చేసి సమాజంలో వారి పట్ల ఉన్న వివక్షను రూపుమాపుటకు తీవ్రంగా కృషిచేసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారు. ఆ మహనీయుడి జ్ఞాపకార్థం మన తెలుగు విశ్వవిద్యాలయానికి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకి వారి పేరు పెట్టుకుని భావితరాలకి వారి త్యాగాన్ని తెలియజేస్తూ వారిని సముచిత రీతిలో గౌరవించుకుంటున్నాము అని అన్నారు. కానీ 02-08-2024 తేదీన జరిగిన అసెంబ్లీ సమావేశంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు బదులుగా సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టాలని కమ్యూనిస్టు పార్టీ కోరికను పురస్కరించుకొని మొన్న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పేరు మార్పుకు ఆమోదం తెలపటం పట్ల మన రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలలో ఉన్న యావత్ ఆర్యవైశ్యులతో పాటు తెలుగు భాషాభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణకు అందించిన సేవలు చిరస్మరణీయం అందులో ఎంత మాత్రం సందేహం లేదు. కానీ ప్రతాపరెడ్డిని గౌరవించే క్రమంలో పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేసారు. సురవరం ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం ఏదైనా కొత్త ప్రాజెక్టుకు వారి పేరు పెట్టి సముచిత రీతిలో గౌరవించాలని అలాగే అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలకు తెలియజేసే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి వారి పేరుని యధాతథంగా ఉంచుటకు పునరాలోచన చేయాలని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ తరపున ప్రభుత్వానికి, అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాము అని పేర్కొన్నారు.

### స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయం కొరకు స్థలాన్ని కేటాయించాలని భూపాలపల్లి జయశంకర్ జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావులు అందజేశారు. వారితో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు విస్లావత్ దేవన్, వర్కింగ్ అధ్యక్షులు పిప్పాల రాజేందర్, మత్స్యశాఖ రాష్ట్రకార్యదర్శి జంగిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నేదునూరు మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపల్‌గా విష్ణు ప్రియ



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండల్ నేదునూరు గ్రామంలో గవర్నమెంట్ మోడల్ స్కూల్‌కి నూతనంగా ప్రిన్సిపాల్‌గా విష్ణు ప్రియ నియమితులయ్యారు. ప్రిన్సిపాల్ విష్ణు ప్రియను కందుకూరు మండలం మాజీ వైస్ ఎం.పీ.పీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, కందుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, ఎండి. అఫ్జల్ బేగ్, చెన్నకేశవ స్వామి ఆలయం చైర్మన్, కళ్యాణ్ రూప్‌చందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బొర్ర సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంకగాల దర్శన్, వరికుప్పల బాబు, గడిగే రాములు, దేవరకొండ రాములు, ముచ్చర్ల చోటులు మర్యాదపూర్వకంగా కలిశారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు ప్రాథమిక సహకార కేంద్రం పరిధిలో వరి కొనుగోలు కేంద్రాలను పెంచి సన్న, చిన్న కారు రైతన్నలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్ (డీసీఓ) సి. సుధాకర్ ను కలిసి కోరినట్లు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాకు ఇటీవల హైదరాబాద్ లోని గన్ ఫౌండ్రీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన డీసీఓ సి. సుధాకర్ ను, వెంకటేష్ గుప్తను మంగళవారం కలిసి పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం సీఈఓ జి. దేవేందర్, సిబ్బంది పద్మకర్ రెడ్డి లతో కలిసి డీసీఓ సుధాకర్ ను శాలువతో సన్మానించారు. అక్టోబర్ నెల మొదటి వారంలో వరి కొనుగోలు కేంద్రాలు సహకార కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

### యువత కుటుంబానికి ఆసరాగా నిలబడాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురుచూడకుండా ఏదో ఒక పనిచేసుకుని చేసి కుటుంబానికి ఆసరాగా నిలబడాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంజూరు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను బెడ్దేలపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు దుర్గం లింగమూర్తికి జడ్పి సిఈవో, అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఈడి వెంకటేశర్లుతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెహికల్‌కీని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురుచూడకుండా ఏదో ఒక పని చేసి కుటుంబానికి ఆసరాగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్, నాయకులు బెడ్దేల తిరుపతి, కుమ్మరి తిరుపతి ఉన్నారు.

## ప్రభుత్వ భూమిలో ఇండ్ల కూల్చివేత



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొంపెల్లి శివారు సర్వే నెంబరు 170/3/1లో రైతు మోరే వెంకటయ్య చెందిన 18 గుంటల భూమిలో ఇల్లు నిర్మాలించుకున్నాడు. ఇది ప్రభుత్వ భూమి అని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు దానిని కూల్చివేశారు. 20 సంవత్సరాలు నుంచి మా భూమిలో కాస్తూకు ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నామని, తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా పాస్ బుక్ కూడా ఉందని, మా భూమిలో నిర్మించుకున్న ఇల్లును అధికారులు కూల్చివేశారని తమకు న్యాయం చేయాలని బాధితులు వాపోయారు.



ఫైర్ స్టేషన్‌కు నూతనంగా మంజూరైన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఫైర్ ఇంజన్ వెహికల్ ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్, సిబ్బందితోపాటు పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. (విశ్వంభర, షాద్ నగర్)

### స్వచ్ఛ్ హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ్ హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరిశుభ్రత కార్యక్రమంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి, కళాశాల విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### మంత్రి సీతక్కను కలిసిన ఎల్ హెచ్ పీఎస్ నాయకులు

#### సబ్ ఐటిడిఏను ఏర్పాటు చేయాలి

**మహబూబాబాద్ జిల్లాలో గిరిజన గురుకులాల సమస్యలు పరిష్కరించాలి - ఎల్ హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్**



**విశ్వంభర్, మహబూబాబాద్:** ములుగు క్యాంప్ కార్యాలయంలో బుధవారం సీతక్క ను కలిసి పలు సమస్యల పై చర్చించారు. మహబూబాబాద్ జిల్లాలో కొత్తగుడ లేదా పెద్ద గూడూరు మండలాల్లో సబ్ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి మంత్రి సీతక్క మాట్లాడుతూ తప్పకుండా హామీలను నెరవేరుస్తానని, ఆర్.సీ.ఓ ఆఫీసు మహబూబాబాద్ జిల్లా లోనే కొనసాగుతుందని మరో సారి స్పష్టం చేస్తూ, గిరిజన అభివృద్ధికి నా శాయశక్తులా సహకరిస్తానని అన్నారు. అతి త్వరలోనే గురుకులాల్లో దుప్పట్లు పంపిణీ చేస్తామని, అదే విధంగా మేస్ అండ్ కాస్మొటిక్ ఛార్జీలు పెంచుతామని సీతక్క అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఎల్.ఎస్.ఓ జిల్లా అధ్యక్షులు శివ వర్మ నాయక్, పార్లమెంట్ ఇంఛార్జి రాందాస్ నాయక్‌లు వున్నారు.

### మహిళలకు బతుకమ్మ చీరలు బంద్

#### వాటి స్థానంలో ఒక్కొక్కరికి కానుకగా రూ. 500



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో బతుకమ్మ పండగ సందర్భంగా ప్రభుత్వం తరపున అందించే బతుకమ్మ చీరల పంపిణీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఓ కీలక నిర్ణయం తీసుకున్న ట్టు తెలుస్తుంది. చీరల్లో నాణ్యత లేదని చాలామంది మహిళలు విమర్శిస్తున్న నేపథ్యంలో దీంతో ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ సారి బతుకమ్మ పండగకు బతుకమ్మ చీరలు కాకుండా కొత్త కానుక ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈసారి బతుకమ్మ చీరలకు బదులుగా రూ. 500 లు ఇవ్వాలని సంబంధిత వివరాలు కూడా పరిశీలిం చాలని ముఖ్యమంత్రి ఆదేశించారని సమాచారం. బతుకమ్మ పండగ అనేది తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండగ. తెలం గాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్ప టికీ నుంచి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. ఫ్రీ బస్సు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రూ. 2,500 లు మహిళల ఖాతాల్లో జమ చేయడం వంటివాటి పై కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తోంది. అయితే మరో పది రోజుల్లో బతుకమ్మ పండగ మొదలుకానుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చీరలకు బదులుగా ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ. 500లు నగదు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. రూ. 500లు లేదంటే ఆపైనా అందించేందుకు కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. ఎందుకంటే గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల్లో నాణ్యత కొరవడిందనే వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది రేవంత్ రెడ్డి సర్కార్.

### 27న యోగా టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**విశ్వంభర, భూపాలపల్లి:** వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు ప్రాంతీయ ఆయుష్ శాఖ ఆర్ డీడీ ప్రమీలాదేవి, ఆయుష్ జిల్లా ఇన్చార్జి డా.తనుజారాణి తెలిపారు. యోగా టీచర్ల నియా మకానికి ఈ నెల 27న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆయుష్మాన్ ఆర్డీడీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను https://ayush.telangana.gov.inవెబ్ సైట్‌లో చూడొచ్చు అని ఆమె తెలిపారు..

# శాంతి భద్రతలను మెరుగుపరచడంలో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర



**విశ్వంభర, భూపాలపల్లి:** సీసీ కెమెరాల వ్యవస్థ శాంతి భద్రతలను మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆరు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ సీసీ కెమెరాలు నేర నివారణ, ప్రజల రక్షణ, పోలీసుల పనితీరును మరింత మెరుగుపరచడంలో కీలకంగా ఉంటాయని అన్నారు. గ్రామస్థులు సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. దొంగలను, నేరాలకు పాల్పడిన వ్యక్తులను, అల్లర్లకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఉపయోగ పడతాయని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రజల సహకారం ఉండాలని, దత్తత తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విడతల వారిగా నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. చెల్పూర్ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, సింగరేణి, కెటిపిపి పరిశ్రమలున్నాయని తెలిపారు. చెల్పూర్ నుండి గూడెప్పాడు వరకు 660 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి వ్యాపారులు, ఉద్యోగులు, విదేశాల్లో స్థిరపడిన, ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వే నంబర్ 134 లో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా రక్షణ నిమిత్తం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రానున్న 15 రోజుల్లో భూ మాతా పోర్టల్ సేవలు అందుబాటులోకి రానున్నాయని, ఎప్పటి నుండో ప్రభుత్వ భూముల్లో సేద్యం చేస్తున్న రైతులకు పట్టాలు జారీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాలు పటిష్ఠ పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఉపయోగ పడతాయని అన్నారు. ప్రమాదాలు, అధికవేగంతో వెళ్లే వాహనాలు నిశిత పరిశీలన ఉంటుందని, క్షణాల్లో సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో సీసీ కెమెరాలు ద్వారా పటిష్ఠ పర్యవేక్షణ జరుగుతుందని, ఇది ప్రజలకు చాలా ఉపయోగ కరమని తెలిపారు. త్వరలో గ్రామాలు, మండలాలు, ప్రధాన కూడళ్ళలో జిల్లా మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ 24 గంటలు నిశిత పరిశీలన ఉంటుందని అన్నారు. అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. శాంతి భద్రతలు పర్యవేక్షణలో మన రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. రంగాపూర్ గ్రామంలో జరిగిన దొంగతనం సీసీ కెమెరాలు పరిశీలన ద్వారా ఛేదించామని అన్నారు. నేరాలను త్వరగా డిటెక్ట్ చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సీసీ కెమెరాల్లో వాస్తవం నిక్షిప్తం అవుతుందని అన్నారు. భద్రత కోసం ఏర్పాటు చేసిన కెమెరాలు ప్రజలు సహకారం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కమిటీ పర్యవేక్షణ ఉంటుందని నేరాల ఆధారాలు, ప్రమాదాలు త్వరితగతిన గుర్తించి శిక్షలు అమలయ్యేలా సీసీ కెమెరాలు పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకారం అందించిన దాతలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఎస్పీ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీస్ అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమగ్ర కులగణనతోనే సామాజిక న్యాయం: సమావేశంలో మాట్లాడిన వక్తలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ సెక్రటరీ జనరల్ రాహుల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతనా వహించిన సమావేశంలో మాజీ ఎంపీ ఆర్. కృష్ణ య్య, వి.హనుమంత రావు, మధుసూదన్ చారీ, రమణ, ప్రొ. కోదండ రాం, అనిల్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ప్రసంగిస్తూస్థానిక సంస్థల రిజర్వేషన్లు పెంచకపోతే రాష్ట్రంలో ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుం దని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం బీసీలతో చెలగాటం ఆడుతుందని దీనిపై స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ బీసీలఎజెండా మోస్తూ జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటిస్తుంటే ఇక్కడ నాయకులు బిసి వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్రానికి చెందిన తీర్మానాలు - ఎన్నికల వాగ్దానం ప్రకారం బి.సి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచాలి. అన్యాయపరమైన చట్ట పరమైన అడ్డంకులు తొలగించడానికి రాజ్యాంగం సవరణకు ఒత్తిడి చేయాలి. ఇండియా కూటమి ద్వారా ప్రైవేట్ బిల్లు పెట్టాలి. బీసీ కులగణన చేపట్టడానికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "డెడికెటెడ్ బీసీ కమిషన్" వెంటనే నియమించాలి. పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో బి.సి లకు 50 శాతం రిజవేషన్లు కల్పించాలి. కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి .బి.సిల అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలి. ప్రత్యకంగా కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్‌లు, ఫీజులరియంబర్స్ మెంట్,ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి రాజ్యాంగ సవరణ చేయాలి. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి "బి.సి యాక్టు"ను తీసుకరావాలి. బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రిమి లేయర్ ను తొలగించాలి అని డిమాండ్ చేశారు.

## వనపర్తి జిల్లాలో కానిస్టేబుల్ అదృశ్యం

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**వనపర్తి :** వనపర్తి జిల్లాలో ఓ కానిస్టేబుల్ రామకృష్ణ అదృశ్యం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పానగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. పానగల్ పీఎస్ నుంచి ఎస్కా ర్ట్ పీసీగా చివరిసారిగా విధులను నిర్వహిం చాడు. ఆ తర్వాత రామకృష్ణ జాడ లేకుండా పోవడంతో.. అతని భార్య మంజుల పోలీ సులకు ఫిర్యాదు చేసింది. కాగా, ఆర్థిక ఇబ్బందులతో విధులకు నిర్వర్తించ లేకపోతున్నానని తన భార్య మంజులకు మెసేజ్ పంపి రామకృష్ణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆకట్టుకున్న బడ్డింగ్ చెఫ్ పోటీలు



**విశ్వంభర, హైద్రాబాద్ :** ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ ప్రొఫెషనల్ బడ్డింగ్ చెఫ్ పోటీ కార్యక్రమాలు డిడి కాలనీలో మూడు రోజుల పాటు నిర్వహించారు. హోటల్ మేనేజ్ మెంట్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ సంజయ్ కె ఠాకూర్ అన్నారు. హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్స్, అన్ని విభాగాల చెఫ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్:** గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ఇంచార్జి దీపా దాస్ మున్షీ గారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి చేస్తున్న కార్యక్రమాల పై నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు (సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు) నిర్వహిస్తున్న గ్రామ స్థాయి మీటింగ్ గురించి ఎమ్మెల్యే మదన్ మోహన్ పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ కి వివరించారు.అనంతరం పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జి దీపా దాస్ మున్షీలను శాలువతో సన్మానించారు.

## అధునాతన రోబోటిక్ సర్జరీ

### చికిత్సలో ఖచ్చితత్వం, వేగవంతమైన రికవరీ

### అందుబాటులోకి తీసుకొచ్చిన మల్లా రెడ్డి నారాయణ హాస్పిటల్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం మల్లా రెడ్డి నారాయణ హాస్పిటల్ తన శస్త్రచికిత్స సామర్థ్యాలలో ఒక ముఖ్యమైన దశను సూచించే రోబోటిక్ సర్జరీని ప్రారంభించింది. రోబోటిక్ టెక్నాలజీని ప్రవేశపెట్టడం అధునాతన, ఖచ్చితమైన, తక్కువ హానికర చికిత్స ఎంపికల కోసం పెరుగుతున్న రోగి డిమాండ్ ద్వారా నడిపించబడుతుంది. ఈ హాస్పిటల్ ఇప్పుడు ఖచ్చితత్వం, రోగి ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా రోబోటిక్ సహాయంతో మోకాలి కీలు శస్త్రచికిత్సను అందిస్తుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ జయసుధ కపూర్, చైర్మన్ మరియు డాక్టర్ సిహెచ్. భద్రారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ సిహెచ్. ప్రీతిరెడ్డి హాజరై, రోగుల సంరక్షణ అధునాతన వైద్య సంరక్షణ విధానాలపై ఆసుపత్రి నిబద్ధతను కొనియాడారు. మల్లా రెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లోని సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ డా. ఆర్. అంజని కుమార్, ఈ టెక్నాలజీ యొక్క పరివర్తనకరమైన ప్రభావాన్ని నొక్కి చెప్పారు. "రోబోటిక్ సర్జరీ ఖచ్చితత్వాన్ని పెంచుతుంది, సంక్లిష్టతలను తగ్గిస్తుంది, కోలుకోవడాన్ని వేగవంతం చేస్తుంది, మా రోగులకు మరింత ప్రభావవంతమైన, సౌకర్యవంతమైన చికిత్స అనుభవాన్ని అందిస్తుంది." అని అన్నారు. అనుకూలమైన ఫలితాలను నిర్ధారించడానికి, ఆసుపత్రి తన శస్త్రచికిత్స వైద్య బృందాలను విస్తృతంగా శిక్షణ పొందించింది, ప్రాక్టీస్ సర్జరీలు నిర్వహించింది, అంతర్జాతీయ భద్రతా మార్గదర్శకాలను పాటిస్తుంది. ఒక శస్త్రవైద్యుడిగా, రోబోటిక్ సర్జరీలో నిష్ణాతులవ్వడానికి సాంప్రదాయ పద్ధతులలో ధృవమైన పునాది ఉండటం అవసరం. ఈ టెక్నాలజీ శస్త్రవైద్యుడిని భర్తీ చేయదు. ఇది ముఖ్యంగా కష్టమైన లేదా పునరావృతమయ్యే విధానాలలో అద్భుతమైన ఫలితాలను అందించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు.

## పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయం



**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాగన్నగూడ గ్రామంలోని బూత్ నంబర్ 273లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని బీజేపీ మెగా మెంబర్ షిప్ డ్రైవ్ లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ బీజేపీ సభ్యత్వం నమోదును చేయించారు. శ్రీరాములు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు, ఆలోచనలను అంకితభావంతో ఆచ రించడమే ఆమహానుభావుడికి మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ మెగా మెంబర్ షిప్ డ్రైవ్ ద్వారా ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నారని దీనికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. అనంతరం శ్రీరాములు దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, కార్పొరేషన్ బీజేపీ సభ్యత్వ నమోదు కన్వీనర్ నడికుడ యాదగిరి స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఏనుగు రామ్ రెడ్డి, శక్తి కేంద్రం ఇంచార్జ్ నిమ్మల రవికాంత్ గౌడ్, సహకార బ్యాంకు డైరెక్టర్ పెత్తుల పుల్లారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు రామ్ రెడ్డి, అంజిరెడ్డి, సహకార బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాపరెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృ ష్ణారెడ్డి, తిరుపతి సంతోష్, తిరుపతి మహేం దర్, బి భాస్కర్, నర్సింగ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా లోగో ఆవిష్కరణ



**విశ్వంభర, ఎల్బీనగర్:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ మొదటి ఈసీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ 14,15,16 చిల్డ్రన్ డే కప్ నిర్వహించాలని నిర్ణయించారు. బ్యాట్మెంటన్‌ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి అని వారు చర్చించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.ప్రతి జిల్లాకు ఒక స్టేడియం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారని ఆయన అన్నారు. బ్యాడ్మింటన్‌నీ అంతర్జాతీయ స్థాయిలో నిలపెడుతం అని అందరూ అందరం కలిసి కట్టుగా కృషి చేస్తాం అని ఆయన అన్నారు.మరోసారి తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాబు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి క్రీడల శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ భాస్కర్, కోశాధికారి హర్ష యాదవ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జాయింట్ కార్యదర్శి నాగరాజు, రమేశ్ ,వైస్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ వేణు కుమార్, షేక్ రేష్మ, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన వితరణలో పాల్గొన్న వక్కలంక శ్రీనివాసరావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** సంగీత సాగరంలో 50 సంవత్సరాలుగా ఓలలాడుతూ తన తరువాత ఏ గాయకుడు అందుకోలేనంత స్థాయికి ఎదిగిన యస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతి సందర్భంగా అన్న ప్రసాదం కార్యక్రమాన్ని అమీర్ పేటలోని సారథి స్టూడియోలో నిర్వహించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణ సంఘ నాయకులు వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాటలకు ఆటలు నేర్పుతూ స్వరాలతో సరసాలు ఆడే స్వరమాంత్రికుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం అని కితాబు ఇచ్చారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం కుమారుడు ఎస్పీ చరణ్ ను కలిసి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. "పాడుతా తీయగా" అనే పదం మీ నాన్న గారి తీపి పలుకులు అని అన్నారు. అన్న ప్రసాదం పలువురికి అందజేసి ఎస్పీ బాలసుబ్రమణ్యంగారి ఆశీస్సులు ప్రతి కళాకారులకు సంగీతం నేర్చుకున్న, నేర్చుకుంటున్న ప్రతి ఒక్కరు అందుకున్నట్లుగా వారు భావిస్తున్ననాని వక్కలంక శ్రీనివాసరావు అన్నారు.

## ఫార్మసిస్టులకు కెమిస్ట్‌లకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలి: డా. పెండెం కృష్ణకుమార్



**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.పెండెం కృష్ణకుమార్ విధులు నిర్వహిస్తున్న స్వంతంగా షాపు నడిపిస్తున్న ఫార్మసిస్ట్ లకు, మహిళా ఫార్మసిస్ట్ లకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి సందర్భంలో అయిన కష్టకాలంలో ఆయిన ప్రతి రోజు ఎలాంటి సెలవు తీసుకోకుండా విధులు నిర్వహిస్తున్న ఫార్మసీస్ట్ లకు, కెమిస్ట్ లకు అభినందనలు తెలిపారు. ఎటువంటి విపత్కర సమయములో కూడా ప్రాణా లకు లెక్క చేయకుండా సెలవు దినాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న వారి సేవలు చాలా గొప్ప వి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఫార్మాసిస్ట్ లను, ఫార్మసీస్ట్ లను ఘనముగా సత్కరించారు. ప్రజలకు సేవలందించడములో డాక్టర్లు ముందుండగా ఫార్మసిస్ట్, కెమిస్టు వారికి సహకరిస్తారు. ఫార్మసిస్ట్ లకు, కెమిస్టుకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జ్వరాలతో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి: కామినేని ఆస్పత్రి గైనకాలజీ వైద్యుల్య సూచన




**విశ్వంభర, ఎల్బీనగర్:** వర్షాలు ఎక్కువగా పడుతుండడం, ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిల్వ ఉండడంతో అనేక రకాల జ్వరాలు వ్యాపిస్తున్నాయని, వీటి విషయంలో గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి కన్సల్టెంట్, ఆబ్స్టెట్రిక్స్, గైనకాలజీ డాక్టర్ బి. మేనక సూచించారు. డాక్టర్ అర్చనా దినేష్ బిడ్ల, డాక్టర్ ఎ. ప్రసన్నలత, డాక్టర్ వాసవి తదితరులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. "ప్రస్తుతం నగరంలో డెంగ్యూ, చికన్ గున్యా, వైరల్ జ్వరాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. వీటివల్ల సాధారణ ప్రజలతో పాటు గర్భిణులకు ఇంకా ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయి. ప్లేట్ లెట్లు తగ్గడం, కీళ్ల నొప్పులు, లంగ్ ఇన్ఫెక్షన్ వల్ల ఆయాసం రావడం, రక్తం గడ్డకట్టకుండా హెమరేజ్ ఏర్పడి షాక్‌లోకి వెళ్లి, చివరకు ఐసీయూలో చేరాల్సి వస్తోంది. చాలామందిలో ఆక్సిజన్ శాచ్యురేషన్ కూడా పడిపోతోంది. చికున్ గున్యాతో మోకాళ్ల నొప్పులు, నడవలేకపోవడం, రాషెస్ ఉంటున్నాయి. మలేరియా కూడా ఎక్కువగానే ఉంది. గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో అయినా, ఐదో నెలలో ఉన్నా, లేదా ప్రసవానికి కొద్ది ముందుగా అయినా ఇలాంటి జ్వరాలు వస్తే.. వెంటనే గైనకాలజిస్టును, ఇంటర్నల్ మెడిసిన్ నిపుణులు లేదా ఫిజిషియన్‌ను సంప్రదించాలి. వారు సూచించిన మందులు మాత్రమే వాడాలి తప్ప సొంతంగా మందులు అస్సలు వేసుకోకూడదు.

## పరిసరాల పరిశుభ్రతతో ప్రజా ఆరోగ్యం మెరుగు

**విశ్వంభర, భూపాలపల్లి:** పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకున్నప్పుడే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛ్ హి సేవా కార్యక్రమంలో జడ్జి పాల్గొని కోర్టు సిబ్బంది మరియు న్యాయవాదులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హై కోర్ట్ వారి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిశుభ్రత అనే సేవను అందరూ చేయాలనీ అప్పుడు దేశం మొత్తం శుభ్రంగా తయారవుతుందని అన్నారు. క్లీన్ ఇండియా మిషన్‌లో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమం అక్టోబర్ ఒకటి వరకు జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీ కూనూరి సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీ బల్ల మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్,



న్యాయవాదులు మంగళపల్లి రాజ్ కుమార్, లతీఫ్, సంగేమ్ రవీందర్, ఆరేళ్ళ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందేలా కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారంనిజాంపేట్ మండల పరిధిలోని మునిగే పల్లి గ్రామంలో మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవం చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మా ఈ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద 500 కే గ్యాస్ సిలిండర్ ఆడబిడ్డలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించిందని పేర్కొన్నారు. గృహ జ్యోతి పథకం కింద ప్రతి ఒక్క పేదవానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుందన్నారు. మా ప్రభుత్వం ప్రతి రైతుకి రెండు లక్షల రుణమాఫీ చేసి చూపిచ్చిందన్నారు. చిన్న చిన్న సమస్యల వల్ల కొంతమంది రైతులు రుణమాఫీ జరగలేదని, రుణమాఫీకి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పకుండా మా ప్రభుత్వం చేస్తుంద అని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేతో పాటు నిజాంపేట్ మండల ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంపీవో శ్రీనివాస్ తాసి



ల్దార్ జ్యోతి, మండల నాయకులు మన్నే కృష్ణ, గోలి రాములు, మాజీ ఎంపీటీసీలు రఘుపతి రెడ్డి , మాజీ సర్పంచ్ , రాధాకిషన్ , వెంకటేష్, శ్రీకాంత్, తోఫీక్, మిస్కిన్, రమేష్, సంగమేష్, గంగాధర్, దుర్గప్రసాద్, రూప మాజీ ఉపసర్పంచ్, గ్రామ ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల బీసీలకు ఆర్ కృష్ణయ్య మోసం మాజీ మంత్రి కారుమూరి



**విశ్వంభర, విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తన సభ్యత్వానికి రాజీనామా చేసి బీసీలను మోసం చేశారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణయ్యకు చంద్రబాబుకు అమ్ముడుపోయి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. బీసీలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ తెలంగాణ వ్యక్తి కృష్ణయ్యను పిలిచి రాజ్యసభకు అవకాశం కల్పించారని స్పష్టం చేశారు. బీసీలకు మంచి జరుగుతుందని భావించగా ఆయన బీసీలను వంచించారని ఆరోపించారు. కృష్ణయ్యను తెలుగు రాష్ట్రాల్లోని బీసీలు ఎన్నటికీ క్షమించరని పేర్కొన్నారు. చంద్రబాబు వైసీపీ నాయకులను కొనుగోలు చేసి ఆ పదవులను పెత్తందారులకు అమ్ముకునే దళారిగా మారిపోయారని విమర్శించారు సూపర్ సిక్స్ నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి తిరుమల లడ్డూ పేరుతో తప్పుడు ప్రచారానికి దిగారని ఆరోపించారు.

## లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

### రాజీమార్గం రాజమార్గం
### పగ, ప్రతీకారాలతో సాధించేది ఏమి ఉండదు
### రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లే



**విశ్వంభర, భూపాలపల్లి:** రాజీమార్గం రాజమార్గమని, పగ, ప్రతీకారాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులలో ఇతర రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్ళు, పోలీసులు రాజీపడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను, పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి, రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## రైల్వే అధికారులు అండర్ పాసులు నిర్మించాలి

### ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాద్ నియోజకవర్గంలో మహబూబాద్ నుండి కేసముద్రం వెళ్ళు రైల్వే లైన్ మధ్యలో ఉన్నటువంటి అన్నారం, సార్వపురం గ్రామాల వద్ద రైల్వే అండర్ పాస్‌లు లేకపోవడంతో రైతులు, ప్రజలు, పశువులు ట్రాక్ దాటాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ అన్నారు. అలాగే అటువైపు నుంచి వెళుతున్నటువంటి గొర్ల కాపర్లు, గొర్రెలు రైలు ప్రమాదంలో మరణిస్తున్నాయని తెలిపారు. రైతులు బిక్కుబిక్కుమంటూ రైలు ట్రాక్కు దాటడానికి భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో ట్రాక్ దాటుతుండగా ప్రమాదాలు కూడా తరచూ సంభవిస్తూనే ఉన్నాయని, రైల్వే అధికారులు చొరవ తీసుకొని అండర్ పాసులు నిర్మించాలని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం భారతిశ్ కుమార్ జైన్ నీ మర్యాద పూర్వకంగా కలిసి అక్కడ రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ తెలిపారు. వారితో పాటు జిల్లా నాయకులు రమేష్ చందర్ రెడ్డి ఉన్నారు. దీనికి సానుకూలంగా స్పందించించిన రైల్వే డీఆర్ఎం అధికారి భారతీష్ కుమార్ జైన్ ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, కడ్తాల్:** మండలం చెల్లంపల్లి గ్రామ పంచాయతీలో మాదగారి శేఖర్ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని, ఆయిల్ పామ్ సాగు చేసి రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని తెలిపారు. ఈ పంట సాగుతో 4-30 ఏండ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం నూతన ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు ముంతాజ్ బేగం, ఏవో శ్రీలత, ఎంపీడీవో జిల్లా, మండల హార్టికల్చర్ అధికారులు, పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు బిచ్చ నాయక్, రాష్ట్ర సేవల సేన కార్యదర్శి లక్ పతి నాయక్, నరేష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంధమల్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### ఫలించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రయత్నం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువు నిండి మత్తడీ దూకుతుండడంతో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నసాగర్ నుండి గంధమల్లకు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు మార్కెట్ కమిటీ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుని, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, ఎంపీ చామల కిరణ్ కుమార్ ని కోరగా, కోరిన 10 గంటలల్లో నీటిని విడుదల చేసారు. దీంతో ఆలేరు నియోజకవర్గ ప్రజలు,రైతులు సంతోషం వ్యక్తం చేశారు. గంధమల్ల చెరువు నీండి మత్తడి పోస్తూ కింద ఉన్నటువంటి పలు గ్రామాల చెరువులు, కాలువలు, నిండి జలకళను సంతరించుకుంటున్నాయి. అంతముందుకు జగదేవ్‌పూర్, మండలం గంధమల్ల సమీపంలో ఉన్నటువంటి మదన దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రం ఆలేరు నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలని వేడుకున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డికి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్లఐలయ్యకి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ హాస్పిటల్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నిజాంపేట్ మండల కేంద్రంలోని పీ.హెచ్.సీ ఆరోగ్య కేంద్రాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. తనిఖీ లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందుతున్నాయ లేదా అని ఆరాతీశారు. ప్రభుత్వం తరుపున వైద్య సౌకర్యాల అందుతున్న తీరును పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మా ఈ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవానికి దేయమని పేర్కొంటూ ఉచిత వైద్యం అందాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని వైద్య సిబ్బంది నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు నిజాంపేట్ మండల పీ.హెచ్.సీ డాక్టర్ రాజేశ్వర్ స్టాఫ్ మండల నాయకులు మన్నే కృష్ణ, గోలి రాములు, మాజీ ఎంపీటీసీ లు రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్, రాధాకిషన్,వెంకటేష్, శ్రీకాంత్, తదితర గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో దీన దయాల్ ఉపాధ్యాయ జయంతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కుర్ మండలం బుధవారం పండిత్ దీన దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ మోత్కూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య గుప్తా, బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్ గుప్తా, తదితర బీజేపీ మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## గడీల దొరలను గడ గడ లాడించిన అగ్నికణం ఐలమ్మ

### నేడు చాకలి ఐలమ్మ 129వ జయంతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహా నిర్మాణ కమిటీ చైర్మన్ ఎలిమినేటి నగేష్ చాకలి ఐలమ్మ 129వ జయంతిని గురువారం రోజు అన్ని వర్గాల ప్రజలం అందరం కలిసి ఘనంగా నివాళులు అర్పిద్దాం అని అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నగేష్ పత్రికల వారితో మాట్లాడుతూ 'తెలంగాణ రైతాంగ పోరాటంలో అగ్నికణంగా ఐలమ్మ పేరు నిలిచిపోతుందని బహుశా ఆమె ఊహించక పోవచ్చు, విసునూరు దొరల ఆగడాలను ఎదురించడం లో ఐలమ్మ చూపిన తెగువ ఎందరికో స్ఫూర్తి దాయకం, ఆమె చూపిన స్ఫూర్తి తోనే ఎందరో ఉద్యమాల బాట పట్టారు'. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ముందు బాగాన నిలబడి పోరాడిన వీరానారి చాకలి ఐలమ్మ. ఆనాడు నిజాం నావాబులకు జమీందారులకు వ్యతిరేఖంగా జరిగిన తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాటంలో తన ఇల్లునే కార్యాలయంగా మార్చి తన కుటుంబాన్ని సైతం పోరు బాటలో నడిపించిన ఐలమ్మ పాలకుర్తిలో 1919 లో నిరుపేద కుటుంభంలో జన్మించింది. వెట్టి చాకిరీకి వ్యతిరేఖంగా విసునూరు దేశ్ ముఖ్ నాడు నల్లగొండ పరిధిలో నేడు జనగామ ప్రాంతంలో ఉంది. దౌర్జన్యాలకు గడిల పాలనకు వ్యతిరేఖంగా పోరు సలిపిన పోలికేక మన చాకలి ఐలమ్మ. చివరి దాకా పోలీస్ దాడులను, గుండాల ఆగడాలను సంఘం అండదండలతో ప్రజల తోడ్పాటు తో చివరిదాకా పోరాడింది. పెల్లు బిక్కిన తెలంగాణ రైతాంగా పోరు బాటలో ఖనఖన మండే నిప్పుకణం ఐలమ్మ. ఆమె చూపించిన ధైర్య సాహసాలు ఎన్నో గ్రామాల ప్రజలకు ఉత్తెజాన్ని ఇచ్చాయి. చేతికి వచ్చిన పంటను దోచుకునే విసునూరు దొర ప్రయత్నాన్ని నాటి కమ్యూనిస్ట్ పార్టీ నాయకులైన ఆరుట్ల రామచంద్ర రెడ్డి, భీమిరెడ్డి నర్సింహ్మా రెడ్డి సాగించిన పోరాటాలు పల్లే పల్లేలో కొనసాగాయి. దొరలు చెప్పిందే చట్టం చేసిందే శాసనంగా నడుస్తున్న రోజుల్లో రాక్షస రాజాకార్, ఖాసీం రిజ్వి ఏర్పాటు చేసిన సైన్యాన్ని, విసునూరు దేశ్ ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలను ఎదురించిన ధీర వనిత ఐలమ్మ. ఆత్మగౌరవంతో ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శం కావాలి అని ఎలిమినేటి నగేష్ అన్నారు.

## కలెక్టర్ రాత్రివేళ ఆకస్మిక తనిఖీ



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ స్కూల్ హాస్టల్, కాలేజ్ హాస్టల్ లను సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న డిన్నర్, వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** భారతదేశానికి పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమని పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తత్వవేత్త ఆర్థికవేత్త సామాజిక శాస్త్రవేత్త, చరిత్రకారుడు, పాత్రికేయుడు, రాజకీయ కార్యకర్తగా ఎన్నో అంశాలలో ఆయన సేవలు అందించారని వివరించారు. ఏకాత్మ మానవతా వాదాన్ని ప్రతిపాదించిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన పలు రచనలు కూడా చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, తేంకటి మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు బుగుడాల కృష్ణ, సుభాష్, మంగలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ప్రమాదవశాత్తు తిరుమలాపూర్ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పెద్ద శంకరంపేట ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ పెద్ద శంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్ చారి (58) మంగళవారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లాడని, శ్రీనివాస్ చారి టైలరింగ్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు అన్నారు. అతనికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉందన్నారు. బుధవారం ఉదయం అతని మృతదేహం తిరుమలాపూర్ చెరువులో తేలియాడడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సీపీఎం చంపాపేట శాఖ మహాసభ




**విశ్వంభర, రంగారెడ్డి:** బైరాముల గూడలో బుధవారం సీపీఎం చంపాపేట శాఖ మహాసభ ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, రవీందర్ యాదవ్, హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డు ఇవ్వాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులు తీసుకున్న అప్పులను 17 లక్షల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు. అదేవిధంగా వృత్తిదారులకు, కార్మికులకు, పేదలకు, నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో వారిని ఆదుకోకుండా ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని, కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ కూలీల చట్టాలను రైతుల చట్టాలను మారుస్తూ పేదల పొట్టలు కొడుతూ పెద్దలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జెమిలి ఎన్నికల పేరుతో ఒకటే కార్డు ఒకటే ఓటు ఒకటే మతం ఒకటే ఓటు ఎన్నికలు అంటూ మరోసారి ప్రజలకు ఉన్న హక్కులన్నీ తీసివేయడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తూ ఉందని భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు అందకుండా రాజ్యాంగాన్ని మార్చటానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. రాసిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారత ప్రజల పైన ఉన్నది అన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎలాంటి సంబంధం లేని బీజేపీ పార్టీ ప్రజలకు రంగు పూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సామాజిక వివక్ష అణచివేత మీద సమైక్య పోరాటమే వీర తెలంగాణ రైతంగా సాయుధ పోరాటమని, ఆ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని నిజాం రజాకార్ల భూస్వాములకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం 3 వేల గ్రామాల్లో వేలాది మంది వీరమరణం పొందారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ప్రారంభమైన నాటి నుంచి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మరో ముగ్గురుతో తొలి సమావేశం జరిగింది. నిజాం ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీగా 1941 లో ఏర్పడింది. ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలందరూ తిరగబడ్డారు. తప్పని పరిస్థితుల్లో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారతదేశం లో విలీనం కమ్యూనిస్టుల విజయం అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కొనసాగించారు. ఆయన మరణించడం ప్రపంచ కమ్యూనిస్టు దేశాలకు తీరని లోటు అని జోహార్లు అర్పించారు. చంపాపేట డివిజన్లో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి ప్రజా సమస్యల పరిష్కరించేంతవరకు ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా మనం పోరాటం చేయాలని గతంలో వచ్చిన వర్షాలకు రోడ్డుకు ఎక్కడికక్కడ కొట్టుకుపోయి గుంతలు గుంతలు గా మారుతున్న జిహెచ్ఎంసి అధికారులు. కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదు. మరియు కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలును అమలు చేయాలని, ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు హైడ్రా సమస్య ప్రజల్లో సమస్యలు తీవ్రంగా ఉందన్నారు. ఆ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేందుకు పోరాటాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు పీ.రామస్వామి, చంపాపేట శాఖ నూతన కార్యదర్శిగా బి. దుర్గారావు ను సభ్యులు ఏకేగ్రంగా ఎన్నుకున్నారు. సభ్యులు గణేష్ ప్రభాకర్ కోటేశ్వరరావు, గోపి, నగేష్, యేసు, చిన్న, కే కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవాలి

### ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ IPS



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈ నెల 28న మహబూబాబాద్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉన్నదని, జాతీయ లోక్ అదాలత్‌లో సామరస్య ధోరణితో రాజీ పడదగిన వివిధ కేసుల పై న్యాయ స్థానాల చుట్టూ తిరగకుండా కేసుల పరిష్కారం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ సూచించారు. అలాగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడే అవకాశం ఉన్న కేసులను లిస్ట్ అవుట్ చేసుకోవాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరు వర్గాల వారిని పిలిపించి చిన్నచిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఒకే గ్రామంలో ఉండే వారు ఎప్పుడూ కలిసి మెలిసి ఉంటారు కాబట్టి రాజీ మార్గమే రాజ మార్గమని వారికి అర్థమయ్యే విధంగా తెలపాలని జిల్లా సిబ్బందికి సూచించారు. అలా లిస్ట్ అవుట్ చేసిన కేసులలో అన్ని కేసులు రాజీ పడేటట్లు ప్రతి కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్స్, కోర్ట్ కానిస్టేబుళ్లు మరి యు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అలాగే న్యాయశాఖ అధికారులతో సమన్వయం ఏర్పరచుకొని విధులు నిర్వహించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ లో సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో కేసులు రాజీ కుదిరేలా చూడాలని అన్నారు. కోర్టు విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి రాజీ కాదగ్గ కేసులలో రాజీ శాతం పెంచాలని సూచించారు. కోర్ట్ ఆవరణలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహింపబడుతుందని అన్నారు. కావున ఈ అవకాశాన్ని రాజీ కాదగ్గ కేసులు ఉన్నవారు సద్వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

## ఎస్.జె.పీ.ఐ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జటావత్ నరేష్ నాయక్




**విశ్వంభర మహేశ్వరం:** సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జటావత్ నరేష్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కేవీ గౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేవీ గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చామకూర రాజు ఆదేశాల మేరకు జటావత్ నరేష్ నాయక్ ను తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడం జరిగిందని తెలిపారు. నూతనంగా నియమితులైన జటావత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, ఆయా సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి పాటుపడతానని అన్నారు. తనను పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కేవీ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి వేముల కొండల్ గౌడ్ తదితరులకు జటావత్ నరేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారగ్రహీతకు సన్మానం



**విశ్వంభర, రామన్నపేటం:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షులుగా పనిచేస్తున్న డాక్టర్ తండు కృష్ణ కౌండిన్యకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు డాక్టర్ రాహత్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించినందుకు కౌండిన్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సాహితీవేత్తగా, ఉపాధ్యాయుడుగా, ఎంతో గుర్తింపు పొందిన డాక్టర్ కృష్ణ కౌండిన్యకు ఈ పురస్కారం రావడం కళాశాలకే గర్వకారణమని అన్నారు. పురస్కార గ్రహీత డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు చాలా ఇష్టమని, ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయునికే ఉంటుందని, అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. తాను సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ, కష్టపడి ఉన్నత చదువులు చదివి, అంకితభావంతో తన వృత్తిని నిర్వహిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జెసి బాబు, ఐక్యుసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం. సునీత, ఎం.అనిత, డాక్టర్ రత్న మంజుల, డి.కిషన్, డాక్టర్ ఎం.బ్రహ్మం, డాక్టర్ ఎం.రవీందర్, డాక్టర్ రాచమళ్ళ శ్రీను తదితర అధ్యాపకులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామన్నపేట సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ జండగే హనుమంత్ కొండిబకు సీపీఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆసుపత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేసి, నూతన భవనం నిర్మించి ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేసి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. డాక్టర్లు స్థానికంగా రెగ్యులర్ గా ఉండాలని, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ మిషన్ అందుబాటులో ఉన్నప్పటికీ, ఆపరేటర్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. అదేవిధంగా రామన్నపేట, కొమ్మాయిగూడెం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసే ఆదాని అంబుజా సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రజారోగ్యాన్ని దెబ్బతీయొద్దని అన్నారు. పరిశ్రమ కాలుష్య తీవ్రతను పరిసర గ్రామాల ప్రజలందరికీ తెలియజేసేలా అవగాహన కల్పించేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు సమయాన్ని పొడిగించాలని జిల్లా కలెక్టర్ ను సీపీఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యవర్గ సభ్యులు బోయిన ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు కందుల హనుమంతు, భావండ్లపల్లి బాలరాజు, శానకొండ వెంకటేశ్వర్లు, మునికుంట్ల లెనిన్, ఎర్ర రవీందర్, కొమ్ము అంజయ్య, పల్లె సత్యం, గోగు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో బీజేపీ సభ్యత్వ నమోదు




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)పట్టణంలోని 283 వ బూత్ లో బూత్ అధ్యక్షులు రాగటి మత్స్యగిరి గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్ రెడ్డి, మండల అధ్యక్షులు గజరాజ్ కాశీనాథ్, మండల యువ మోర్చా అధ్యక్షులు ప్రశాంత్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు ఎండి అబ్బాస్, టౌన్ అధ్యక్షుడు లోడి వెంకటయ్య, మండల నాయకులు బొంత కృష్ణ, శ్రీనివాస్, కృష్ణ, యువ నాయకులు శివరాజ్, శ్రీను మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పనిచేసి పదవులకు వన్నె తేవాలి

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయ రాములు గౌడ్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో కల్లుగీత వృత్తిలో పుట్టి నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పచ్చిమట్ల మదర్ గౌడుకి ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాను, తండ పాండురంగం గౌడ్, సిల్వర్ బాలరాజ్ గౌడ్, ఇల్లందుల మల్లేశం గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో డైరెక్టర్లుగా ఎన్నికైన సందర్భంగా బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో కల్లుగీత కార్మిక సంఘం మోటకొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాములు గౌడ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పని చేస్తున్న నాయకులకు పదవులు ఇవ్వడం చాలా సంతోషకరమని వారు నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సన్మాన గ్రహీతలు పచ్చిమట్ల మదార్ గౌడ్, తండ పాండురంగము గౌడ్, సిల్వర్ బాలరాజు గౌడ్ లు మాట్లాడుతూ మా పనిని గుర్తించి మాకు పదవుల అందించిన స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ధన్యవాదాలు తెలుపుతున్నామని, అదేవిధంగా మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. మాపై చూపిన ప్రేమకు అనురాగానికి మేము కూడా నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తామని పదవులకు వన్నెతెచ్చే పద్ధతుల్లో గుర్తింపు తెచ్చే పద్ధతుల్లో ఉంటామని తెలిపారు. ఇట్టి కార్యక్రమం సంఘం మండల అధ్యక్షులు బొడిగె బిక్షపతి గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ గౌడ్, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కోల వెంకటేష్ గౌడ్, జిల్లా నాయకులు కొమ్మ గాని దశరథ గౌడ్, మండల నాయకులు గాజుల బాలరాజు,కల్లెం యాదగిరి, గాధగాని వెంకటేష్, పచ్చిమట్ల రమేష్, గుండ్లపల్లి శ్రీశైలం, కల్లూరి సత్యనారాయణ, అయిలి సత్యనారాయణ, బబ్బూరి సత్యనారాయణ, లోడే ఉప్పలయ్య,వంగాల స్వామి, దూడల కొమరయ్య, తండ రాములు, బొలగాని రాములు, బిస నరహరి, ఈ పాండరి, కల్లెం ఐలయ్య, కల్లెం వెంకటేష్, పచ్చిమట్ల అమరేందర్, పచ్చిమట్ల బాబు, పోతాగాని సత్యనారాయణ, మల్లం కృష్ణ, ఆలేటి నరసింహులు, ఈరగాని శంకరయ్య, పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బేసిక్ ట్రైనింగ్ క్యాంపు



**విశ్వంభర, హైదరాబాద్:** ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణా స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, సింగరేణి సంస్థల పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులకు స్థానిక రాష్ట్ర కార్యాలయం దోమల్ గూడలో బేసిక్ ట్రైనింగ్ క్యాంపు 18 సెప్టెంబర్ 2024 నుండి 25 సెప్టెంబర్ 2024 వరకు జరిగినది. భారత్ స్కౌట్, గైడ్ ఉద్యమానికి రాష్ట్ర గవర్నర్, ప్రెసిడెంట్ బుర్ర వెంకటేశం ప్రిన్సిపల్ సెక్రేటరి, విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వం వారు రాష్ట్ర చీఫ్ కమిషనర్ గా వ్యవహరిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమం లేని 18 సెప్టెంబర్ 2024న స్కౌట్, గైడ్ జండా ఆవిష్కరణ ద్వారా మొదలైంది. ఈ శిక్షణ కార్యక్రమంలో హైదరాబాద్ నల్లగండ, భద్రాద్రి కొత్త గూడెం, సింగరేణి, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, రంగారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాంగ్, పెద్దపల్లి, సంగారెడ్డి 12 జిల్లాల నుండి 27 మంది స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.ఈ శిక్షణా తరగతులలో మాస్టర్లు శిక్షణ పొంది తమతమ పాఠశాలలో విద్యార్థులకు "ఏమి నేర్పవలెనో బోధించడం జరిగింది. ఈ శిక్షణా తరగతులలో నేర్పిన అంశాలు, టెంట్ వేసుకోవడం విప్పి మడత పెట్టడం, జెండా ఎగురవేసే పద్ధతి, స్కౌట్ ప్రామిస్ మరియు స్కౌట్ లా మరియు మోటో, వివిద రకాల ప్రథమ చికిత్సా పద్ధతులు, టెంటు చుట్టు కట్టుకునె గ్యాడ్జెట్టులు, దిక్సూచి మరియు మ్యాపింగ్ మరియు మదింపు, ఫుట్ డ్రిల్ (మార్చ్ పాస్ట్), వ్యక్తి గత పరిశుభ్రత పరియు పరిసరాల పరిశుభ్రత, పాట్రోల్ మరియూ ట్రూప్ పద్ధతుల ద్వారా నాయకత్వ లక్షణాలు, పాట్రోల్ కుకింగ్ మరియు హైకింగ్, నైతిక విలువలు, దేశభక్తి గీతాలు మరియు క్యాంప్ ఫైరింగ్, సర్వమత ప్రార్థనలు. ఈ కార్యక్రమాలను చూడ దానికి తేది 24 సెప్టెంబర్ 2024న సాయంత్రం గవర్నర్ కార్యాలయం నుండి శ్రీ భవాని శంకర్, గవర్కర్ వ్యక్తిగత కార్యదర సందర్శించి ప్రశంసించారు. అరుణ్ కుమార్ రాజగోపాల్, లక్ష్మి నారాయణ, జాన్ సామ్యేల్, పరమేశ్వర్ మరియ లూయిస్ పాల్గొన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో ప్రశాంతంగా ముగిసిన రెండో దశ పోలింగ్

**అత్యధికంగా రియాసిలో 71.81శాతం ఓటింగ్**

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రెండో దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రెండో దశలో ఆరు జిల్లాల పరిధిలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరిగింది. 25 లక్షలమందికిపైగా ఓటర్లు ఓటు వేశారు. రెండో శ్రీనగర్ జిల్లాలోని ఎనిమిది స్థానాలకు ఓటింగ్ జరిగింది. రియాసిలో ఆరు, బుద్గామ్‌లో ఐదు, రియాసి, పూంచ్ జిల్లాల్లో మూడు చొప్పున, గందర్బల్‌లో రెండు స్థానాలకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు జమ్మూ కశ్మీర్‌లో 54 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా రియాసి జిల్లాలో 71.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, శ్రీనగర్ జిల్లాలో అత్యల్పంగా 27.31 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. ఇంతకు ముందు 18న జరిగిన తొలి దశలో 61.38 శాతం ఓటింగ్ శాతం నమోదైన విషయం తెలిసిందే. అత్యధికంగా కిష్త్వార్ జిల్లాలో 80.20 శాతం ఓటింగ్ జరగ్గా.. అత్యల్పంగా పుల్వామా జిల్లాలో 46.99 శాతం ఓటింగ్ నమోదైంది.

## ఏరియా హాస్పిటల్ ఆకస్మికంగా తనిఖీ




**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్ లోని మెడికల్ వార్డు, దయాలసిస్ సెంటర్, గైనిక్ వరల్డ్, క్యాన్సర్ బ్లాక్, డిఈఐసి, డిస్టిక్ ఎర్లీఇంటర్ వెన్షన్ సెంటర్, శిశు సంజీవని ప్రత్యేక నవజాతి, శిశు చికిత్స వార్డ్, ఐసీయూ లలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతూ అందుతున్న సేవల గురించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వర మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి వార్డులో మందులు, కావలసిన వైద్య పరికరాలు, అన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్లో, సీజనల్ వ్యాధులు ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున జిల్లా ఆసుపత్రికి ప్రజలు అధికంగా రావచ్చని అందుకు డాక్టర్లు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు.వైద్య పరీక్షలు వెంటనే నిర్వహించి, మందుల పంపిణీ చేయాలని, హాస్పిటల్ కి వచ్చే వారికి మర్యాదపూర్వకంగా వైద్య సేవలు అందించాలన్నారు. మెడికల్ ల్యాబ్, ఫార్మసీ, ఇన్, అవుట్, పేషెంట్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డిప్యూటీ సూపరిడెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్వర్, హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.

## ఆసుపత్రి మంజూరు చేయాలని వినతిపత్రం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి లేక వెల్జాల్, పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కి స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వెల్జాల్ గ్రామం లో ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లయితే మూడు మండలాల ప్రజలకు అనువుగా ఉంటుందని కాబట్టి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేసి వెల్జాల్ గ్రామ మరియు పరిసర ప్రజల చిరకాల కోరిక తీర్చాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జి శ్రీనివాస్ మూర్తి, మాజీ ఉప సర్పంచ్లు, బి నర్సింలు, ఎంఏ అజీజ్, మండల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, సీనియర్ నాయకులు సి .వెంకటరెడ్డి, పి. అశోక్ బాబు, మాజీ సింగల్ విండో డైరెక్టర్, తిరుమణి కృష్ణయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి 30న చలో హైదరాబాద్

## ఇందిరా పార్క్ వద్ద ధర్నా జయప్రదం చేయండి: ఐ.ఎఫ్.టీ.యూ



**విశ్వంభర, మహబూబాబాద్:** నాలుగు లేబర్ కోడ్ లు, మూడు నేర చట్టాల సవరణ రద్దుకై, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, స్కీం కార్మికులకు కనీస వేతనం 26,000 వేల రూపాయలు ఇవ్వాలని,అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కై సెప్టెంబర్ 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం ఇందిరాపార్క్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పాల్వంచలోని నటరాజ్ సెంటర్లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని స్వదేశీ జాతీయత దేశభక్తి పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ, ఆస్తులను, సహజ వనరులను, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అమ్మి వారి ఆస్తులు సంపదను పెంచుతుందని అందులో భాగంగానే కార్మిక హక్కులను కాల రాస్తూ ప్రభుత్వ సంస్థలు అన్నిటిని కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీ లకు తాకట్టు పెడుతుందని ఆయన అన్నారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా చేసి కార్మిక హక్కులను వారన్నారు. అలాగే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి న్యాయాధికారులకు న్యాయాధికారులు తగ్గించి, పోలీసు వ్యవస్థకు అధికారాలు పెంచిందని దీనితో ఏ పరిశ్రమలో కూడా అడిగే హక్కు లేకుండా చేయడం కోసమే ఈ నల్ల చట్టాలను తీసుకొచ్చిందని అందులో భాగంగా ప్రశ్నించే సంఘ నాయకులపై పిడి, ఉపా లాంటి కేసులు నమోదు చేస్తున్నారని వారు అన్నారు. నల్ల చట్టాలతో కార్మిక హక్కులను కాలువస్తూ పెట్టుబడి దారి వ్యవస్థకు కొమ్ము కాస్తూ చట్టాలను తయారు చేశారని వారు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే విధానాలను అమలు చేస్తుందని వీటిని వ్యతిరేకించాల్సిన అవసరం కార్మిక సంఘాలపై కార్మికులపై ఉందని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పకడ్బందీగా అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని లాభాల బోనస్ సింగరేణి పరిధిలో అందరికి వర్తింపజేయాలని కోరుతూ ఈ నెల 30న హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద జరిగే భారీ ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు నాయకులు శ్రీనివాస్, రాజేష్, నరసింహారావు, మల్లేష్, రమేష్, మంకెన వెంకటేశ్వర్లు, గోపి, భీమా, వెంకన్న, రాజు, సునీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే సర్టిఫికెట్స్ మళ్ళీ అప్లోడ్ చేయండి

## జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవు

## ఎస్.డీ.సీ సర్వర్ సమస్య పరిష్కారం, ఈ మీసేవ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్

**విశ్వంభర మహబూబాబాద్:** గత కొన్ని రోజుల నుంచి ఎస్.డీ.సీ సర్వర్ సమస్య వల్ల మీసేవ సర్వీసెస్ లో సాంకేతిక సమస్యలు వచ్చాయి. రెవెన్యూ కార్యాలయంలో మీసేవ నిర్వాహకులు, దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురి అయ్యారని, జూలై 10 నుండి సెప్టెంబర్ 12 మధ్య తేదీలలో వివిధ సర్టిఫికెట్ ల కోసం అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లకు మీసేవ యాక్సెస్‌పై సాంకేతిక సమస్య ప్రభావం చూపిందని దీని వలన పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్‌ల బ్యాక్‌లాగ్ ఏర్పడిందని అట్టి సమస్య పరిష్కరించబడినదని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని పరిష్కరించడానికి ఈ.ఎస్.డీ మీసేవ పెండింగ్‌లో ఉన్న అన్ని అప్లికేషన్‌లను మీ సేవ కేంద్రం ఆపరేటర్స్ లాగిన్‌లకు తిరిగి పంపించటం జరిగిందని, దరఖాస్తుదారులకు సూచనలతో కూడిన సమాచారాన్ని ఎస్.ఎం.ఎస్ రూపంలో పంపించటం జరిగిందని దరఖాస్తుదారులు ఎక్కడైతే మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్నారో అక్కడి మీసేవ కేంద్రానికి వెళ్లి సంబంధిత పత్రాలతో అప్లోడ్ చేయించుకోవాలని, మీ సేవ ఆపరేటర్లు లు తప్పనిసరిగా పత్రాలను మళ్లీ అప్‌లోడ్ చేసి సమర్పించాలని సంబంధిత అధికారులు సమర్పించిన దరఖాస్తులను సమీక్షించి వాటిని ఆమోదిస్తారన్నారు. పునఃసమర్పణకు ఎటువంటి ఛార్జీలు ఉండవని సెప్టెంబర్ 13, 2024 తర్వాత దరఖాస్తులు సాధారణంగా ప్రాసెస్ చేయబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా మీసేవ అధికారి ప్రశాంత్ మరియు టీ.జీ. ఆన్లైన్ ఉమ్మడి జిల్లా డిస్ట్రిక్ మేనేజర్ దుర్గం రాకేష్ తో కలిసి జిల్లాలోని నెల్లికుదురు మరియు తొర్రూరు మండలాల లోని మీసేవ కేంద్రాలలో ఆపరేటర్లు నిర్వహిస్తున్న ధరఖాస్తుల అప్ లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అదే విధంగా ఈ.ఎస్.డీ మీసేవ నిర్ణయించిన రుసుం కంటే అధిక రుసుం తీసుకోకూడదని హెచ్చరించారు.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వైద్య శిబిరం ఏర్పాటు

**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సి వెంకన్న నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా షాద్ నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ హాజరై, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమమును ప్రారంభించారు. షాద్ నగర్ శాసనసభ్యులు మాట్లాడుతూ మన కాలేజీ చుట్టూ, కాలేజీ లోపల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన కనీస ధర్మం అని విద్యార్థులకు తెలియజేశారు. కాలేజీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, సమాజానికి ఆదర్శంగా నిలబడాలని తెలియజేశారు. జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరై, విద్యార్థులందరూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో కాలేజీ పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవడమే కాకుండా, మీ ఇండ్లలో, ఇంటి చుట్టుప్రక్కల కూడా పరిశుభ్రతగా ఉంచుకోవాలని, ఇలా పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల, వర్షాకాలంలో వచ్చే వ్యాధులబారిన పడకుండా ఉండగలుగుతామని మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి కాలేజీ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, సీజనల్ వ్యాధు లపట్ల అవగాహన, పోషకాహారం గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. మున్సిపల్ సిబ్బంది ఈ ఒక్కరోజు మీ కాలోజీకి పరిశుభ్రంగా చేయగలరు కానీ, మీ విద్యార్థులు తలుచుకుంటే ప్రతిరోజు కూడా కాలేజీనీ శుభ్రంగా ఉంచుకోగలుగుతారు అని తెలియజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం యొక్క ప్రతిజ్ఞ విద్యార్థుల అందరి చేత చేయించారు. కాలేజీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో మున్సిపల్ సిబ్బందికి మరియు జూనియర్ కాలేజీ విద్యార్థి నీ, విద్యార్థులకు మొత్తం 113 మందికి పరీక్షలు నిర్వహించి, వారికి కావలసిన మందులను వైద్య సిబ్బంది అందజేశారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీ సర్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, ఫార్మసిస్టు ఉదయ్ కుమార్, ఏఎన్ఎం మంజుల, ఆశాలు పుష్ప, షకీలా మరియు కాలేజీ బోధన సిబ్బంది మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ చెరువుపై హైడ్రా దృష్టి

## నవ్య చౌరస్తాలో భవనం కూల్చివేత

**విశ్వంభర, హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు మరింతగా దృష్టి సారించారు. బుధవారం ఉదయం హైడ్రా అధికారులు సర్వే చేపట్టారు. గోల్డెన్ కీ, వాణీ నగర్, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, వెంకట రమణ కాలనీలో రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. నవ్య చౌరస్తాలో అక్రమంగా కట్టిన భవనాన్ని రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. పలు నిర్మాణాల **కూల్చివేతలు :** పెద్దచెరువు కబ్జా చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కట్టారని హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో,? చెరువు పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇదే ప్రాంతంలో నిర్మాణాలు కూల్చి మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. అలాగే అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాల కోసం భవనాలను నిర్మించినట్లు హైడ్రా గుర్తించింది. కిష్టారెడ్డిపేటలో సర్వే నెంబర్ 164లో వాణిజ్యపరంగా నిర్వహిస్తున్న 3 ఐదంతస్తుల భవనాలను కూల్చివేశామని, అక్కడ ఎకరం ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. పటేల్ గూడలోని సర్వే నెంబర్ 12/2, 12/3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 25 నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని హైడ్రా గుర్తించింది. వాటిని తొలగించి 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని 51 ఎకరాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అలాగే రోడ్లను సైతం ఆక్రమిస్తూ పద్మావతి నగర్?లో ఏర్పాటు చేసిన అక్రమ లేవుట్‌కు సంబంధించిన ప్రహరీ గోడతో పాటు రెండు సెక్యూరిటీ గదులను హైడ్రా అధికారులు తొలగించారు. అమీన్‌పూర్‌లో ఓప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ, ఆట స్థలాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. ప్రొక్లెయిన్ సాయంతో ప్రహరీని కూల్చి దాదాపు 15 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబర్ 462లో 38 గుంటల ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలను తొలగించారు. ఆ దుకాణాలు స్థానిక మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డివిగా గుర్తించిన అధికారులు అతనిపై చర్యలకు ఉపక్రమించారు.



### ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన బాబు ప్రభుత్వం

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 16 మంది ఐపీఎస్ అధికారులను ప్రభు త్వం స్థానచలనం కలిగించింది. ఈ మేరకు బుధవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఐజీగా వినీత్ బ్రిజ్‌లాల్, పీ అండ్ఎల్ ఐజీగా ఎం రవిప్రకాశ్, ఇంటెలిజెన్స్ ఐజీగా రామకృష్ణను బదిలీ చేసింది. ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఫకీరప్ప, డీజీపీ కార్యాలయంలో డీఐజీ అడ్మిన్‌గా అమ్మిరెడ్డి, రోడ్ సేఫ్టీ అథారిటీ డీఐజీగా సీహెచ్ విజయరావు, శాంతిభద్రతల ఏఐజీగా సిద్ధార్థ్ కౌశల్, విశాఖ శాంతిభద్రతల డీసీపీగా మేరీ ప్రశాంతి, అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హాకు బాధ్యతలు అప్పగించింది. ఏపీఎస్పీ-3 బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక, ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీ రాధిక, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా ఆరిఫ్ హఫీజ్, పీటీవో ఎస్పీగా కేఎస్‌వీ సుబ్బారెడ్డిని నియమించింది. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని బాపూజీ అట్టాడకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్టీఆర్ కమిషనరేట్‌లో క్రైమ్ డీసీపీగా తిరుమలేశ్వర్‌రెడ్డిని నియమించగా.. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని శ్రీనివాసరావును ఆదేశించింది.

# 'టపాసులంటే భయం- తుపాకీ ఎలా కాల్చాడు?'

## 'బద్లాపుర్' హత్యాచారం నిందితుడి మృతిపై సీఐడీ విచారణ

**ముంబయి:** మహారాష్ట్ర బద్లాపుర్ లైంగిక వేధింపుల కేసులో నిందితుడి మృతిపై అనుమానాలు నెలకొన్న వేళ నేర పరిశోధన విభాగం సీఐడీ రంగంలోకి దిగింది. ఈ కేసును మహారాష్ట్ర సీఐడీ బృందం దర్యాప్తు చేస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బద్లాపుర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు అక్షయ్ శిందే సోమవారం పోలీసుల ఎదురుకాల్పుల్లో మృతి చెందాడు. విచారణ నిమిత్తం తలోజా జైలు నుంచి పోలీస్ వాహనంలో బద్లాపుర్ తరలిస్తుండగా- ముంబ్రా బైపాస్‌కు చేరుకున్న సమయంలో పోలీసు అధికారి తుపాకీని లాక్కున్న అక్షయ్ వారిపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అప్రమత్తమైన మరో పోలీసు అధికారి నిందితుడిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అక్షయ్‌తోపాటు పోలీసులు గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైన నిందితుడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుడు మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష కోసం ఠాణె నుంచి ముంబయిలోని జేజే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష దృశ్యాలను చిత్రీకరించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తునకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న వేళ, ఈ కేసులో మహారాష్ట్ర సీఐడీ బృందం విచారణ ప్రారంభించింది. నిందితుడు అక్షయ్ మృతికి సంబంధించి పోలీసుల వాహనాన్ని ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల బృందం పరిశీలించింది. ముంబ్రా బైపాస్ ప్రాంతం వద్ద ఘటనా స్థలాన్ని సీఐడీ బృందం పరిశీలించనుంది. ఆ సమయంలో వాహనంలో ఉన్న పోలీస్ సిబ్బంది వాంగ్మూలాలను తీసుకోనున్నారు. అలాగే నిందితుడి తల్లిదండ్రులు వాంగ్మూలాన్ని సీఐడీ బృందం నమోదు చేయనుంది. మా కుమారుడి హత్య వెనుక కుట్ర తమ కుమారుడి మృతిపై నిందితుడి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. అక్షయ్ మృతిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. తమ కుమారుడి హత్య వెనుకు పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తమ కుమారుడు అక్షయ్ ఒంటరిగా రోడ్డు దాటడానికి కూడా భయపడతాడని నిందితుడి తల్లి అల్కా శిందే చెప్పారు. అక్షయ్ టపాసులు పేల్చడానికే భయపడతాడని, అలాంటిది పోలీసులు నుంచి తుపాకీని ఎలా లాక్కున్నాడని ప్రశ్నించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్‌తో సంబంధాలు ఉన్న ఆ పాఠశాల యాజమాన్యాన్ని కాపాడేందుకే పోలీసులు నకిలీ ఎన్‌కౌంటర్ చేశారని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఆరోపించారు. ఈ కేసును బాంబే హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసుల చర్యలపై అనుమానాలు ఉన్నాయని ఎన్‌సీపీ శరద్ పవార్ వర్గం ఆరోపించింది. ఆత్మరక్షణ కోసం కాల్చి చంపినట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే చేతికి సంకెళ్లు ఉన్న వ్యక్తి తుపాకీని ఎలా లాక్కున్నాడని ఎన్‌సీపీ నేత జితేంద్ర అవద్ ప్రశ్నించారు. ఈ ఏడాది ఆగస్టులో బద్లాపుర్ కిండర్‌గార్టెన్ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేసిన సమయంలో అక్షయ్ టాయిలెట్‌లో ఇద్దరు నర్సరీ చిన్నారులపై లైంగికదాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పిల్లలు స్కూల్‌కు వెళ్లేందుకు భయపడటం వల్ల తల్లిదండ్రులు ఆరా తీయగా వెలుగులోకి వచ్చిన ఈ దారుణం దేశవ్యాప్తంగా ఆగ్రహం తెప్పించింది.

### ఆమనగల్లు ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన డి సి హెచ్ ఎస్




**విశ్వంభర, ఆమనగల్లు:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశంక ఆదేశాల మేరకు బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డి సి హెచ్ ఎస్) రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రం రికార్డులను పరిశీలించి వైద్యాధికారి, నర్సింగ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు సిహెచ్ సిలో నమోదైన విషజ్వరాల కేసులు, అందించిన చికిత్స గురించి ఆరా తీశారు. అదేవిధంగా ఓ.పి, ఐ.పి, గర్భిణి స్త్రీలకు సంబంధించిన రికార్డులు, కుక్క, పాము, కోతి కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రామా కేర్, గర్భిణీల డెలివరీకి, ఎమ్.సి.హెచ్, ప్రమాదాలకు గురైనవారికి చికిత్సలపై నూతనంగా విధుల్లో చేరిన నర్సులకు శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణీలకు సేవలందించుటకు స్పెషలిస్ట్ అయిన గైనకాలజిస్ట్ ను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిహెచ్ సి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పాము కాటు, కుక్క కాటు, కోతి కాటు కు అందుబాటులో ఉన్న మందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు మరియు సీజనల్ వ్యాధులు ప్రభలకుండ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిహెచ్ సి లో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ విధుల పట్ల ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. సిహెచ్‌లసిలో అన్ని రోగాలకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని డిసిహెచ్ ఎస్ రాజు సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర, వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ మహమూనా,హెడ్ నర్స్ ఏసుమణి, నర్సింగ్ ఆఫీసర్లు అలివేలు, జ్యోతి, సంపూర్ణ, దేవేందర్, మునీరా, ఫార్మాసిస్ట్ ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ వేణు, వైద్య సిబ్బంది గోపాల్ రెడ్డి, గుజ్జరి శ్రీను, ఉన్నారు.

# హైడ్రా మరింత బలోపేతం

## 169 మంది సిబ్బంది కేటాయింపు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో హైడ్రా బలోపేతం కోసం ప్రభుత్వం కొత్తగా సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 33 విభాగాల్లో 169 మంది సిబ్బందిని నియమిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్?తోపాటు ఇద్దరు ఎస్పీ ర్యాంకు హోదా ఉన్న అసిస్టెంట్ కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది సీఐలు, 16 మంది ఎస్సైలతోపాటు 60 మంది కానిస్టేబుళ్లను నియమించారు. అలాగే 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లును హైడ్రా కోసం కేటాయించారు. ముగ్గురు రిజర్వు ఇన్?స్పెక్టర్లు, ఆరుగురు రిజర్వు సబ్? ఇన్?స్పెక్టర్లు, సమాచారానికి సంబంధించి ముగ్గురు ఇన్ స్పెక్టర్లు, ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, అనలైటికల్ ఆఫీసరు, డిప్యూటీ అనలైటికల్ ఆఫీసర్, అసిస్టెంట్ అనలైటికల్ ఆఫీసర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్, అడిషనల్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్, సిటీ ప్లానర్, ముగ్గురు డిప్యూటీ సిటీ ప్లానర్, నీటిపారుదలకు సంబంధించి ఒక ఈఈ, ముగ్గురు డీఈలు, పబ్లిక్ హెల్త్ నుంచి ఇద్దరు డీఈలు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, ఆర్థిక శాఖ నుంచి ఒక డిప్యూటీ సెక్రటరీ, డిప్యూటీ కలెక్టర్, ముగ్గురు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్లను ప్రభుత్వం హైడ్రా కోసం నియమించింది. హైడ్రాకు డిప్యూటేషన్‌పై సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు : అలాగే ఎస్ఆర్వో, ముగ్గురు సూపరింటెండెంట్లు, ఫారెస్ట్ ఆఫీసర్?తో పాటు పీఆర్వో, పీసీబీ శాస్త్రవేత్త పోస్టులను ఏర్పాటు చేస్తూ ఆర్థిక శాఖ సిబ్బందిని కేటాయించింది. వారి జీతభత్యాలను కూడా ఖరారు చేసింది. పురపాలక శాఖ ప్రతిపాదలను పరిశీలించిన అనంతరం 169 మంది సిబ్బందిని కేటాయించినట్లు ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరంతా హైడ్రాకు డిప్యూటిషన్?పై పనిచేయనున్నట్లు వెల్లడించారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రాకు అదనపు సిబ్బంది కేటాయింపుతో నగరంలో దూకుడుగా పనిచేయనుంది. హైడ్రాను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే రాష్ట్ర సర్కార్ చర్యలు ప్రారంభించింది.

### మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి



**అమరావతి**:ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యురాలు కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆమె బుధవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. మాజీ ఎంపీ మాగుంట సుబ్బ రామిరెడ్డి సతీమణి. ఇటీవల వీరి కుమారుడు అనారో గ్యంతో మృతి చెందడంతో ఆమె కుంగిపోయారు. మూడు రోజుల క్రితం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను చెన్నై ఆసు పత్రిలో చేర్పించారు. పార్వతమ్మ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపాన్ని తెలిపారు. పార్వతమ్మ ఎంపీగా , ఎమ్మెల్యేగా విశేష సేవలందించారని కొనియాడారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల రాజకీయాల్లో మాగుంట కుటుంబానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. దశాబ్దాలుగా ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ స్థానిక ప్రజలతో మాగుంట కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. 1996లో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012లో కావలి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు.

### ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధికి 1.53 కోట్లు విడుదల

**విశ్వంభర, వరంగల్:** ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి పరిపాలన అనుమతుల పత్రాన్ని సెక్రటేరియట్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ కి వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అందించారు. ఎల్కతుర్తి జంక్షన్ వయ వరంగల్, మరియు సిద్దిపేట రహదారి కరీంనగర్ ని అనుసంధానం చేయడంలో ప్రధానమైనదని, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ దృష్టికి తీసుకురావడం జరిగింది. అదే విధంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఎల్కాతుర్తి జంక్షన్ ని నాలుగులైన్ రహదారిగా మార్చడంకోసం పనులు ప్రారంభించారు. మంత్రి పేర్కొన్న ఎల్కతుర్తి జంక్షన్ డెవలప్మెంట్, బ్యూటిఫికేషన్ కోసం, హన్మకొండ జిల్లా కలెక్టర్, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ సదరు రహదారిని సెప్టెంబర్ 12న సందర్శించి, ఎగ్జిక్యూటివ్స్ ఇంజనీర్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ని పూర్తి నివేదిక సమర్పించమని ఆదేశించడం జరిగింది. సదరు ప్రాథమిక అంచనాల ఆధారంగా, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా)వారు సమర్పించిన రూ 1.53 కోట్లు "ఎల్కతుర్తి ట్రాఫిక్ జంక్షన్ అభివృద్ధి" కోసం విడుదల చేయడం జరిగింది.

# టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల కేసు ఉపసంహరణ

## అత్యాచారం కేసు కొట్టివేత

**అమరావతి :** తెలుగుదేశం పార్టీకి చెందిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కు ఏపీ హైకోర్టు లో ఊరట లభించింది. ఓ మహిళ అతడిపై పెట్టిన లైంగిక వేధింపుల కేసును ఆమె ఉపసంహరించుకోవడంతో ఈ కేసును కోర్టు కొట్టి వేసింది. ఈనెల 5న ఆదిమూలం తనపై బలాత్కారం చేశారంటూ తిరుపతి ఈస్ట్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

బీమాస్ పారడైజ్ హోటల్‌లో తనను ఎమ్మెల్యే ఆదిమూలం పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేసి, అత్యాచారానికి పాల్పడ్డారని, అందుకు సంబంధించిన వీడియో టేపులను హైదరాబాద్‌లోమీడియాకు విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ విషయం ప్రసార సాధనాల్లో రావడంతో టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యేను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కేసు నడుస్తున్న క్రమంలో కేవీబీపురం మండలానికి చెందిన బాధిత మహిళ ఎవరూ ఊహించని విధంగా ఈనెల 20న హైకోర్టుకు హాజరై ఎమ్మెల్యేపై తాను పెట్టిన కేసు, అందులో పేర్కొన్న ఆరోపణలు అవాస్తవమని వివరించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం గత శుక్రవారం విచారణ చేపట్టింది. మూడవ వ్యక్తి ప్రమేయంతోనే మహిళ కేసు పెట్టిందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టి వేయాలని కోరారు. మరోవైపు బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అంశాలన్నీ అవాస్తవమని, ఈ మేరకు నోటరీతో కూడిన అఫిడవిట్‌ను బాధిత మహిళ కోర్టుకు సమర్పించిందని, అందువల్ల ఈ కేసును కొట్టి వేయాలని మహిళ తరఫు న్యాయవాది జితేందర్ సైతం కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు ఆదిమూలంపై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.



# నిజాయితీ లేకుండా అధికారం మీకు అంగీకారమేనా?

**ఢిల్లీ:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. తాను రాజకీయ పార్టీ నేతగా లేఖ రాడం లేదని.. సాధారణ పౌరుడిగా రాస్తున్నట్లు తెలిపారు. దేశ పరిస్థితిపై తాను ఆందోళన చెందుతున్నానన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని, దేశ రాజకీయాలను తీసుకెళ్తున్న తీరు యావత్ దేశానికి హానికరమని.. ఇలాగే కొనసాగితే మన ప్రజాస్వామ్యం, దేశం అంతమవుతుందన్నారు. పార్టీలు వస్తాయి.. పోతుంటాయని.. నాయకులు వస్తుంటారు.. పోతుంటారని.. కానీ, భారతదేశం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ దేశ త్రివర్ణ పతాకాన్ని ఎప్పుడూ సగర్వంగా ఎగురవేయడం మన బాధ్యత అన్నారు.

లేఖలో ప్రస్తావించిన ప్రశ్నలు..

దేశవ్యాప్తంగా ఇతర పార్టీల నాయకులను అన్ని రకాలుగా ప్రలోభాలకు గురి చేసి.. చివరకు ఈడీ, సీబీఐతో బెదిరింపులకు గురి చేస్తున్నారు. పార్టీలను విచ్ఛిన్నం చేసి ఇతర పార్టీల ప్రభుత్వాలను పడగొడుతున్నారు. ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టడం దేశానికి, ప్రజాస్వామ్యానికి మంచిదేనా? మీరు గానీ, ఆర్ఎస్ఎస్ నిజాయితీ లేకుండా అధికారం పొందడాన్ని అంగీకరిస్తారా? అంటూ ప్రశ్నించారు.

దేశంలోని కొంతమంది నాయకులను అవినీతిపరులని ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ వేదికలపై వ్యాఖ్యలు చేస్తున్నారు. వారంతా కొద్దిరోజులకే బీజేపీలో చేరారు. ఉదాహరణకు 28 జూన్ 2023న ఓ బహిరంగ సభలో ప్రధానమంత్రి ఓ పార్టీకి చెందిన నాయకుడిపై రూ.70వేలకోట్ల కుంభకోణం ఆరోపణలు చేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆ పార్టీని బద్దలుకొట్టి అదే నాయకుడితో ప్రభుత్వం ఏర్పాటు చేసి.. అవినీతిపరుడిగా పేరుతెచ్చుకున్న నాయకుడిని ఉప ముఖ్యమంత్రిని చేశారు. ఇతర పార్టీల అవినీతి నేతలను బీజేపీలో చేర్చుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాంటి బీజేపీని మీరు. ఆర్ఎస్ఎస్ ఊహించారా? ఇది చూస్తే బాధ అనిపించడం లేదా? అని లేఖలో ప్రశ్నించారు.

ఆర్ఎస్ఎస్ నుంచి పుట్టిన పార్టీ బీజేపీ. అది తప్పుదోవపడితే దాన్ని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత ఆర్ఎస్ఎస్‌పై ఉంది. తప్పుడు పనులు చేయకుండా ప్రధానిని అడ్డుకున్నారా? అంటూ మరో ప్రశ్న సంధించారు.

బీజేపీకి ఇకపై ఆర్ఎస్ఎస్ అవసరం లేదని లోక్‌సభ ఎన్నికల సమయంలో జేపీ నడ్డా అన్నారు. ఆర్ఎస్ఎస్ ఓ విధంగా బీజేపీకి తల్లిలాంటిది. జేపీ నడ్డా వ్యాఖ్యలు ప్రతి ఆర్ఎస్ఎస్ కార్యకర్తను తీవ్రంగా బాధించాయని తాను తెలుసుకున్నానన్నారు. ఈ విషయంలో మీరు ఏం చెప్పాలనుకుంటున్నారో యావత్ తెలుసుకోవాలనుకుంటుందన్నారు.

అందరూ కలిసి బీజేపీ నేతలు 75 సంవత్సరాల తర్వాత పదవీ విరమణ చేయాలని చట్టం చేశారు. దాంతో ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషివంటి కీలక నేతలు పదవీ విరమణ పొందారు. గత పదేళ్లలో ఖండూరి, శాంతకుమార్, సుమిత్రా మహాజన్ మొదలైన బీజేపీ నేతలు దూరమయ్యారు. ఈ నిర్ణయం ప్రధాని మోదీకి వర్తించదని అమిత్‌షా అంటున్నారు. ఎల్‌కే అద్వానీకి వర్తించింది.. ప్రధాని మోదీకి వర్తించదని మీరు అంగీకరిస్తారా? చట్టం అందరికీ సమానం కాదా? ప్రతి భారతీయుడి మదిలో ఈ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నలకు ఆలోచించి సమాధానం ఇస్తానని ఆశిస్తున్నానని కేజ్రీవాల్ లేఖలో పేర్కొన్నారు.

# సిద్ధరామయ్య భూముల కేసులో లోకాయుక్త విచారణ



**బెంగళూరు:** ముడా స్కామ్ కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించాలని బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశించింది. కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ఉత్తర్వులు ఇచ్చింది. మూడు నెలల్లోగా ముడా స్కామ్‌పై పూర్తిగా దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని మైసూర్ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ముడా స్కామ్‌లో సీఎంపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ స్నేహమయి కృష్ణ ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన జడ్జి సంతోష్ గజానన్ భట్, దర్యాప్తు చేసి డిసెంబర్ 24 నాటికి నివేదికను సమర్పించాలని పోలీసులను ఆదేశించారు. గవర్నర్ దర్యాప్తునకు ఆదేశించడాన్ని హైకోర్టు సమర్థించిన మరుసటి రోజే జడ్జి సంతోష్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

లోకాయుక్త దర్యాప్తు పారదర్శకంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు పిటిషనర్ స్నేహమయి కృష్ణ తరపున న్యాయవాది లక్ష్మీ అయ్యంగార్ అన్నారు. "కోర్టు ఆదేశాల ప్రకారం వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలి. మేము ఇంతకంటే ఏమీ ఆశించడం లేదు. దర్యాప్తులో నిజమే గెలుస్తుందని ఆశిస్తున్నా. పోలీసులు సాక్ష్యాల కోసం వెతకాల్సిన అవసర లేదని భావిస్తున్నా. ఎందకుంటే మేము అందించిన పత్రాలు, సాక్ష్యాలు అన్ని సమగ్రంగా ఉన్నాయని అనుకుంటున్నా" అని లక్ష్మీ తెలిపారు.

**'నేను భయపడటం లేదు'**

ముడా స్కామ్‌లో విచారణను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం సిద్ధరామయ్య పునరుద్ఘాటించారు. 'దర్యాప్తు విషయంలో నేను భయపడడం లేదు. ప్రత్యేక కోర్టు ఆదేశాల నేపథ్యంలో న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నా. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటా' అని సిద్ధరామయ్య తెలిపారు.

**ఇదీ కేసు**

అభివృద్ధి కోసం సిద్ధరామయ్య భార్య బీఎమ్ పార్వతికి చెందిన భూములు తీసుకున్న ముడా అందుకు బదులుగా చట్టవిరుద్ధంగా మైసూరులోని పలు ప్రాంతాల్లో 14 చోట్ల స్థలాలు కేటాయిచిందింది. సీఎం ఆదేశాల మేరకు ఆయన భార్యకు విలువైన స్థలాలను ముడా కేటాయించిందని ముగ్గురు సామాజిక కార్యకర్తలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీనివల్ల ఖజానాకు రూ.45 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఏడు రోజుల్లోగా ముడా స్కామ్ ఆరోపణలపై సమాధానం ఇవ్వాలని, ఎందుకు విచారణకు ఆదేశించకూడదో తెలపాలని ఆదేశిస్తూ గత నెల సీఎంకు గవర్నర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో విచారణకు అనుమతించవద్దని ఆదేశిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది. అలాగే ఆ నోటీసుల్ని వెనక్కి తీసుకోవాలని కోరింది. ఈ క్రమంలోనే ముడా స్కామ్ కేసులో సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు.

# అత్యంత నాణ్యంగా యాదగిరి గుట్ట లడ్డూ ప్రసాదం

- భక్తుల విశ్వాసాలకు తగ్గట్లుగా తయారీ
- ఆలయ ఈవో భాస్కర్ రావు వెల్లడి





విశ్వంభర, హైదరాబాద్: తిరుపతి లడ్డూ విషయంలో వివాదం తలెత్తిన తర్వాత యాదగిరి గుట్ట దేవస్థానం అప్రమత్తమైంది. భక్తుల నమ్మకం, విశ్వాసాలకు తగ్గట్లే ప్రసాదం నాణ్యతలో ఎలాంటి లోపం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. లడ్డూ తయారికీ ఉపయోగించే పదార్థాలను ప్రభుత్వ సంబంధిత శాఖల ధ్రువీకరణతోనే ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు విక్రయించే వంద గ్రాముల లడ్డూలను ప్రతిరోజూ 25 వేల నుంచి 28 వేల వరకు తయారీ చేస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇంకా అవసరమైతే అప్పటికప్పుడు సిద్ధం చేస్తామని, అందుకు అవసరమైన మానవవనరులు, యంత్రాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిని ప్రముఖ కంపెనీ మదర్ డెయిరీ ద్వారా కేజీ రూ.609కి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అవసరానికి తగ్గట్లు కంపెనీ నుంచి నెయ్యి తెప్పించుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో పరీక్షలు : నెయ్యి నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని డెయిరీ నిర్వాహకులు పంపిస్తారని ఈవో పేర్కొన్నారు. తాము కూడా నెయ్యి నాణ్యతను తెలుసుకునేందుకు హైదరాబాద్ నాచారంలోని ప్రభుత్వ ల్యాబ్‌కు పంపించి పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఆలయ లడ్డూ రుచి, నాణ్యత తగ్గకుండా, ఐదు రోజుల నుంచి ఒక వారం రోజుల వరకు నిల్వ ఉంటుందని ఆలయ వర్గాలు తెలిపాయి. చిరుధాన్యాలతో తయారీ చేసే లడ్డూ ప్రసాదాలను సైతం విక్రయిస్తున్నట్లు వెల్లడించాయి.

యాదాద్రి ప్రసాదాలకు భోగ్ సర్టిఫికెట్ గుర్తింపు వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో విక్రయించే ప్రసాదాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలు కలిగినవని చెప్పడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జారీ చేసిందని తెలిపారు. ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జాతీయ సర్టిఫికెట్ భోగ్ (బ్లిస్ ఫుల్ హైజీన్ ఆఫరింగ్ టు గాడ్) గుర్తింపు సైతం ఉందని వెల్లడించారు.

# కాంగ్రెస్ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది

- ఉమ్మడి నల్గొండ మంత్రుల అరాచకాలను ఎండగట్టండి
- బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్



విశ్వంభర, హైదరాబాద్: కాంగ్రెస్ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండాపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. ఉమ్మడి నల్గొండలో మంత్రుల అరాచకాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన నేతలతో కేటీఆర్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీని బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కేటీఆర్ చర్చించారు. పార్టీ చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను కేటీఆర్ నేతలకు వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, పార్టీని ముందుకు నడిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నేతలు మళ్లీ ఫ్లోరోసిస్ రక్కసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెరపైకి వస్తోందని జిల్లా నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే, అధికార పార్టీ అరాచకాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల ఆధ్వర్యంలో అధికార పార్టీ నేతలు ఎలా జనాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారో చెప్పారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి అడ్డగోలు వ్యవహారాలతో ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోందని.. స్థానిక సమస్యలపై పోరాడాలన్నారు. ఈ సందర్భంగా త్వరలో నల్గొండ జిల్లాలో పర్యటించి.. కాంగ్రెస్ అరాచకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో పాటు ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీత, నల్లమోతు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, రమావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, బూడిద భిక్షమయ్య గౌడ్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డీ... మీ ప్రభుత్వానికి కనీసం మానవత్వం ఉందా? : కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో విచక్షణారహితంగా నిరుపేదల ఇండ్లను కూల్చివేస్తున్న వైనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైడ్రా కూల్చి వేతలతో ప్రభుత్వం అనాగరిక చర్యలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. చిన్న పిల్లలు పుస్తకాలు తీసుకుంటాం అంటే కూడా సమయం ఇవ్వకుండా అధికారులు మెడలు పట్టి బయటికి నెట్టేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. చిన్న పిల్లల కళ్లముందే వాళ్ల తల్లిదండ్రులు పెట్రోల్ పోసుకుంటే.. వేదశ్రీ అనే చిన్న పాప ఆ బాధను చెప్తుంటే మనసున్న ప్రతి ఒక్కరిని ఆ సంఘటన కలచివేసిందన్నారు. కస్తూరిబాయి అనే మహిళ చెప్పుల దుకాణాన్ని బుల్డోజర్‌తో తీసి పారవేయటం అనేది మానవత్వం ఉన్న సర్కారు చేయాల్సిన పనేనా? అని ప్రశ్నించారు. సామాన్లు తీసుకుంటాం అంటే కనీసం గర్భిణులకు కూడా సమయం ఇవ్వారా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేదా? అని సూటిగా నిలదీశారు. హైడ్రా బాధితులు ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా తెలంగాణ భవన్‌కు రండి. న్యాయపరంగా, మీకు మేంఅండగా నిలుస్తాం. అని హైడ్రా బాధితులకు భరోసా నిచ్చారు.

# చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

- 44 ఏళ్లలో తొలిసారి !
- అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే చేశాం
- ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదన్న చైనా రక్షణ శాఖ



**ఢిల్లీ:** అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు చైనా ప్రకటించింది. పసిఫిక్ సముద్రంలోని లక్ష్యాన్ని ఇది ఛేదించినట్లు మొదటిసారి బహిరంగంగా పేర్కొంది. పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ ఈ ఖండాంతర క్షిపణి డమ్మీ వార్‌హెడ్‌ను అమర్చి స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8.44కు ప్రయోగించినట్లు చైనా రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఖండాంతర క్షిపణి ముందుగా నిర్ణయించిన లక్ష్యానికి విజయవంతంగా చేరుకుందని తెలిపింది.

'ఈ ప్రయోగం మా దళాల శిక్షణ, ఆయుధశక్తి, నిర్ణీత లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం వంటి అంశాలను విశ్లేషించేందుకు ఉపయోగపడుతుంది. మా వార్షిక శిక్షణలో భాగంగా ఇది సాధారణంగా జరిగే విషయమే. ఖండాంతర క్షిపణి ప్రయోగంపై సంబంధింత దేశాలకు ముందే సమాచారం అందించాం. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఈ ప్రయోగం జరిగింది. ఏ దేశానికి వ్యతిరేకంగా నిర్దేశించినది కాదు' అని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనలో చెప్పింది.

**తొలిసారి 1980లో**

44 ఏళ్ల తర్వాత సముద్రంలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం ఇదే తొలిసారి. 1980లో మొదటిసారి ప్రయోగించింది. అప్పటి నుంచి అణ్వాయుధ పరీక్షలు భూఉపరితలం పైకి నిర్వహించేది. ఇక ఈ నెల ప్రారంభంలోనే ఉత్తర కొరియా తూర్పు సముద్రం వైపు అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇటీవల కాలంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో క్షిపణి కార్యకలాపాలు ఊపందుకున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో చైనా తాజా పరీక్ష ఆందోళనకరంగా మారింది. ప్రస్తుతం చైనా దగ్గర అణుసామర్థ్యాలు స్థాయికి మించే ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు చైనా మాత్రం తొలుత అణ్వస్త్రాల వినియోగానికి తాము వ్యతిరేకమని పేర్కొంది.

**2000 కిలోలను మోసుకెళ్లే చైనా డ్రోన్ - ఆ విషయంలో డ్రాగన్ జెట్ స్పీడ్!**

డ్రోన్ల విషయంలో శరవేగంగా చైనా పురోగతి సాధిస్తోంది. సిచువాన్ టెంగ్డెన్ సైన్స్ టెక్ ఇన్నోవేషన్ సంస్థ తయారు చేసిన అతిపెద్ద పౌర రవాణా డ్రోన్‌ను ఇటీవల పరీక్షించింది. రెండు ఇంజిన్లతో పనిచేసే ఈ డ్రోన్ ఏకంగా 2 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. ఆ డ్రోన్ రెక్కల పొడవు 16 మీటర్లు, ఎత్తు 15 అడుగులు గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా వినియోగించే సెస్నా 172 విమానం కంటే కొంచెం ఎక్కువ పొడవే ఉంటుంది.

# రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షా లు



**ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కి.మీ, గురువారం 30 నుంచి 40 కి.మీ వేగంతో అక్కడక్కడ గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటించింది. మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని పేర్కొంది.కాగా అల్పపీడనం ప్రభావంతో జంటనగరాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసింది. పలు జిల్లాలలో భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ కూడా ప్రకటించింది.

# కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై కాల్పులు

**అమెరికాలో మళ్లీ కలకలం!**



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై జరుగుతున్న దాడులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంతకు ముందు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరగగా, తాజాగా కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రిపూట తుపాకులతో దాడి చేశారు.

అమెరికాలో నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులుగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు బరిలో ఉన్నారు. అయితే వీరిపై జరుగుతున్న దాడులు సంచలనం సృష్టిస్తున్నాయి. తాజాగా కమలా హారిస్ పార్టీ సమన్వయ ప్రచార కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తులు తుపాకులతో దాడులకు తెగబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరిజోనాలోని డెమోక్రటిక్ పార్టీ సమన్వయ ప్రచార కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో కార్యాలయంలోని సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కార్యాలయం కిటికీల వద్ద నుంచి కాల్పులు జరిపినట్లు అధికారులు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అన్నారు.

# జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం

*** పార్లమెంటులో పోరాడతాం.. వీధుల్లోకి వెళ్తాం**

*** ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ**



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు పార్లమెంటులో పోరాడతామని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. దాని కోసం వీధుల్లోకి కూడా వెళ్తామని అన్నారు. బుధవారం జమ్మూలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రజల శ్రేయస్సును అంతం చేయడానికి, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), బయటి వ్యక్తుల ద్వారా ఈ ప్రాంతాన్ని నడపాలని బీజేపీ భావించిందని విమర్శించారు. అందుకే జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదాను లాక్కున్నదని ఆరోపించారు. 'లెఫ్టినెంట్ గవర్నర్ ఇక్కడ ఉండే వరకు, జమ్ముకశ్మీర్ ప్రజల కష్టాల వల్ల బయటి వ్యక్తులు ప్రయోజనాలు పొందుతూనే ఉంటారు' అని విమర్శించారు. కాగా, జమ్ముకశ్మీర్ ఎన్నికలు ప్రజల హక్కులకు సంబంధించినవని రాహుల్ గాంధీ తెలిపారు. 'రాష్ట్ర హోదాను మేం పునరుద్ధరిస్తాం. స్థానిక పరిశ్రమలను మా ప్రభుత్వం కాపాడుతుంది. సామాన్యుల కోసం బ్యాంకుల తలుపులు తెరుస్తాం' అని అన్నారు. మరోవైపు దేశ చరిత్రలో 1947 నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలను రాష్ట్రాలుగా, రాష్ట్రాలను రెండుగా విభజించిన సందర్భాలు ఉన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే ఏనాడూ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించలేదన్నారు. ఇది ప్రజలకు తీవ్ర అన్యాయమని అన్నారు. జమ్ముకశ్మీర్ ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని విమర్శించారు.

ఎన్నికల ముందు రాష్ట్ర హోదాను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని తామంతా భావించామని, అదే సరైన మార్గమని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే వారు (బీజేపీ) మొదట ఎన్నికలకు వెళ్లారని విమర్శించారు. 'ఏదైనా కారణం చేత బీజేపీ దీనిని చేయకపోతే, ఇండియా కూటమి ప్రభుత్వం మొదటి పని ఇదే. ఎందుకంటే రాష్ట్ర హోదా ఇవ్వడం మీ హక్కు' అని అన్నారు.

# బీజేపీలో చేరిన ఆప్ మాజీ నేత ప్రవీణ్ కుమార్

**ఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ నేత ప్రవీణ్ కుమార్ బుధవారం బీజేపీలో చేరారు. దిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ విధానాల నుంచి తాను ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఆ నేపథ్యంలో తాను బీజేపీలో చేరినట్లు చెప్పారు.

కాగా, గత రెండేళ్లుగా తన నియోజకవర్గంలో తాను ఏ పని చేయలేకపోయినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. 'ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. తద్వారా మేం వారి కోసం పని చేస్తాం. కానీ మనం వారి వద్దకు వెళ్లలేకపోతే, వారి కోసం పని చేయలేం. అప్పుడు ప్రజలకు మనం పనికిరాం. నేను గత రెండు సంవత్సరాలుగా నా నియోజకవర్గంలో ఏ పని చేయలేకపోయా. అందుకే బీజేపీలో చేరా' అని అన్నారు.




# రికార్డులకు దగ్గరలో రోహిత్, విరాట్, అశ్విన్

**విశ్వంభర, క్రీడావిభాగం :** బంగ్లాదేశ్‌పై తొలి టెస్టు విజయంతో జోష్ మీదున్న టీమ్ఇండియా, కాన్పూర్ వేదికగా జ రగబోయే రెండో మ్యాచ్ లోనూ విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ క్రమం లో ముమ్మురంగా టీమ్ఇండియా ఆటగాళ్లు నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే ఈ టెస్టులో భారత ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌ను ఊరిస్తున్న రికార్డులేంటో ఓ సారి తెలుసుకుందాం.

**రోహిత్ శర్మ**

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరగబోయే టెస్టు లో భారత జట్టు కెప్టెన్ రోహిత్ మూడు రికార్డులు ఊరిస్తున్నాయి. రోహిత్ ఈ టెస్టులో 8 సిక్సర్లు బాదితే, టీమ్ఇండియా తరఫున అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలుస్తాడు. ప్రస్తుతానికి వీరేంద్ర సెహ్వాగ్ (91) టీమ్ఇండియా తరఫున టెస్టు ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా ఉన్నాడు. అలాగే రోహిత్ ఈ టెస్టులో మరో 7 పరుగులు చేస్తే, టీమ్ఇండియా హెచ్ కోచ్ గౌతమ్ గంభీర్ (4,154) ను దాటేస్తాడు. ప్రస్తుతం రోహిత్ టెస్టుల్లో 4,148 రన్స్ చేశాడు. టెస్టుల్లో ఇప్పటికే 12 సెంచరీలు చేసిన రోహిత్, ఇంకొక శతకం బాదేస్తే మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంటాడు. టీమ్ఇండియా ప్లేయర్స్ రహానే, మురళీ విజయ్, పాలి ఉమ్రిగర్‌ను శతకాల్లో దాటేస్తాడు.

**అశ్విన్ రికార్డులు**

టీమ్ఇండియా ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్‌ను పలు రికార్డులు ఊరిస్తున్నాయి. కాన్పూర్ వేదికగా బంగ్లాతో జరిగే రెండో టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో అశ్విన్ మరో వికెట్ తీస్తే అరుదైన ఫీట్‌ను అందుకుంటాడు. టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 100 వికెట్లు తొలి భారతీయుడిగా నిలుస్తాడు.

**మరో 3 వికెట్ల దూరంలో..**

బంగ్లాదేశ్‌పై టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అవతరించడానికి అశ్విన్ మరో మూడు వికెట్లు తీయాలి. టీమ్ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ 31 వికెట్లు తీసి అగ్రస్థానంలో ఉన్నాడు. అశ్విన్ 29 వికెట్లు పడగొట్టాడు. ప్రపంచ వరల్డ్ ఛాంపియన్‌షిప్ 2023- 2025 సీజన్‌లో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్ వుడ్ 51 వికెట్లు పడగొట్టి అగ్రస్థానంలో నిలిచాడు. కాన్పూర్ లో జరిగే రెండో టెస్టులో అశ్విన్(48) మరో నాలుగు వికెట్లు తీస్తే తొలిస్థానాన్ని దక్కించుకుంటాడు. టెస్టుల్లో అత్యధిక సార్లు 5 వికెట్లు పడగొట్టిన ఘనత ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం షేన్ వార్న్(37) పేరిట ఉంది. కాన్పూర్ టెస్టులో అశ్విన్ మరోసారి 5 వికెట్లు తీస్తే షేన్ వార్న్ రికార్డును సమం చేస్తాడు. బంగ్లాదేశ్‌తో జరగబోయే రెండో టెస్టులో అశ్విన్ మరో 8 వికెట్లు సాధిస్తే, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలుస్తాడు.

ప్రస్తుతం ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లైయన్ 187 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం అశ్విన్ 180 వికెట్లతో రెండో ప్లేస్‌లో ఉన్నాడు. బంగ్లాతో జరగబోయే రెండో టెస్టులో అశ్విన్ మరో 9వికెట్లు తీస్తే ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ నాథన్ లియాన్ (530)ను అధిగమిస్తాడు. ప్రస్తుతం అశ్విన్ భారత్ తరఫున 522 వికెట్లు పడగొట్టాడు.

## విరాట్ అతి చేరువలో..

బంగ్లాతో జరిగే రెండో టెస్టులో టీమ్ఇండియా బ్యాటర్ విరాట్ కోహ్లీ పలు రికార్డులను సాధించే అవకాశం ఉంది. మరో 35 పరుగులు చేస్తే అన్ని ఫార్మాట్లలో కలిపి 27,000 రన్స్ చేసిన నాలుగో బ్యాటర్‌గా విరాట్ నిలవనున్నాడు. ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్, కుమార్ సంగక్కర, పాంటింగ్ మాత్రమే అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లలో కలిపి 27వేల పరుగులు చేశారు. అలాగే 600 కంటే తక్కువ ఇన్నింగ్స్ లలో 27,000 పరుగులు సాధించిన తొలి క్రికెటర్‌గా చరిత్రలో నిలిచిపోతాడు కోహ్లీ. కాగా, విరాట్ 593 ఇన్సింగ్స్‌ల్లోనే 26,965 పరుగులు చేశాడు.

**సచిన్ రికార్డుపై కన్ను**

మ రో మూడు క్యాచ్‌లు పడితే సచిన్(115) రికార్డును కోహ్లీ అధిగమిస్తాడు. టెస్టు ఫా ర్మాట్‌లో భారత్ తరఫున ఎక్కువ క్యాచ్‌లు అందుకున్న వారిలో తొలిస్థానంలో రాహుల్ ద్రవిడ్(210), వీవీఎస్ లక్ష్మణ్ (1 35) రెండో స్థానంలో ఉన్నారు. అలాగే కాన్పూర్ టెస్టులో విరాట్ మరో సెంచరీ బాదితే డాన్ బ్రాడ్‌మెన్(29) శతకాలను దాటేస్తాడు . అలాగే మరో 7 ఫోర్లు కొడితే టెస్టుల్లో కోహ్లీ బౌండరీల సంఖ్య 1,000కు చేరుతుంది.

**కాన్పూర్ వేదికగా...**

కాగా, కాన్పూర్ వేదికగా టీమ్ఇండియా 23 టెస్టులు ఆడింది. అందులో 7 మ్యాచ్‌ల్లో నెగ్గగా, 3 టెస్టుల్లో ఓటమిపాలైంది. మరో 13 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అలాగే బంగ్లాదేశ్‌తో టీమ్ఇండియా కాన్పూర్ వేదికగా సెప్టెంబరు 27నుంచి రెండో టెస్టులో తలపడనుంది.

# పీవీ సింధును మళ్లీ పోడియంపైకి తీసుకురావడమే నా లక్ష్యం



## అనూప్ శ్రీధర్

విశ్వంభర, క్రిడావిభాగం : ఫిన్‌లాండ్ వేదికగా జరగనున్న ఆర్కిటిక్ ఓపెన్ కోసం షట్లర్లు ప్రాక్టీస్ చేస్తున్న నేపథ్యంలో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కోచ్ అనుప్ శ్రీధర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సింధును మళ్లీ పోడియంపైకి తీసుకురావడమే ఆయన లక్ష్యమని వెల్లడించారు. గెలవాలనే తపన ఆమెలో ఉందని, ఆటలో స్థిరత్వం తీసుకురావడంలో తనకు సహకరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. "కొన్ని వారాల క్రితం నేను సింధు టీమ్‌తో మాట్లాడాను. ఈ నెల ప్రారంభం నుంచి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆమెకు నేను ట్రైనింగ్ ఇస్తున్నాను. మాకు ప్రోగ్రెస్ కనిపించింది. రెండు వారాల్లో ఐరోపాలో వేదికగా జరగనున్న టోర్నమెంట్లకు మేము వెళ్లనున్నాం. అయితే దీర్ఘ కాలిక ఒప్పందంలో లేకపోవడం వల్ల 2025 కోసం మేం ప్లాన్ చేయడం కష్టం. వచ్చే ఏడాది జరగనున్న టోర్నమెంట్లలో బె స్ట్ పెర్ఫామెన్స్ ఇవ్వాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే ప్రస్తుతం ఆటలో స్థిరత్వం తీసుకురావడంపైనే నేను ఫోకస్ పెట్టాను. ఈ మూడు వారాల్లో చాలా ప్రోగ్రెస్ కనిపించింది. కానీ, ఇంకా చేయాల్సింది చాలా ఉంది" అని అనూప్ వెల్లడించారు. త్వరలో ఫిన్‌లాండ్ వేదికగా జరగనున్న ఆర్కిటిక్ ఓపెన్‌తోనే సింధుతో అనూప్ పని చేయబోతున్నారంటూ సింధు తండ్రి తాజాగా మీడియాకు తెలిపారు. "బెంగళూరులో ఇక సింధు ట్రైనింగ్ కంటిన్యూ చేయదు. ఆమె హైదరాబాద్‌లోనే శిక్షణ తీసుకుంటుంది. ప్రస్తుత కోచ్ ఆగస్ సాంటసోతో ఒప్పందం ముగియనుండటం వల్ల ఫిన్‌లాండ్‌లో జరిగే టోర్నీ వరకు సింధుకు అనూప్ శ్రీధర్ కోచ్‌గా వ్యవహరిస్తారు. గతంలో పని చేసిన కొరియా కోచ్ పార్క్ సంగ్ పేరు కూడా పరిగణనలోకి వ చ్చినప్పటికీ, అతడిని కొనసాగించడం వల్ల సానుకూల ఫలితాలు రావట్లేదని భావించాం" అంటూ సింధు తండ్రి రమణ పేర్కొన్నారు. గత రెండు ఒలింపిక్స్‌లో సింధు మెరుగైన ప్రదర్శనతో అదరగొట్టింది. అయితే కామెన్వెల్త్ గేమ్స్ తర్వాత సింధు ఫామ్ కోల్పోయింది. ఈ క్రమంలో ఆమె గాయపడింది. గాయం నుంచి కోలుకున్నాక కూడా జరిగిన పలు టోర్నీల్లో ఆశించిన స్థాయిలో సింధు ప్రదర్శన చేయలేదు. దీంతో ఫ్యాన్స్ కాస్త ఆందోళన చెందుతున్నారు. అయితే విశ్వక్రీడలు అనగానే సింధు రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి ది గినప్పటికీ ప్రీ క్వార్టర్స్‌లో ఆమెకు నిరాశ తప్పలేదు. దీంతో క్రీడాభిమానులు కూడా ఆమె ఓటమి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

# 5 ఏళ్ల తర్వాత రంజీలోకి కోహ్లీ



**విశ్వంభర, క్రిడావిభాగం:** రంజీ ట్రోఫీ 2024-25 కోసం ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిన ప్రాబబుల్ జట్టును ప్రకటించింది. అయితే, ఇందులో విరాట్ కోహ్లీ పేరు ఉండడం గమనార్హం. 84 మంది ఆటగాళ్లతో కూడిన ఈ సంభావ్య జట్టులో కోహ్లితో పాటు, టీమిండియా వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్, నవదీప్ సైనీ కూడా ఉన్నారు. అయితే, గత సీజన్‌లో ఢిల్లీ తరఫున ఆడిన వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మకు చోటు దక్కలేదు. 2018 తర్వాత రంజీ ట్రోఫీ కోసం ఢిల్లీ సంభావ్య జట్టులో విరాట్ కోహ్లీకి చోటు దక్కడం ఇదే తొలిసారి. ఆ సమయంలో డీడీసీఏ విడుదల చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇషాంత్ శర్మ, శిఖర్ ధావన్, రిషబ్ పంత్, గౌతమ్ గంభీర్, నవదీప్ సైనీ వంటి టీమిండియా ఆటగాళ్ల పేర్లు వచ్చాయి. ఇప్పుడు ఆరేళ్ల తర్వాత మళ్లీ ఢిల్లీ జట్టు పొటెన్షియల్ లిస్ట్‌లో కింగ్ కోహ్లీ పేరు చోటు చేసుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ.. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ తర్వాత విశ్రాంతి దొరకనుంది. కాబట్టి న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు రంజీ మ్యాచ్‌లు ఆడతాడా అనే ప్రశ్న తలెత్తింది.

**కోహ్లీ చివరి రంజీ..?**

విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టి ఇప్పటికే 11 ఏళ్లు పూర్తయ్యాయి. అతను 2012-13 సీజన్‌లో చివరిసారిగా రంజీ ట్రోఫీలో ఆడాడు. ఆ రోజు ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున ఆడిన కోహ్లీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మొత్తం 57 పరుగులు చేశాడు. అప్పుడు ఢిల్లీ జట్టు కెప్టెన్‌గా వీరేంద్ర సెహ్వాగ్ కనిపించడం విశేషం. ఆ తర్వాత భారత జట్టులో శాశ్వత సభ్యుడిగా ఉన్న కింగ్ కోహ్లీ మళ్లీ దేశవాళీ రంగంలో పోటీకి దిగలేదు. ఇప్పుడు మళ్లీ విరాట్ కోహ్లీ పేరు ఢిల్లీ జట్టులో కనిపించింది. కాబట్టి, అతను రాబోయే రంజీ టోర్నమెంట్‌లో పాల్గొంటాడో లేదో చూడాలి.

**ఢిల్లీ ప్రాబబుల్ రంజీ జట్టు:**

విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, హిమ్మత్ సింగ్, ప్రన్షు విజయన్, అనిరుధ్ చౌదరి, క్షితిజ్ శర్మ, వైభవ్ కంద్‌పాల్, సిద్ధాంత్ బన్సాల్, సమర్థ్ సేథ్, జాంటీ సిద్ధు, సిద్ధాంత్ శర్మ, తిషాంత్ దబ్లా, నవదీప్ సైనీ, హర్ష్ త్యాగి, లక్షయ్ థరిజా (వికెట్ కీపర్), మాథుర్, శివంక్ వశిష్ఠ్, సలీల్ మల్హోత్రా, ఆయుష్ బడోని, గగన్ వాట్స్, రాహుల్ ఎస్ డాగర్, హృతిక్ షోకీన్, మయాంక్ రావత్, అనుజ్ రావత్ (వికెట్ కీపర్), సిమర్‌జీత్ సింగ్, శివమ్ కుమార్ త్రిపాఠి, కుల్దీప్ యాదవ్, లలిత్ యాదవ్, ప్రిన్స్ కె చౌదరి, శివమ్ కె చౌదరి, శివం కిషోర్ గుప్తా (వికెట్ కీపర్), వైభవ్ శర్మ, జితేష్ సింగ్, రోహిత్ యాదవ్, సుమిత్ కుమార్, అన్మోల్ శర్మ, కేశవ్ ధాబా, సనత్ సాంగ్వాన్, శుభమ్ శర్మ (వికెట్ కీపర్), ఆర్యన్ చౌదరి, ఆర్యన్ రాణా, భగవాన్ సింగ్, ప్రణవ్ రాజవంశీ (వికెట్ కీపర్), సౌరవ్ దాగర్, మణి గ్రేవాల్, కున్వర్ బిధూరి, నిఖిల్ సాంగ్వాన్, పునీత్ చాహల్, ప్రియాంష్ ఆర్య, యశ్ ధుల్, ప్రిన్స్ యాదవ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, సుయాష్ శర్మ, అర్పిత్ రాణా, దివిజ్ మెహ్రా, సుజల్ సింగ్, హార్దిక్ చారుహన్, హిమాన్షు , ఆయుష్ రాజ్, ధ్రువ్ కౌశిక్, అంకుర్ కౌశిక్, క్రిష్ యాదవ్, వంశ్ బేడి, యశ్ సెహ్రావత్, వికాస్ సోలంకి, రాజేష్ శర్మ, తేజస్వి దహియా (వికెట్ కీపర్), రౌనక్ వాఘేలా, మన్‌ప్రీత్ సింగ్, రాహుల్ గెహ్లాట్, ఆర్యన్ సెహ్రావత్, సిద్ధార్థ్ శర్మ, పర్వ్ ఎస్ యోగేష్ సింగ్, దీపేష్ బలియన్, సాగర్ తన్వర్, రిషబ్ రాణా, అఖిల్ చౌదరి, దిగ్వేష్ రాఠి, సార్థక్ రంజన్, అజయ్ గులియా.

# అప్పుడు ధోనీ సింహంలా దూసుకెళ్లాడు

## సీఎస్‌కే మాజీ ప్లేయర్

**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమిండియా దిగ్గజ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ మైదానంలో చాలా ప్రశాంతంగా ఉంటాడు. క్లిష్ట పరిస్థితుల్లోనూ తన భావోద్వేగాలను ప్రదర్శించడు. గెలిచినా.. ఓడినా ప్రశాంతంగా ఉంటాడు. అందుకే అతన్ని అందరూ మిస్టర్ కూల్ అని పిలుస్తారు. అలాంటి ధోనీ 2019 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. కోపంతో మైదానంలోకి దూసుకెళ్లాడు. మ్యాచ్ ఉత్కంఠగా మారిన సమయంలో బెన్ స్టోక్స్ వేసిన స్లోయర్ ఫుల్ టాస్‌ను నోబాల్‌గా ప్రకటించకపోవడంపై ధోనీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మైదానంలోకి దూసుకెళ్లి అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. అయితే ఈ బంతిని ముందుగా నో బాల్ ప్రకటించిన ఫీల్డ్ అంపైర్.. ఆ తర్వా తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఇది ధోనీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. అంపైర్లతో వాగ్వాదం దిగడం ఐపీఎల్ రూల్స్‌కు విరుద్ధం కావడంతో ధోనీ క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్నాడు. టోర్నీ నిర్వాహకులు ధోనీకి జరిమానా విధించారు. తాజాగా ఈ ఘటనను చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ప్లేయర్ మోహిత్ శర్మ గుర్తు చేసుకున్నాడు. ఈ సంఘటన జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మోహిత్




శర్మ.. ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో ఆ రోజు ఏం జరిగిందో వివరించాడు.

'ఆ రోజు నాతో పాటు చెన్నై ఆటగాళ్లంతా డగౌట్‌లో కూర్చున్నాం. ధోనీ మైదానంలోకి వెళ్లవద్దని కోరుకున్నాం. కానీ ధోనీ వెనక్కి చూడకుండానే మైదానంలోకి దూసుకెళ్లాడు. ప్రతీ ఒక్కరు .. సింహం గ్రౌండ్‌లోకి అడుగుపెట్టినట్లు ధోనీని చూశారు. ఆ ఘటనకు ముందే ధోనీ ఔటయ్యాడు. దాంతో కాస్త ఆగ్రహంగా ఉన్నాడు.

ఆ మ్యాచ్‌ను ధోనీనే ముగించాలనుకున్నాడు. సహజంగా ధోనీ ఇతరులకు మ్యాచ్‌ను ముగించే పనిని వదిలిపెట్టడు. కానీ ఆ రోజు ఔటయ్యాడు. ఔటయ్యాక వచ్చి కూర్చోగానే ఈ ఘటన జరిగింది. నోబాల్ ఇచ్చారా? లేదా అని మమ్మల్ని అడిగాడు. మేం అవును సిగ్నల్ ఇచ్చారని చెప్పాం. అంతే కోపంతో ధోనీ మైదానంలోకి దూసుకెళ్లాడు. తిరిగి వచ్చాక నన్ను లాప్‌టాప్ అడిగాడు. వీడియో అనలిస్ట్ ఆ వీడియోను చూపించి అది క్లియర్‌గా నో బాల్ అని చెప్పాడు.'అని మోహిత్ శర్మ గుర్తు చేసుకున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో 58 పరుగులతో రాణించి ధోనీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. తాను చేసిన పనికి క్షమాపణలు కూడా కోరాడు. అయినప్పటికీ అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ధోనీ కెరీర్‌లోనే ఈ ఘటన ఓ మాయని మచ్చగా మిగిలిపోయింది.

# ఐదుగురు ప్లేయర్ల రిటెన్షన్ మెగా వేలం కొత్త రూల్స్

**విశ్వంభర, క్రిడావిభాగం:** 2025 ఐపీఎల్ వేలానికి సంబంధించి రూల్స్ ఎలా ఉండనున్నాయని క్రికెట్ ఫ్యాన్స్‌లో రోజురోజుకు ఆసక్తి పెరిగిపోతోంది. ఈ మెగా వేలంగా రిటెన్షన్ పాలసీ ఎలా ఉండనుందోనని ఉత్కంఠ నెలకొంది. ఇదే విషయమై బీసీసీఐ ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీల సలహాలు, అభిప్రాయాలు సేకరించింది. తాజాగా బెంగళూరులో జరిగిన బీసీసీఐ జనరల్ మీటింగ్‌లో 2025 ఐపీఎల్ వేలానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు వేలం నిబంధనలు ఫైనలైజ్ చేసినట్లు తెలుస్తోంది. కొత్త రిటెన్షన్ పాలసీ విధానంలో రైట్ టు మ్యాచ్ కార్డ్ (Right To Match Card) విధానాన్ని బీసీసీఐ తిరస్కరించినట్లు తెలిసింది. అన్ని ఫ్రాంచైజీలు గరిష్ఠంగా ఐదుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకునే



అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. అందులో ముగ్గురు దేశీయ, ఇద్దరు విదేశీ ప్లేయర్లు ఉండవచ్చు. ఈ మేరకు బీసీసీఐ కొత్త రిటెన్షన్ పాలసీని త్వరలోనే అధికారికంగా వెల్లడించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మెగా వేలానికి ముందు ప్లేయర్ల రిటెన్షన్, రైట్ టు మ్యాచ్ కార్డ్ విధానంపై ఒక్కో ఫ్రాంచైజీ ఒక్కోలా బీసీసీఐకి సుచనలు చేశాయి. పలు ఫ్రాంచైజీలు ఎనిమిది మంది ప్లేయర్లను లేదా 2 రైట్ టు మ్యాచ్ కార్డ్ అప్షన్లు ఇవ్వాల్సిందిగా బీసీసీఐని కోరినట్లు తెలిసింది. కానీ, అవేవీ లేకుండా కేవలం ఐదుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకునే అవకాశం కల్పించాలని బీసీసీఐ తాజా సమావేశంలో నిర్ణయించినట్లు క్రీడావర్గాల సమాచారం. కాగా, రైట్ టు మ్యాచ్ కార్డ్ ఆప్షన్ అనుమతి ఇస్తే, ఏదైనా జట్టు తమ ప్లేయర్‌ను కొనుగోలు చేస్తే అదే ధరను సదరు ఫ్రాంచైజీకి చెల్లించి ఆటగాడిని తిరిగి తీసుకోవచ్చు. అలా ఆర్టీఎమ్ కార్డు ఉపయోగించి వేలంలో కోల్పోయిన ప్లేయర్లను ఫ్రాంచైజీలు తిరిగి దక్కించుకునే ఛాన్స్ ఉంటుంది. ఈ ఆర్టీఎమ్ పాలసీని బీసీసీఐ చివరిసారిగా 2018లో అనుమతించింది. ఇక ఈ మెగా వేలాన్ని ఈ ఏడాది నవంబర్ మూడు లేదా నాలుగో వారంలో నిర్వహించేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## భారత క్రికెట్‌లో సంచలనం..

# కుర్రాడు 498 పరుగులు బాదేశాడు!

**విశ్వంభర, క్రిడావిభాగం:** గుజరాత్‌కు చెందిన యువ క్రికెటర్ ద్రోణ దేశాయ్(18) స్థానిక టోర్నమెంట్‌లో విధ్వంసం సృష్టించాడు. దివాన్ బల్లూభాయ్ కప్ అండర్- 19 మల్టీ డే టోర్నమెంట్‌లో ఏకంగా 498 పరుగులు బాది ఔరా అనిపించాడు. ఈ ఇన్నింగ్స్‌లో 86 ఫోర్లు, 7 సిక్సర్లతో రప్ఫాడించాడు. ఈ టోర్నీలో సెయింట్ జేవియర్స్ స్కూల్‌కు ప్రాతినిథ్యం వహించిన ద్రోణ దేశాయ్, జేఎల్ ఇంగ్లీష్ స్కూల్‌పై మారాథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో క్వాడ్రాపుల్ సెంచరీతో చెలరేగిపోయాడు. త్రుటిలో 500 పరుగుల మార్క్‌ను చేజార్చుకున్నాడు.

**వీరబాదుడు**

గాంధీనగర్‌లోని శివాయ్ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం సెయింట్ జేవియర్స్ స్కూల్ - జేఎల్ స్కూల్‌కు మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన ద్రోణ దేశాయ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. దీంతో జేవియర్స్ జట్టు 844 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం 845 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జేఎల్ ఇంగ్లీష్ స్కూల్ కేవలం 122 పరుగులకే కుప్పకూలింది. దీంతో 712 పరుగుల తేడాతో సెయింట్ జేవియర్స్ ఘన విజయాన్ని అందుకుంది.

**'నాకు అది తెలియలేదు'**

అయితే 500 పరుగుల చేసే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయిన ద్రోణ దేశాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'గ్రౌండ్‌లో స్కోర్ బోర్డ్ లేదు. నేను 498 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బ్యాటింగ్ చేస్తున్నానని జట్టు తెలియదు. దీంతో స్ట్రోక్ ఆడటానికి వెళ్లి ఔటయ్యాను. కానీ, నేను చేసిన పరుగుల పట్ల సంతోషంగా ఉన్నాను. నేను ఏడేళ్ల వయసులో క్రికెట్ ఆడటం మొదలుపెట్టాను. నేను మంచి క్రికెటర్‌గా మారాలనేది మా నాన్న కల. 40 మందికి పైగా క్రికెటర్లకు కోచ్‌గా పనిచేసిన జేపీ సర్ (జయప్రకాశ్ పటేల్) వద్దకు నన్ను తీసుకెళ్లాడు. ఆయనే దగ్గరే శిక్షణ పొందాను. 8-12వ తరగతి వరకు కేవలం పరీక్షల సమయంలోనే స్కూల్ కు వెళ్లాను' అని దేశాయ్ చెప్పుకొచ్చాడు.

**అండర్- 19 జట్టులో చోటు కోసం!**

కాగా, ద్రోణ దేశాయ్ ఇప్పటికే గుజరాత్ అండర్- 14 జట్టుకు ఆడాడు. ఇప్పుడు అండర్- 19 జట్టులో స్థానం దక్కించుకోవాలని కృషి చేస్తున్నాడు. అందుకు తగ్గట్టుగానే కష్టపడుతున్నాడు. 498 పరుగుల మారథాన్ ఇన్నింగ్స్‌తో ద్రోణ దేశాయ్‌కు అండర్- 19 జట్టులో చోటు దక్కుతుందేమో చూడాలి. కాగా, యువ క్రికెటర్ మెరుపు ఇన్నింగ్స్‌పై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.



విశ్వంభర
V3 NEWS




# డ్రగ్స్ రహిత సమాజాం కోసం.. జూ.ఎన్టీఆర్ లఘుచిత్రం

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా థియేటర్లలో విడుదలకు రెడీగా ఉన్న సినిమాలకు సంబంధించి టికెట్ రేట్లు పెంచుకునేందుకు సర్కార్ దగ్గరికి వచ్చే ప్రొడ్యూసర్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొన్ని షరతులు విధించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ఇకపై ప్రతి సినిమాకు ముందు సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై అవగాహన కల్పించేలా వీడియోలు చేయాలనే షరతు పెట్టారు. ఈక్రమంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వానికి మద్దతుగా జూనియర్ ఎన్టీఆర్ పిలుపునిచ్చారు. " డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు అవ్వండి." అని టాలీవుడ్ హీరో జూ.ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఈమేరకు డ్రగ్స్ రహిత తెలంగాణపై యాంటీ నార్కోటిక్ టీమ్‌కు సహకరిస్తూ తనవంతు బాధ్యతగా బుధవారం ఎక్స్ వేదికగా ఎన్టీఆర్ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. " మన దేశ భవిష్యత్తు మన యువత చేతిలోనే ఉంది. కానీ కొంతమంది తాత్కాలిక ఆనందం కోసమో, క్షణికమైన ఒత్తిడి నుంచి బయటపడటం కోసమో లేదంటే సహచరుల ప్రభావం వల్లనో, స్టైల్ కోసమో.. మాదక ద్రవ్యాలపై ఆకర్షితులు కావడం చాలా బాధాకరం. జీవితం చాలా విలువైనది. రండి.. నాతో చేతులు కలపండి. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు అవ్వండి. రాష్ట్రంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, కొనుగోలు చేస్తున్నా, వినియోగిస్తున్నా.. వెంటనే యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు సమాచారం అందించండి " అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్‌మీడియాలో బాగా చక్కర్లు కొడుతుంది.

# రిలీజ్‌కు ముందే దేవర రికార్డుల వర్షం

మొదటి నుంచి నెగిటీవీ బాగా జరుగుతన్న దేవర సినిమాకు ఏ విషయంలోనూ కలిసి రావడం లేదనుకుంటున్న సమయంలో ఈ మూవీ ఓవర్‌సీస్ బుకింగ్స్ సినీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు ఆరేండ్ల తర్వాత జూ. ఎన్టీఆర్ దేవరతో ప్రేక్షకుల ముందుకు వస్తుండడంతో ఈ సినిమా కోసం ఫ్యాన్స్ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ మూవీ ఇటీవల ప్రతి విషయంలో హాట్ టాపిక్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ప్రారంభం నుంచి నెగిటివిటీనే ఎక్కువగా తెచ్చుకున్న ఈ సినిమా.. ట్రైలర్ విడుదలయ్యాక మరింతగా చర్చలకు దారి తీసింది. ఆపై ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా రద్దవడంతో దేవర సినిమాకు ఏదీ కలిసి రావడం లేదని అంతా అనుకున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ అలాంటి వార్తలన్నింటికి చెక్ పెడుతోంది. అనూహ్యంగా దేవర ఓవర్‌సీస్ బుకింగ్స్ సినీ వర్గాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ వైపు రెండు తెలుగు రాష్ట్రాల్లో దేవర టికెట్ రేట్లు పెంచుకునే వెసులుబాటు, ప్రీమియర్ షోస్‌లకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకమైన అనుమతులు రావడంతో దేవర టీం మంచి జోరులో ఉంది. ఈ క్రమంలో తాజాగా సినిమా ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ కూడా రికార్డులు తిరగరాస్తుండడంతో అభిమానులు సంబురాలు చేసుకుంటున్నారు.

అంచనాలకు అనుగుణంగానే ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ ఓ రేంజ్‌లో సాగుతోంది. ఓవర్‌సీస్‌లో చాలా రోజుల క్రితమే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ కాగా దేవర సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. అమెరికాలో బిగ్గెస్ట్ రికార్డ్స్ బుకింగ్స్, బెనిఫిట్ షోలతో రికార్డును సృష్టించిన దేవర చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. దీంతో ఎన్టీఆర్ ఆ ఘనత సాధించిన రెండో హీరోగా నిలిచారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలుగా 2 మిలియన్ డాలర్ల గ్రాస్‌ని నార్త్ అమెరికా మార్కెట్‌లో సాధించిన రెండో హీరోగా తారక్ నిలిచారు. తారక్ నటించిన ట్రిపులార్, ఇప్పుడు దేవర ఈ ఘనతను సాధించింది. ఇదిలా ఉంటే ఈ ఘనత సాధించిన మొదటి హీరోగా ప్రభాస్ నిలిచారు. సలార్, కల్కి 2898 ఏడీ చిత్రాలతో ప్రభాస్ ముందు వరుసలో ఉన్నారు. దేవర ప్రీమియర్ షోస్‌తో పాటు డే వన్ బుకింగ్స్ దాదాపు $4.7 - $5 మిలియన్ డాలర్లు అంటే సుమారు 37-42 కోట్ల వసూళ్లను రాబట్టనుంది. ఒకవేళ పాజిటివ్ మౌత్ టాక్ వస్తే రెండో రోజుకే ఇది $5.5 మిలియన్ డాలర్లు అంటే సుమారు 46 కోట్లకు చేరనుంది. మరోవైపు అమెరికాలో ఒక్కో టికెట్ ధర $30 డాలర్లుగా ఉండటంతో అభిమానులు పెదవి విరుస్తున్నారు. ఇంతా పెట్టి టికెట్ కొన్నాకా సినిమా ఏదైన తేడా కొడితే బాగోదని కామెంట్ చేస్తున్నారు. ఇదిలాఉండగా.. రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రం దేవర (Devara) సినిమా టికెట్ల అడ్వాన్స్ బుకింగ్స్ విషయంలో సోషల్ మీడియాలో పెద్ద రచ్చే జరుగుతుంది. కొంతమంది బుకింగ్స్ బాగా ఉన్నాయని, అల్రేడీ హౌస్‌ఫుల్స్ అయ్యాయని బుక్ మైషోలో రెండు రోజుల్లో 363k టికెట్లు అమ్ముడై కల్కి బుకింగ్స్‌ను దాటి పోయాయని అంటుండగా.. మరికొంతమందేమో అసలు టికెట్లు తెగట్లేవని, థియేటర్లు ఖాళీగా ఉన్నాయంటూ స్క్రీన్ షాట్లతో పోస్టులు పెడుతూ నెటిజన్ల బుర్రలు పాడయ్యేలా చేస్తున్నారు. వీటిలో ఏది నిజమో ఏది అబద్ధమో తెలియక ఫ్యాన్స్, సినీ లవర్స్ తలలు పట్టుకుంటున్నారు. అయినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రం దేవర ఫీవర్ మొదలైంది.

# ఎమోషన్‌తో కట్టిపడేసిన విశ్వం సాంగ్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కలయికలో వస్తున్న మూవీ 'విశ్వం'. కావ్య థాపర్ హీరోయిన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.ఇటీవల ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్‌గా 'మొరాకో మగువా' అనే పాట విడుదలైంది. ఈ రోజు మేకర్స్ సెకెండ్ సింగిల్ 'మొండి తల్లి పిల్ల నువ్వు' సాంగ్ ని రిలీజ్ చేశారు. చేతన్ భరద్వాజ్ మదర్ ఎమోషన్ ని ప్రజెంట్ చేసే పాటగా ఈ సాంగ్ ని కంపోజ్ చేశారు. అడుగే తడబడితే.. ఇదిగో.. నీ వెనకే ఉంటానులే.. చిన్నారి తల్లి! కలకో భయపడకు.. ఎపుడూ.. నీ కునుకై ఉంటానులే ..చిన్నారి తల్లి! మొండి తల్లి పిల్ల నువ్వు' అంటూ శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ మనసుని హత్తుకునే విధంగా వున్నాయి. సాహితీ చాగంటి తన లవ్లీ వోకల్స్ తో కట్టిపడేశారు. మదర్, డాటర్ బ్యాక్ డ్రాప్ లో వచ్చే ఈ సాంగ్ కథలోని ఎమోషనల్ డెప్త్ ని తెలియజేస్తోంది. ఈ పాటలో పాపతో హీరో గోపిచంద్ కు వున్న బాండింగ్ ని రివిల్ చేయనప్పటికీ వారి మధ్య వుండే ఎమోషన్ చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి కెవి గుహన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, శ్రీనువైట్ల పలు బ్లాక్‌బస్టర్స్‌తో అనుబంధం ఉన్న గోపీ మోహన్ స్క్రీన్‌ప్లే రాశారు. ఎడిటర్‌గా అమర్‌రెడ్డి కుడుముల, ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ మన్నె.దసరా కానుకగా అక్టోబర్ 11న సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.

# ఎనిమిదేళ్ల వైవాహిక బంధానికి రంగీలా హీరోయిన్ గుడ్‌బై

'యాయి రే యాయి రే' అంటూ నైంటీస్‌లో కుర్రాళ్లను ఉర్రూతలూగించిన భామ ఊర్మిళ మటోండ్కర్. ఇప్పుడీ భామ వార్తల్లో హైలెట్ అవుతోంది. మోడల్ కమ్ బిజినెస్ మ్యాన్ అయిన తన భర్త మోసిన్ అఖ్తర్ మీర్‌కి విడాకులు ఇచ్చినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. పలు నేషనల్ మీడియా ఛానెల్స్ ఈ వార్తను ప్రచారం చేయడంతో ఇప్పుడు సర్వత్రా ఈ చర్చ నెలకొంది. అయితే 4 ఫిబ్రవరి, 2016లో ఈ జంట ఊర్మిళ నివాసంలోనే దగ్గరి బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడారు. వయసులో తనకంటే పదేళ్ల చిన్న వాడైనా కూడా.. పర్సనల్ వాల్యూస్, ఇంట్రెస్ట్స్ కలవడంతో మోసిన్‌ను ఊర్మిళ పెళ్లాడింది. ఎనిమిదేళ్ల వివాహ బంధం అనంతరం ఈ జంట మ్యూచువల్ డైవర్స్ కి అప్లై చేసినట్లు సమాచారం. అయితే ఈ విడాకులకు అసలు కారణాలేంటనేది తెలియాల్సి ఉంది. ఊర్మిళ మటోండ్కర్ విషయానికి వస్తే.. శేఖర్ కపూర్ మాసూమ్ చిత్రం ద్వారా సిల్వర్ స్క్రీన్‌కి చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిచయమైన ఊర్మిళ.. రాంగోపాల్ వర్మ చిత్రాలైన 'రంగీలా, సత్య, కోన్' చిత్రాలతో తిరుగులేని తారగా ఎదిగారు. ఆ తరువాత 'జుదాయి, మస్త్, ఖూబ్‌సూరత్, ప్యార్ తునే క్యా కియా భూత్ మరియు ఏక్ హసీనా థీ' మొదలగు చిత్రాలలో కనిపించారు. చివరగా ఆమె 2014లో అజూబా అనే మరాఠి సినిమాలో నటించగా, 2018లో వచ్చిన బ్లాక్ మెయిల్ మూవీలోని ఓ పాటలో కనిపించారు. మరో వైపు ఆమె భర్త మోసిన్ అఖ్తర్ 'ఇట్స్ ఎ మ్యాన్స్ వరల్డ్, లక్ బై ఛాన్స్, ముంబై మస్త్ కల్లాందర్ మరియు బి.ఎ. పాస్' వంటి ప్రాజెక్ట్స్‌లో కనిపించారు. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీల విడాకులకు సంబంధించి వార్తలు బాగా వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్, కోలీవుడ్.. ఇలా అన్ని వుడ్స్‌లో ఫేమస్ అయిన వారు విడాకుల తీసుకుంటుండటం గమనార్హం. ఇప్పుడా లిస్ట్‌లోకి ఊర్మిళ కూడా చేరారు.





# మహేశ్‌బాబు గెటప్‌ను రాజమౌళి పట్టించుకోలేదా ?



ఆర్ఆర్ఆర్ తరువాత రాజమౌళి, హీరో మహేష్‌బాబుతో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఎప్పట్నుంచో ఈ కాంబినేషన్‌లో సినిమా కోసం ఎదురుచూస్తున్నారు మహేష్ అభిమానులు. ఎట్టకేలకు వారి కోరిక త్వరలోనే తీరబోతుంది. ఈ ఇద్దరి కలయికలో రూపొందనున్న చిత్రం 2025, జనవరిలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ప్రస్తుతం రాజమౌళి ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌లో వున్నారు. మహేష్ కూడా రాజమౌళి చిత్రంలో కనిపించబోయే మేకోవర్ పనిలో వున్నాడు. ఈ చిత్రంలో ఈ సూపర్‌స్టార్ గుబురు గడ్డం, లాంగ్‌హెయిర్‌తో కనిపించబోతున్నాడు. ఇటీవల పలు వేడుకల్లో మహేష్ ఇదే లుక్‌లో మీడియాలో కనిపించిన సంగతి తెలిసిందే. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రిని కలిసిన మహేష్‌ను ఆలుక్‌లో చూసి ఆయన ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. రాజమౌళి సినిమాలో తమ హీరో లుక్ అదిరిపోయింది అంటూ సంబరాలు చేసుకున్నారు. అయితే సాధారణంగా రాజమౌళి సినిమాల్లో హీరోలు మేకోవర్‌లో వున్నప్పుడు, అనుకోకుండా బయటి వెళ్లాల్సి వచ్చిన వాళ్ల మేకోవర్‌ను కనిపించడకుండా జాగ్రత్తపడేవారు. వీలున్నంత వరకు ఆ సినిమా ఫస్ట్‌లుక్‌ను రివీల్ చేసే వరకు పబ్లిక్ వేడుకల్లో కనబడకుండా వుండే వారు. ఇందుకు దర్శకుడు రాజమౌళి కూడా ఒప్పుకునేవారు కాదు. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు రాజమౌళి సినిమా నిబంధనలు పాటించనవారే.అయితే మహేష్‌బాబుకు మాత్రం ఈ విషయంలో రాజమౌళి ఎలాంటి షరతులు విధించలేదని సమాచారం. మహేష్ ప్రస్తుతం రాజమౌళి సినిమా మేకోవర్‌లో వున్నా తరచుగా ఫంక్షన్‌ల్లో పాల్గొంటూ, పబ్లిక్‌లో కనిపిస్తూ లాంగ్‌హెయిర్, గుబురు గడ్డంతో ఫోటోలు కూడా ఇస్తున్నారు. అయితే హీరో మేకోవర్‌లో ఇది ప్రారంభం మాత్రమేనని, ఇంకా రాజమౌళికి కావాల్సిన మేకోవర్‌లో మహేష్ రావడానికి ఇంకాస్త సమయం పడుతుందని అంటున్నారు రాజమౌళి సన్నిహితులు.

# అర్జున్ రెడ్డి బ్యూటీకి ఎట్టకేలకు ఓ బిగ్ ఛాన్స్!

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీల్రో ఉన్న వన్ ఆఫ్ ది టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్లలో ఒకడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ ధనుష్ రీసెంట్‌గా రాయన్‌తో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్న ధనుష్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో నటిస్తోన్న కుబేర షూటింగ్ దశలో ఉంది. ఇక ప్రస్తుతం ఇడ్లీ కడై టైటిల్‌తో రాబోతున్న సినిమా కూడా చేస్తున్నాడు. అయితే విజయ్ దేవరకొండ హీరోగా సందీప్ వంగ దర్శకత్వంలో వచ్చిన అర్జున్ రెడ్డి ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ సినిమా భారీ వసూళ్లు నమోదు చేయడంతో పాటు హీరో విజయ్ దేవరకొండ కి, హీరోయిన్ షాలిని పాండే కి మంచి గుర్తింపు ను తెచ్చి పెట్టింది. ఇద్దరి మధ్య రొమాన్స్, ముద్దు సన్నివేశాలు ఇలా ప్రతి ఒక్కదాని గురించి జరిగిన చర్చతో షాలిని పాండే గురించి చాలా వార్తలు వచ్చాయి. టాలీవుడ్ లో ఆమె బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో షాలిని పాండే కు అర్జున్ రెడ్డి తర్వాత ఆ స్థాయి విజయం దక్కలేదు. టాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లోనూ అడపా దడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఈ అమ్మడు ఎట్టకేలకు ధనుష్ సినిమాలో ఛాన్స్ ను దక్కించుకుంది. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే నిజమైతే లాంగ్ గ్యాప్ తర్వాత ప్రేక్షకుల ముందుకు రాబోతున్న అర్జున్ రెడ్డి భామను ధనుష్ సిల్వర్ స్క్రీన్‌పై ఎలా ప్రజెంట్ చేయబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో నిత్యమీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అరుణ్ విజయ్, సత్యరాజ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ (డెబ్యూ) నిర్మిస్తోన్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ ఇప్పటికే 2 పాటలను కంపోజ్ చేయగా.. ప్రస్తుతం పాటల చిత్రీకరణ కొనసాగుతున్నట్టు కోలీవుడ్ సర్కిల్ సమాచారం.

# నాలుగు రోజుల పోలీసు కస్టడీకి జానీ మాస్టర్

## అనుమతించిన కోర్టు.. థర్డ్ డిగ్రీ ప్రయోగించవద్దని ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:**

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు 4 రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. అయితే విచారణలో ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించవద్దని ఆదేశించింది. అవసరమైతే న్యాయవాది సమక్షంలో ప్రశ్నించాలని సూచించింది. కస్టడీకి అనుమతి లభించడంతో జానీ మాస్టర్‌ను ఈ నెల 28 వరకు నార్సింగి పోలీసులు ప్రశ్నించనున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్ అరెస్టయిన విషయం తెలిసిందే. మరోవైపు ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది.

**14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్**

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జానీ మాస్టర్ తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఓ మహిళా కొరియోగ్రాఫర్ రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మొదటిసారి లైంగికదాడి జరిగినప్పుడు తాను మైనర్‌ను అని చెప్పడంతో పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మతం మారాలని, పెళ్లి చేసుకోవాలని జానీ మాస్టర్ ఇబ్బందులకు గురిచేయడం, ఈ విషయం బయట చెబితే సినీ అవకాశాలు రాకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

**జానీమాస్టర్ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు**

సహాయక నృత్య దర్శకురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు జానీ మాస్టర్ అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు రిమాండ్ రిపోర్టును కోర్టుకు సమర్పించిన పోలీసులు, 2019లోనే బాధితురాలు జానీ మాస్టర్‌కు పరిచయమైనట్లు తెలిపారు. దురుద్దేశంతోనే జానీ మాస్టర్ బాధితురాలిని అసిస్టెంట్‌గా చేర్చుకున్నట్లు పేర్కొన్నారు. 2020లో ముంబయిలోని ఓ హోటల్‌లో బాధితురాలిపై జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడ్డారని, అప్పుడు బాధితురాలి వయసు పదహారేళ్లు మాత్రమేనని పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. గత నాలుగేళ్లలో బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్టు వివరించారు. ఈ విషయం బయటకు చెబితే సినిమా అవకాశాలు రాకుండా చేస్తానని బెదిరించడం సహా తన పలుకుబడి ఉపయోగించి బాధితురాలికి అవకాశాలు రాకుండా అడ్డుకున్నట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com